ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 172 పేజీలు: 12 వెల: 6.50

ఉభయ సభల్లో విపక్షాల ఆందోళనలు
గాజాలో యుద్ధం ఆగాలని 25 దేశాల సంయుక్త ప్రకటన
5లో

# పంటల వివరాలపై శాటిలైట్ సర్వే



మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, జలవనరుల శాఖపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

## ల్యాండ్ రీసర్వే తర్వాత వ్యవసాయ రికార్డుల నవీకరణ

### 47 లక్షలు పైగా 'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారుల ఇ-కెవైసి పూర్తి

### త్వరలో సాగునీటి సంఘాలతో వర్చువల్ సమావేశాలు

### జలవనరుల అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయరంగంలో ఆధునాత పద్ధతులను అవలంబిద్దాం,అన్ని రకాల పంటల్లో అత్యధిక దిగుబడులు సాధిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.ఉద్యాన పంటలను విస్తరిద్దామన్నారు.రాష్ట్రమంతటా ఏ సర్వే నెంబర్ భూమిలో ఏ పంటలు పండిస్తున్నారనే పంటల వివరాలు శాటిలైట్ సర్వే ద్వారా సేకరించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం భలభద్రాపురంలో చేపట్టిన శాటిలైట్ సర్వేతో సమగ్ర సమాచారం వెల్లడైందన్నారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన సమాచారం, శాటిలైట్ సర్వే సమాచారం సరిపోల్చాలని స్పష్టం చేశారు. ఒక ప్రాంతంలో ఒకే తరహా పంటలు వేసేలా రైతులకు దిశా నిర్దేశం చేయాలని చెప్పారు. రైతు సేవా కేంద్రం నుంచి ఈ మేరకు నిరంతరం సూచనలు, సహకారం వారికి అందించాలన్నారు. రీసర్వే అనంతరం రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన జరిగిన తర్వాత వ్యవసాయ రికార్డులు కూడా నవీకరించాలని అధికారులను ముఖమంత్రి ఆదేశించారు. మంగళ వారం సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై సిఎం చంద్రబాబు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. నాలుగు గంటలకు పైగా వ్యవసాయంఅనుబంధ రంగాలపై లోతైన చర్చజరిపి... రైతులకు మేలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అలాగే, జలవనరులశాఖ అధికారులతోనూ సమీక్షనిర్వహించి నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు.

**రైతులకు సహకారానికి ఎఐ చాట్ బోట్**

పంటల ప్రణాళిక, ఉత్పత్తులకు విలువ జోడింపు, రైతులకు సహకారం అందించేందుకు ఏఐ చాట్ బోట్ వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రైతులకు అవసరమైన సమాచారాన్ని వారికి అందేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఇప్పటి వరకూ 47,41,792 మంది రైతుల వివరాలతో అన్నదాత సుఖీభవ పథకం కింద ఇకెవైసి పూర్తయిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇ పంట ద్వారా అర్హులను గుర్తించాలని, రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయరంగం అభివృద్ధికి తాను అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని... త్వరలో సాగునీటి సంఘాలతో >>2



# సంక్షేమ హాస్టళ్లు ఇలాగేనా?

### సోషల్ వెల్ఫేర్, బిసి, గురుకుల హాస్టళ్లలో ఏమిటీ దుస్థితి?

### కోట్లలో వ్యయం ఏమవుతోంది?

### పనులన్నీ కాంట్రాక్టర్ల లబ్ధికోసమేనా?

### పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని సిఎస్‌కు హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** సాంఘిక సంక్షేమ, బిసి, గురుకుల హాస్టల్స్‌లో వసతుల లేమిపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసిందిజ హాస్టల్స్‌లో పరిస్థితులు చక్కదిద్దలేదంటూ అధికారులపై మండిపడింది.ఈ విషయంలో ఏమీ తెలియనట్లు ఎలా మిన్నకుండి పోతున్నారని ప్రశ్నించింది. ఏటా ప్రభుత్వంచేసే కోట్లాది రూపాయల ఖర్చులు ఎక్కడికి వెళుతున్నాయనే సందేహాన్నివ్యక్తంచేసింది. కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే >>2



మంగళవారం రాష్ట్రపతిని కలుసుకున్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్

# బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!

### రాజ్యసభ ప్రస్తుత డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కే దక్కే అవకాశం

**న్యూఢిల్లీ, జూలై 22:** ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీ చేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు పంపించారు. రాజ్యాంగంలోని 67(ఎ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తున్నది. బిజెపితోపాటు ఎన్డీయే పక్షాలకు చెందిన నేతకూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈనేపథ్యంలో జనతాదళ్ (యునైటెడ్) ఎంపి, రాజ్యసభ డిప్యూటీ >>2



# నా ప్రాధాన్యత రాజకీయాలే

### భవిష్యత్తులో నటిస్తానో లేదో చెప్పలేను, సిఎంతో సంప్రదించాకే ఏ నిర్ణయమైనా..

### పారదర్శకంగా ఉండాలన్నదే నా అభిమతం, ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌లో మార్పు రావడంలేదు

### మీడియాతో డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ విషయంలోనైనా నిక్కచ్చిగా తాను ఉంటానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేసారు. తాను విధానాలకు కట్టుబడి ఉంటానన్నారు. రాజకీయాల్లో పారదర్శకతే తనకు ఇష్టమన్నారు. మంగళవారం ఎపి సచివాలయంలో పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడారు.రాజకీయాంశాలపైన,తన కొత్త సినిమా హరిహర వీరమల్లు చిత్రం ప్రమోషన్స్‌పై ఆయన మాట్లాడారు,సినిమాలకు సంబంధించి తాను తీసుకునే ప్రతి నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెడతానన్నారు.ఆయన అభిప్రాయాలను గౌరవించే దిశలో తన నిర్ణయాలుంటాయన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పినప్పటికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌లో మార్పు రావడంలేదన్నారు.

ఇక హరిహర వీరమల్లు చిత్రం కోసం కష్ట పడి పని చేసాను.నేను రాజకీయాల్లోకి వెళ్లినందున సినిమాలు ఏదో తూతూ మంత్రగా చేస్తాడని అనుకోవద్దని ఇందులో చాలాకష్టపడ్డాను. కెరీర్ ప్రారంభంలో ఎలా చేశానో ఇప్పుడు కూడా మార్షల్ ఆర్ట్స్ కోసం అంతేకష్టపడ్డా. అయితే కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా ఉండడం వల్ల బాడీ ప్లెక్సిబిలిటీ పోయింది. శరీరం సహకరించలేదు. అయినా శ్రమించా. క్లైమాక్స్‌ను నేనేకొరియోగ్రఫీ చేసి డిజైన్ చేశానుఅని పవన్ చెప్పారు. జగన్ పాలనలో ఎన్నో కుటుంబాలు మద్యం కారణంగా బలయ్యారన్నారు. జనసేన పార్టీ కార్యాలయానికి అనేక మంది బాధితులు వచ్చారన్నారు. ఇప్పుడు మద్యం కుంభకోణంలో అనేక మంది అరెస్టు అవుతున్నారని తెలిపారు. ఒకవైపు నిధులుతినేశారు.. జనం ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు.ఇంకా బెదిరింపుల ధోరణితో జగన్, వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు. ఇటువంటి కాగితపు బెదిరింపులకి ఎవరూ భయపడరని.. ఇలాంటి తాటాకు చప్పుళ్లు చాలా చూశామని హెచ్చరించారు. ఎన్నో పోరాటాలుచేసి ఇక్కడ నిలబడ్డామని.. ఇంతటి ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చామని ఉద్ఘాటించారు. అవినీతి, అడ్డగోలుగా వ్యవహరించి కూడా ఇంకా ఎందుకు అరుస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి అరుపులను పట్టించుకోదని చెప్పుకొచ్చారు. వాళ్లు రప్పా రప్పా అంటే తాము మెడలు కోయించుకోవడానికి సిద్ధంగా లేమని హెచ్చరించారు. వాళ్లు కోస్తామంటే తాము మరోవైపు నుంచి మెడ చూపిస్తామా..? అని ప్రశ్నించారు. రాజధాని అమరావతి భూ సమీకరణపై తన నిర్ణయాన్ని ఇప్పటికే సిఎం చంద్రబాబుకి చెప్పానన్నారు. సిఎం కూడా తన అభిప్రాయంతో ఏకీభవించారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అందరిని ఒప్పించి వాళ్లనుకూడా భాగస్వాములుగా చేసి ముందుకు వెలుదామని >>2

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

### జనజీవనం అస్తవ్యస్తం

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడ నగరంలో మంగళవారం జోరు వాన కురిసింది.రోడ్లపై వాన నీరు చేరి వాహనచోదకులకు, పాదచారులకు ఇబ్బంది కలిగింది.నగరంలోని లోతట్టు ప్రాంతదారుల్లో వాన నీరు చేరింది.దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఏలూరు, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం,భీమవరం నగరాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి.. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో పంట సాగు పనులు ఊపందుకున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షంతో ఎట్టకేలకు సార్వా సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. మొగల్తూరు మండలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. పెనుమంట్రలో చిరుజల్లులు పడుతున్నాయి. వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. >>2



మంగళవారం ఉండవల్లిలో అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి లోకేష్

# మంగళగిరిపై ఐటి కంపెనీల ఆసక్తి!

### రెండోవిడత ఇళ్ల పట్టాల పంపిణికి చర్యలు

### నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం

**మంగళగిరి, జూలై 22, ప్రభాతవార్త:** ఐటి, ఇతర కంపెనీలు మంగళగిరికి వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, భవిష్యత్‌లో 50వేల మంది పనిచేసేందుకు అవకాశం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఉండవల్లి నివాసంలో అధికారులతో మంత్రి సమీక్షించారు. వివిధ పనుల పురోగతిని అధికారులు పవర్ పాయింట్ ప్రజెంజేషన్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరికి ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని, ఇందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. మంగళగిరిలో వివిధ ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నవారికి రెండో విడతలో 2వేల ఇళ్ల పట్టాల పంపిణీకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

మిగిలిన ఇళ్ల పట్టాల విషయంలోనూ పనులను వేగవంతం చేయాలని సూచించారు.నియోజకవర్గ వ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్ల నిర్మాణం!ప్రజలు నివసించేందుకు అనుకూలంగా వివిధ ప్రాంతాల్లో నియోజకవర్గవ్యాప్తంగా 10వేల టిడ్కో ఇళ్లను నిర్మించాల్సిన అవసరం ఉంది. >>2

# మాజీమంత్రి నారాయణ స్వామిని వీడియోకాల్‌తో విచారణ

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి నారాయణస్వామిని సిట్ బృంద వీడియో కాల్ ద్వారా విచారించినట్లు సమాచారం. తాను అనారోగ్యం కారణంగా విచారణకు రాలేనని నారాయణస్వామి స్పష్టం చేసిన సందర్భంలో సిట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబు తున్నారు. ప్రభుత్వం దుకాణాలు తీసుకొస్తే మద్యం వినియోగంతగ్గుతుందని, ప్రజలను మద్యంనుండి దూరం చేయవచ్చని తనకు చెప్పారని అంతకుమించి నూతన మద్యం విధానం గురించి తనతో ఏమీ చర్చించలేదు' అని గత ప్రభుత్వహయాంలోఎక్సైజ్‌శాఖ మంత్రిగా పనిచేసిన కె.నారాయణ స్వామి సిట్ >>2

## తిరుమలలో అన్ని వసతులతో విశ్రాంతి కేంద్రాలు

### శ్రీవారి సేవ విస్తరణకు నలుగురు కోఆర్డినేటర్లు

### రూ.4.35కోట్లతో ఒంటిమిట్టరామాలయంలో నూతన అన్నదాన భవనం

### టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు

# వైకుంఠమ్-3 క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై నిపుణుల కమిటీ!

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరాన్ని పరిశీలించేందుకు నిపుణులతో టిటిడి కమిటీ వేయనుంది. ఈ కమిటీ క్షుణ్ణంగా ఇప్పుడున్న పరిస్థితులను అంచనావేసి, ఆలయం వెలుపల క్యూలైన్లను నియంత్రించేందుకు అధ్యయనం చేయనుంది. ఆ తరువాత సమర్పించే నివేదిక ఆధారంగా భవిష్యత్ అవసరాల దృష్ట్యా తిరుమలలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు టిటిడి పాలకమండలి నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా పెరుతుండటంతో అందుకు అనుగుణంగా భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో లాంజ్‌ల తరహాలో విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటుచేయనుంది. అనువైన నిర్మాణాలు చేపట్టడంపై కన్సల్టెన్సీలతో కమిటీ ఏర్పాటు కానుంది. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులకు ఇతోధికంగా సేవలందిస్తున్న శ్రీవారిసేవ స్వచ్ఛంద సేవను మరింత విస్తరించి పటిష్ఠంగా అమలు చేసేందుకు నలుగురు >>2



మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి పాలకమండలి సమావేశం దృశ్యం

# గ్రామాలకు కొత్త పేర్లు!

### మార్పుల పరిశీలనకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు పేర్ల మార్పులు, చేర్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ అంశంపై అధ్య యనం చేసేందుకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.దీనిలో సభ్యులుగా ఏడుగురు మంత్రులను నియమించింది. వీరిలో అనగాని సత్య ప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బిసి జనార్ధన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లు ఉన్నారు. ఈ కమిటీకి కన్వీనరుగా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ ఉప మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రులు పరిపాలనా సౌలభ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా,రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతంచారిత్రక,సాంస్కృతికనేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకో వాలి. సామాజిక, ఆర్థిక,అభివృద్ధి కోసం అంతరాలు లేని విధంగా ప్రాంతాలను నిర్దేశించాలని పేర్కొంది. సరిహద్దులు, పేర్లపై ప్రజలు,ప్రజా ప్రతినిధులు నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని దిశా నిర్దేశం చేసింది.

# తోతాపురి మామిడి రైతుకు భారీ ఊరట

### క్వింటా మామిడికి మార్కెట్ ఇంటర్వెన్షన్ ధర రూ. 1490

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** తోతాపురి మామిడి రైతులకు ఉపశమనం లభించింది. క్వింటా మామిడికి మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను రూ.1490గా నిర్ణయిస్తూ కేంద్రం నుంచి ప్రకటన వెలువడింది. 50-50 నిష్పత్తిలో కేంద్రం, ఎపి ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ధరను చెల్లించనున్నాయి. నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానుంది. 2025-26 సంవత్సరానికి ఎంఐసికింద ధరల లోపం చెల్లింపు (పిడిపి)ను కేంద్రం ఆమోదించించింది. కేంద్రం నిర్ణయంతో ఎపిలో 1.62 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలుకు అవకాశం లభించినట్లైంది. మామిడి రైతులకు క్వింటాల్‌కు రూ.1,490.73లు చెల్లించనున్నారు. కేంద్రం, ఎపి ప్రభుత్వం సగం,సగం నిష్పత్తిలో ఈ మద్దతు ధర చెల్లించనున్నాయి. కేంద్రం నిర్ణయంతో తోతాపురి రైతుకు భారీ ఊరట లభించే >>2



తోటలో ఆరబోసిన తోతాపురి మామిడి కాయలు

# నకిలీ మద్యం ముఠా పట్టివేత

### 36 మంది అరెస్టు, 2200 లీటర్ల అక్రమ స్పిరిట్ స్వాధీనం

**విజయవాడ, జూలై 22, ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యంవ్యాప్తిని అడ్డుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక దాడుల ఫలితంగా భారీవిజయం నమోదు అయ్యింది. ఆధునీకరించిన నిఘా వ్యవస్థ, డేటా విశ్లేషణ ఆధారంగా చేపట్టిన చర్యల్లో ముప్పై ఆరు మందిని అరెస్టు చేయడంతో పాటు రెండు వేల రెండు వందల ముప్పది రెండు లీటర్లకు పైగా అక్రమ స్పిరిట్, నకిలీ మద్యం బాటిళ్లు, లేబుళ్లు, ప్యాకింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రధానంగా ప్రజారోగ్యం, నాణ్యమైన మద్యం సరఫరాపై దృష్టి సారించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు నకిలీ మద్యం నిర్మూలనపై పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ మీనా ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిఘా చర్యలు చేపట్టారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు డేటా ఆధారంగా స్పిరిట్ వినియోగంలో అనుమానాస్పద మార్పులను గుర్తించి ప్రత్యేక దాడులు నిర్వహించారు. జూన్ నెల 23 >>2



మంగళవారం తిరువనంతపురంలో మాజీ సిఎం అచ్యుతానందన్ భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్, సిఎం పినరై విజయన్

## రైల్వే పరీక్ష పేపర్ లీకేజీ కేసులో 8 మందికి జైలు

### సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో నేరారోపణలు రుజువు

**గుంతకల్లు రైల్వే, జూలై 22, ప్రభాత వార్త:** రైల్వే పరీక్ష పేపర్ లీకేజీ కేసులో 08 మంది రైల్వే సిబ్బందిపై నేరారోపణలు రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, ఒకొక్కరు రూ.5లక్షల రూపాయల జరిమానా విధిస్తూ అహ్మదాబాద్ సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు తెలిసింది.

## మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభ కోణం కేసులో నిందితులకు విజయవాడ ఎసిబి కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఆగస్టు1 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ కేసులో 11 మంది నిందితులకు రిమాండ్ ముగియడంతో సిట్ అధికారులు మంగళవారం కోర్టులో హాజరు పర్చారు.ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు నిందితులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి సహా 11 మందికి రిమాండ్ పొడిగించింది.

## ప్రకాశం బ్యారేజికి కొనసాగుతున్న వరద

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీకి స్థానిక వరద నీరుచేరుతోంది. దీంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఇన్‌ఫ్లో 20,478 క్యూసెక్కులు కాగా,25 గేట్లు అడుగు మేర ఎత్తి దిగువకు 18,125 క్యూసెక్కులు,కాల్వలకు 2,623 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇదే సందర్భంగా బ్యారేజీ బ్రాంచ్ కెనాల్స్‌కు నీటి విడుదల చేసారు.



మంగళవారం న్యూఢిల్లీలో కన్వరియ యాత్రలో పాల్గొన్న ఢిల్లీ సిఎం రేఖాగుప్త

# నా ప్రాధాన్యత రాజకీయాలే

>> చెప్పానని.. అందుకు సిఎం కూడా ఒప్పుకున్నారని తెలిపారు. మనం అమరావతి ఏకైక రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. అందుకనే వివాదాలు చేయకూడదని చెప్పానని అన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమని ఉద్ఘాటించారు.
తన తాజా సినిమా ప్రమోషన్లలో ఉన్నానన్నారు. హరిహర వీరమల్లు ప్రమోషన్స్ కోసం పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగి ప్రమోషన్స్ చేస్తున్నారు.. పవన్ సినిమా గురించి . ఈ క్రమంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. మంచి సినిమా కథలు వస్తే నిర్మాతగా వ్యవహారిస్తానని.. ఈ అంశాలన్నీ కూడా సిఎం చంద్రబాబుకు కూడా చెప్పానని గుర్తుచేశారు. సిఎంకు చెప్పిన అనంతరమే సినిమాల గురించి నిర్ణయాలు తీసుకున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.
జానీ ఫ్లాప్ గురించి అడగ్గా పవన్ సమాధానమిస్తూ.. నేను చిరంజీవి తమ్ముడు అయి ఉండి, అప్పటికి హిట్స్‌లో ఉన్నా జానీ ఫ్లాప్ అయ్యాక డిస్ట్రిబ్యూటర్స్, ఫైనాన్షియర్స్ నా ఇంటి మీదకు వచ్చేసారు డబ్బులు కోసం. అది సినిమా రిలీజయి అయిదు రోజులు, పది రోజుల తర్వాత కూడా కాదు. ఫస్ట్ షో పడింది బాగోలేదు అనగానే వచ్చేసారు సినిమా ఆడట్లేదు, మా డబ్బులు పోయాయి అని. అప్పుడు హిట్ అయితే నాకేం ఇచ్చారా అనే ప్రశ్న నామైండ్‌లో వచ్చింది. కానీ అక్కడ అది ఆలోచించరు. దానిని నేను కంప్లైంట్ చేయను. అప్పుడు అన్ని ఆర్థిక బంధాలే అని అనిపించింది. అప్పుడు నా రెమ్యునరేషన్ వెనక్కి ఇచ్చేసాను. సినిమా ఫ్లాప్ అయితే బాధపడమని ఇండైరెక్ట్‌గా చెప్పారు. అప్పుడు నేను ఒంటరిగా ఉన్నాను. ఆ సమయంలో 15 లక్షలు అప్పు చేశాను అవన్నీ క్లియర్ చేయడానికి. ఆ అనుభవం నన్ను బలమైన వ్యక్తిగా మార్చింది. జానీ ఫెయిల్యూర్ నాకు పాలిటిక్స్‌లో హెల్ప్ చేసింది. 2019లో ఓడిపోతే ఆ రోజులే గుర్తొచ్చాయి. ఫెయిల్యూర్ అనేది లైఫ్‌లో ఒక పార్ట్ అంతే అని అన్నారు. నా ప్రయారిటీ రాజకీయాలే ప్రస్తుతం. సినిమా నా లైఫ్‌లో భాగం. ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతర్వాత యాక్టింగ్ చేస్తానో లేదో తెలీదు. కానీ నిర్మాతగా నా పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ మీద మాత్రం సినిమాలు చేస్తాను అని తెలిపారు.

# శాటిలైట్ సర్వే

>> వర్చువల్ సమావేశాలు సైతం నిర్వహించి వారితో నేరుగా మాట్లాడతానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మరోవైపు ఖరీఫ్ సీజన్‌లో దక్షిణ కోస్తాలోని కొన్ని జిల్లాలు మినహా రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్‌లలో ప్రధాన ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని.. సమృద్ధిగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రాష్ట్రంలో 9.90 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగు జరుగుతోందని చెప్పారు. అయితే, వర్షాధారంగానే పంటలు పండించేలా పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు.

**ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గాలి**

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందులను అవసరానికి మించి వినియోగిస్తున్నారని... ఈ కారణంగా భూసారం తగ్గిపోతోందని... ఎరువులు, పురుగు మందులు ఏమేరకు వాడాలో రైతులకు వివరించి... వాటిని అధికంగా వినియోగించకుండా నియంత్రించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 36.71 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, అంతకుముందు ఏడాదితో 12 శాతం మేర తగ్గిందని అధికారులు వెల్లడించారు. అలాగే, 202425లో 1,733 మెట్రిక్ టన్నుల పురుగుమందులు రాష్ట్రంలో వినియోగం జరిగిందని తెలిపారు. అయితే, ఆర్గానిక్‌బయో ఫెర్టిలైజర్ల వినియోగంపై అవగాహన పెంచాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**పొగాకు, మామిడి కొనుగోళ్లపై కలెక్టర్లకు ఆదేశాలు**

ఈ సీజన్‌లో వ్యవసాయ అధికారులను ఇతర వ్యవసాయేతర విధులకు వినియోగించొద్దని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. హెచ్డీ బర్లీ, మ్యాంగో రైతులకు చెల్లింపులపైనా సీఎం మాట్లాడారు. మార్క్ ఫెడ్ నుంచి రెండు విడతల్లో బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆగస్టు 20 లోగా హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తోతాపురి మామిడి కొనుగోళ్లపై ఆయా జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన ముఖ్యమంత్రి ఆగస్టు 15 లోగా మామిడి రైతులకు కూడా డబ్బులు చెల్లించాలని చెప్పారు. విలువ జోడింపులో భాగంగా కవర్ బ్యాగుల్లో పండించిన తోతాపురి మామిడి పళ్ల నాణ్యతను సీఎం పరిశీలించారు. టేబుల్ వెరైటీ పండించడం ద్వారా దేశీయంగా, పల్ప్ లాంటి ఉత్పత్తులతో విదేశాలకు ఉత్పత్తులు పంపేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతుల నుంచి కొనుగోళ్లు జరపని కంపెనీలపైనా కఠినంగా వ్యవహరించాలని చెప్పారు.

## ఎసిబి కోర్టులో భావోద్వేగానికి గురైన చెవిరెడ్డి

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎసిబి కోర్టులో తన వాదనలు వినిపించుకునే క్రమంలో తుడా మాజీ చైర్మన్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి, తన సోదరుడు మద్యం కారణంగానే చనిపోయారని న్యాయాధికారికిచెప్పిన చెవిరెడ్డి.. తనను మద్యం వ్యాపారం చేయవద్దని తండ్రి చెప్పినట్టు వెల్లడించారు. తండ్రి, తమ్ముడు చనిపోవడంతోనే తాను లిక్కర్ జోలికి వెళ్లలేదని, చేయని తప్పుకు శిక్షణ అనుభవిస్తున్నందుకు బాధగాఉందని ఎమోషనల్ అయ్యారు.

# విచారణ

>> అధికారులతో చెప్పినట్లు సమాచారం. మద్యం విధానాన్ని అడ్డం పెట్టుకొని దోపిడీ జరిగినట్లు తన దృష్టికి ఎన్నడూ రాలేదని, రాజ్ కెసిరెడ్డి ఎవరో కూడ తనకు తెలియదని వివరించినట్లు తెలిసింది. విజయవాడలోని సిట్ కార్యాలయంలో సోమవారం విచారణకు రావాలంటూ ఆయనకు అధికారులు నోటీసులివ్వగా అనారోగ్య కారణాల రీత్యా విచారణకు నేరుగా హాజరుకాలేనని సమాచారమిచ్చారు. దీంతో తిరుపతిలోని నారాయణస్వామి నివాసానికి సిట్ అధికారులు ఓ ఇనస్పెక్టర్‌ను పంపి, వీడియోకాల్ ద్వారా ఆయన్ను విచారించారు. దాదాపు 20 నిముషాల పాటు ఆయను ్న ప్రశ్నించారు. ఏ ఒక్క ప్రశ్నకూ ఆయన సరైన సమాధానం చెప్పలేదని తెలిసింది.

# మంగళగిరిపై ఐటి కంపెనీల ఆసక్తి!

>> ఇందుకు అవసరమైన స్థల సేకరణపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. తాడేపల్లి రిటైనింగ్ వాల్, మంగళగిరి లక్ష్మీ ్మ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, మోడ్రన్ లైబ్రరీ, పార్క్‌లు, స్మశాన వాటికలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులపైనా మంత్రి సమీక్షి ంచారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్షి ్మ, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లు ఇలాగేనా?

>> పనులు జరుగుతున్నాయా? అని నిలదీసింది. మన ఇంట్లో పిల్లలను నేలపై పడుకోబెడతామా? అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా స్థాయిలో అధికారులు విధిగా హాస్టల్స్ సందర్శించాలని ఆదేశించింది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పించాలన్న నిబంధనలను గుర్తు చేసింది. తాగునీరు, పౌష్టికాహారం, బెడ్లు, బెడ్ షీట్లు, యోగ్యమైన మరుగుదొడ్లు, బాత్ రూమ్స్ ఉండి తీరాలని తేల్చి చెప్పింది. వసతుల కల్పన అంశంపై నిర్లక్ష్యం వహిస్తే, సాంఘిక, బిసి, గురుకుల సంక్షేమశాఖల ముఖ్యకార్యదర్శులను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. మీరే కనుక (సిఎస్) దృష్టి పెట్టి ఉంటే ఈ విధంగా ఉండవని వ్యాఖ్యానించింది. హాస్టల్స్ పరిస్థితులు మార్చాలన్న సంకల్పంతోనే స్వయంగా కోర్టుకు పిలిచామని చెప్పింది. ఇప్పటికైనా ఆ గైడ్‌లైన్స్ ప్రకారం చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. జిల్లా స్థాయిలో సీనియర్ అధికారులు క్రమం తప్పకుండా హాస్టళ్లను తనిఖీ చేయాలంది. ఇకపై నెలవారీ నివేదికలను అందజేసేలా చర్యలు తీసుకోవాలని సిఎస్‌ను ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. రాష్ట్రంలోని హాస్టళ్లలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మార్గదర్శకాల మేరకు వసతుల కల్పన లేవంటూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ వేసిన పిల్‌పై విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. గతంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా అధికారులతో హాస్టల్స్‌లోని పరిస్థితులపై నివేదిక తెప్పించుకున్న హైకోర్టు వాటిని పరిశీలించి విస్తుపోయింది. సంక్షేమ హాస్టళ్లలో దుస్థితి వర్ణనాతీత మని వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో మార్పులు చేసేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలతో సిఎస్ వ్యక్తిగతంగా విచారణకు రావాలని గతంలో ఆదేశించింది. ఆన్‌లైన్‌లో సిఎస్ విజయానంద్ విచారణకు హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారుల నివేదికలను చూస్తే హాస్టల్స్ ఎలా ఉన్నాయో అర్థమవుతుందని సిఎస్‌ను ఉద్దేశించి చెప్పింది. నర్సీపట్నంలోని ఓ సంక్షేమ హాస్టల్‌లో 228 మంది విద్యార్థినులుంటే ఒక్క మరుగుదొడ్డి మాత్రమే ఉందని గుర్తు చేసింది. విజయనగరం జిల్లాలోని అంధుల పాఠశాలలో 33 మంది విద్యార్థులుంటే, వారి సహాయ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని చెప్పింది. సిఎస్ స్థాయి అధికారి కదిలితేనే పరిస్థితుల్లో మార్పు వస్తుందని చెప్పింది. దీనిపై సిఎస్ విజయానంద్ స్పందిస్తూ, హాస్టల్స్‌లోని పరిస్థితులపై సమీక్ష నిర్వహించామని, కొత్త బిల్డింగ్స్ నిర్మిస్తామని, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొన్నిచోట్ల పనులు ప్రారంభమయ్యాయని, రెండేళ్లలో చేయబోయే పనులపై నివేదిక ఇస్తామని తెలిపారు.

# బీహార్ జెడి (యు) నేతకే ఉపరాష్ట్రపతి!

>> చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాల్లో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పిజి చేసిన ఆయన జర్నలిస్టుగా డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలాయేళ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్‌ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జెడి(యు) నుంచి తొలిసారి ఎంపిగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.
పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే పదవి నుంచి తప్పుకుంటున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు, ప్రధాని మోడీకి ,కేంద్రమంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
కాగా, మరో రెండేళ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వివి గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్. వెంకటరామన్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ, అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# యుఎఇ ఆర్థిక మంత్రితో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ ఆర్థిక మంత్రి హెచ్ఇ అబ్దుల్లా బిన్ ట్యోక్ ఆల్మరీ తో ఏపీ సీఎం చంద్రబాబు కీలక బేటీ అయ్యారు.,తన క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మంగళవారం రాత్రి జరిగిన బేటీలో లులూ అంతర్జాతీయ వాణిజ్య సంస్థ యూసప్ ఆలీ ఎంఎ,ఆ సంస్థ వాణిజ్య విభాగం ఎండీ ఆదీమ్ అహ్మద్‌తోను సీఎం చంద్రబాబు వాణిజ్య,పెట్టుబడుల అంశాలపై చర్చించారు.ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు తన "ఎక్స్" ఖాతాలో వెల్లడించారు.ఏపీ అభివృద్ధి శరవేగంతో జరుగుతున్న అంశంతో పాటు,రాష్ట్రంలో అనే జాతీయ,అంతర్జాతీయ సంస్థలు రూ.లక్షలకోట్లు పెట్టుబడులు ఆసక్తి చూపించడంతో క్షేత్రస్థాయిలో గ్రౌండింగ్ చేసిన విషయాన్ని వివరించారు. విజయవాడలో లులూ మాల్ ఏర్పాటు,అవసరమైన స్థల సేకరణ ఇతర కీలకంశాలుపై సీఎం యుఎఇ ఆర్థికమంత్రి,లలూ సంస్థ కీలక బాధ్యులతో చర్చించారు.ఈ చర్చలో చేసుకున్న ఒప్పందాలు,ఇతరంశాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.ఈ బేటీలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

# మద్యం ముఠా పట్టివేత

>> తేదీ నుంచి జూలై 22వ తేదీ వరకు కోరింగిపాలెం, పశ్చిమ గోదావరి, అనకాపల్లి, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో దాడులు జరిగాయి. నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే ఖాళీ బాటిళ్లు, సీలింగ్ యంత్రాలు, లేబుళ్లు, మిషన్లు స్వాధీనం చేసుకోవటం జరిగింది. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ జిల్లాలో ఉన్న కృష్ణ ఫార్మా కంపెనీ ఈ ముఠాకు మూలంగా గుర్తించబడింది. కరోనా మహమ్మారి సమయంలో తాత్కాలికంగా మంజూరైన అనుమతిని దుర్వినియోగం చేస్తూ, స్పిరిట్‌ను హ్యాండ్ రబ్ పేరుతో డెనేచర్ చేయకుండా నేరుగా నకిలీ మద్యం తయారీదారులకు పంపినట్లు విచారణలో తేలింది. కంపెనీ యజమాని మల్లికార్జున రావు నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడు రుత్తల శ్రీనివాస్ అలియాస్ అబ్దుల్ కలాం, చరణ్జీత్ సింగ్ సెథీలకు స్పిరిట్ సరఫరా చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.
ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ఇచ్చిన సమాచారంతో తెలంగాణ ఎక్సైజ్ అధికారులు స్పందించి, సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో జూలై 21 వ తేదీన ఎనిమిది వందల లీటర్ల స్పిరిట్, నకిలీ లేబుళ్లు, ఖాళీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ముంబయిలోని సరఫరాదారుల నుంచి తెచ్చిన ఖాళీ బాటిళ్లు, బ్రాండ్ లేబుళ్లు కూడా నిందితుల వద్ద లభించాయి. డెనేచర్ చేయని స్పిరిట్‌ను నేరుగా మద్యం తయారీలో వాడటం వల్ల ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కమిషనర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, నిఘా వ్యవస్థను ఆధునీకరించి, డేటా ఆధారంగా చర్యలు చేపట్టడం వల్లే ఈ ముఠాను ఛేదించగలిగామని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ, ప్రతి నేరంలో భాగమైన వ్యక్తిని గుర్తించి శిక్షించడానికి శాఖ పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని అన్నారు. నిఘా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో ఇటువంటి ముఠాలకు రాష్ట్రంలో తావు ఉండదని స్పష్టం చేశారు.
కృష్ణ ఫార్మా కంపెనీ లైసెన్సు రద్దు చేయాలని తెలంగాణ అధికారులను ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ కోరనుంది. అంతర్రాష్ట్ర సమన్వయంతో మిగిలిన నిందితులను గుర్తించి శిక్షించే ప్రక్రియ కొనసాగుతుంది. నకిలీ మద్యం వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ ఆపరేషన్‌తో ప్రజలకు నాణ్యమైన మద్యం అందే మార్గం సుగమం అయింది. నిబంధనలు పాటించే మద్యం వ్యాపారానికి భరోసా పెరిగింది. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చర్యలను మరింత వేగవంతం చేసింది.

# నిర్మాణంపై నిపుణుల కమిటీ!

>> కోఆర్డినేటర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీచేయనున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో 85 ప్రతిపాదనలతో టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో భక్తులకు సౌకర్యాలు, పలు అభివృద్ధిపనులు చేపట్టడంపై కీలకంగా చర్చించి నిర్ణయాలు వెలువరించింది. మధ్యాహ్నం బోర్డు తీర్మానాలు, ఆమోదం పొందిన అంశాలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు మీడియాప్రతినిధులకు వెల్లడించారు. కడపజిల్లా ఒంటిమిట్టలోని టిటిడి ఆధ్వర్యంలోని కోదండరామస్వామి ఆలయానికి రోజువారీగా విచ్చేస్తున్న భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు 4.35కోట్ల రూపాయలతో నూతన అన్నదాన భవనం నిర్మించేందుకు ఆమోదించారు. ఆగస్టునెల నుండి ఒంటిమిట్ట ఆలయంలో మూడుపూటలా అన్నప్రసాదం వితరణ చేయాలని నిర్ణయం. కడపలో వేల సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరుచేశారు. త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ)అమలుచేసి సామాన్యభక్తులకు త్వరితగతిన దర్శనం కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి 10లక్షల రూపాయలనుండి 20లక్షల రూపాయలకు వ్యయం పెంచారు. తిరుమలలోని శిలాతోరణం, చక్రతీర్థం ప్రాంతాలను మరింత ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్,డిపిఆర్ రూపొందించాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఒక సబ్‌కమిటీ ఏర్పాటుచేసి, ఆకమిటీ ఇచ్చే నివేదికప్రకారం తదుపరి చర్యలుతీసుకోనున్నారు. శ్రీవారి భక్తులు సైబర్‌మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు సైబర్‌సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుచేయడానికి ఆమోదం తెలిపారు. పరిపాలన సౌలభ్యంకోసం తిరుమలలో అన్ని విభాగాలు ఒకేచోట కేంద్రీకృతమయ్యేలా నూతన పరిపాలన భవనం నిర్మాణానికి ఆమోదించారు. తాళ్ళపాకలో అభివృద్ధి కార్యక్రమాలకు నిపుణులతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన 320 ఆలయాలకు 79.82లక్షల రూపాయల అంచనాతో 320 మైక్‌సెట్లను ఉచితంగా అందించాలని నిర్ణయించారు. ఒక్కోమైక్‌సెట్ ఖర్చు 25వేల రూపాయలుగా తెలిపారు. వేదపరిరక్షణలో భాగంగా 700మంది వేదపారాయణదారులను నియమించుకునేందుకు, అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు వేదపారాయణదారులకు దేవాదాయశాఖద్వారా 600మందికి నెలకు 3వేల రూపాయలు లెక్కన నిరుద్యోగభృతి చెల్లించేందుకు 2.16కోట్ల రూపాయలు టిటిడి నిధులు మంజూరుచేసేందుకు ఆమోదం తెలిపారు.
రాష్ట్ర హైకోర్టు తీర్పుననుసరించి టిటిడిలో కాంట్రాక్టు డ్రైవర్లుగా పనిచేస్తున్న 142మందిని క్రమబద్ధీకరించేందుకు టిటిడి బోర్డు ఆమోదిస్తూ ప్రభుత్వ ఆమోదానికి పంపేందుకు నిర్ణయించారు. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కాలినడకన తిరుపతి అలిపిరి, శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా మౌలిక వసతులు, లైటింగ్, భద్రత, ఆధ్యాత్మిక ఆహ్లాదకర వాతావరణం పెంపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని, అలాంటి ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదని ఛైర్మన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాంతారాం. జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి,టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

23-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయనం
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చతుర్దశి రా.2.30
ఆరుద్ర సా.5.57
వర్జ్యం : తె.5.22-6.53
దు.ఉ.11.49-12.41
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** సంతానానికి నూతన విద్యా, ఉద్యోగ యత్నాలు లభిస్తాయి. బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. కోపతాపాలకు దూరంగా ఉండండి. ప్రయాణాలు.

**మిథునం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కీలక నిర్ణయాలలో సొంతఆలోచనలు శ్రేయస్కరం.

**కర్కాటకం :**అకారణంగా వివాదాలు ఏర్పడినా జీవితభాగస్వామి సలహాతో పరిష్కరించుకొంటారు.

**సింహం:** కాంట్రాక్టులు లాభిస్తాయి. రాజకీయ, కళారంగాల వారికి అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**కన్య :** నూతన ప్రయత్నాలు సఫలమవుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుండును.

**తుల :** నూతన మిత్రులు పరిచయమై కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. సంఘంలో గౌరవమర్యాదలు పొందుతారు.

**వృశ్చికం:** చిరకాల కోరిక నెరవేరే సమయం. ఉద్యోగాలలో విశేష ఆదరణ పొందుతారు. వస్తు, వస్త్రా కొనుగోలు.

**ధనుస్సు:** బంధువుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మకరం:** తండ్రి నుండి ఆస్తి లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. శుభవార్తలు.

**కుంభం:** ఇంతకాలం పడిన కష్టానికి ఫలితం దక్కుతుంది. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు. కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

>> ఏలూరు జిల్లాలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. అమీనాపేట, అశోక్‌నగర్, ఆర్‌ఆర్‌పేట, పవర్‌పేట, పత్తేబాద్ ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం వరి చేలకు జీవం పోసింది. 20 రోజులుగా వర్షాలు పడకపోవడంతో నాట్లు వేసిన పొలాలు, వెదజల్లిన చేలు, నారుమళ్లు ఎండిపోయాయి. చాలా గ్రామాల్లో రైతులు ఎండిపోతున్న పైరును కాపాడుకునేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఆది, సోమవారాల్లో కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గత మూడ్రోజుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.
సోమవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి, గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో భారీ వర్షం కురిసింది. గుంటూరులో సగటున 110 మిల్లీ మీటర్లు, పల్నాడులో 80 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు అయింది. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.గుంటూరు జిల్లాలో కొండవీటి వాగు, పాల వాగు, కోటెళ్ల వాగుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పొలాల్లోకి నీరు చేరడం,రహదారులు, చప్టాలపై నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి విశాఖలో పలుచోట్ల వర్షం పడింది. విశాఖ నగరంలోని గాజువాక, కూర్మన్నపాలెం ప్రాంతంలో ఏకధాటిగా రెండు గంటలపాటు కురిసిన వర్షానికి డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపైకి చేరింది. అనకాపల్లి జిల్లాలోని కె కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో జోరు వాన కురిసింది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 22నఈ నెల 23న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. 24న అల్లూరి సీతారామ రాజు, విశాఖపట్నం, అనకాపల్లి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

## తోతాపురి మామిడి రైతుకు భారీ ఊరట

>> అవకాశం ఉంది.రైతులకు లాభాలు భారీగా లభించకున్న పెట్టుబడి చేతికి వస్తుందంటున్నారు.ప్రధాని నరేంద్ర మోడీ, వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ చర్య ధరల పతనాల నుండి రైతులను కాపాడటానికి అవకాశం లభించిందన్నారు. ఈ చర్య న్యాయమైన రాబడిని నిర్ధారించడంతో పాటూ గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సిఎం చంద్రబాబు,డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలో భూసేకరణ దశలో 13 ఇఎస్ఐ ఆస్పత్రుల మంజూరు

- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రం

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 13 ఈఎస్ఐ ఆసుపత్రులు మంజూరు చేసినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి శోభా కరంథ్లాజే తెలిపారు. అందులో ఇప్పటికే ఐదు పనిచేస్తున్నాయని, 4 నిర్మాణ దశలో,మరో నాలుగు భూసేకరణ దశలో ఉన్నాయని చెప్పారు. వీటిలో మొత్తం131 పోస్టులు ఖాళీగా ఉండగా,వాటిలో 93 పోస్టులె కాంట్రాక్ట్ పద్దతిలో భర్తీచేసినట్లు చెప్పారు. ఈ ఐదు ఆస్పత్రుల్లో గత ఐదేళ్ళలో 10.29 లక్షల మంది ఓపీ,43,205 మంది ఐపీ రోగులకు వైద్యసేవలందించినట్లు తెలిపారు.లోక్‌సభలో ఒంగోలు టిడిపి సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. కాకినాడ,విశాఖపట్నం,రాజమహేంద్రవరం,తిరుపతి,విజయవాడ ఆస్పత్రులు ప్రస్తుతం వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. మరో వైపు విజయనగరం ఆస్పత్రి 50% విశాఖపట ్నం ఆస్పత్రి 56%,అచ్యుతాపురం ఆస్పత్రి 25% నిర్మాణ పనులు పూర్తయినట్లు వివరించారు. నెల్లూరు ఆస్పత్రి నిర్మాణ భాధ్యతలు కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు వెల్లడించారు. మిగిలిన గుంటూరు, కర్నూలు,శ్రీకాకుళం ,శ్రీసిటీలకు మంజూరు చేసిన ఆస్పత్రులు భూసేకరణ దశలో ఉన్నట్లు తెలిపారు.

# రైల్వేలో 30వేల ఖాళీల భర్తీకి త్వరలో నోటిఫికేషన్

**గుంతకల్లు రైల్వే, జూలై 22,ప్రభాతవార్త** భారతీయ రైల్వేలో ఖాళీగా ఉన్న 30వేలకుపైగా ఎన్‌టిపిసి కేటగిరి పోస్టులను భర్తీ చేసేందుకు రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే జోన్‌లలో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ గ్రాడ్యుయేట్ లెవెల్ (ఎన్‌టిపిసి) చీఫ్ కమర్షియల్ టిక్కెట్ సూపర్‌వైజర్ కేటగిరీలో 6,235 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే స్టేషన్ మాస్టర్-5,623పోస్టులు,గూడ్స్ ట్రైన్ మేనేజర్(గూడ్స్ గార్డ్)-3,562పోస్టులు,అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-7,520పోస్టులు, సీనియర్ క్లార్ క్ కమ్ టైపిస్ట్ కేటగిరికి సంబంధించి-7,367చొప్పున మొత్తం 30,307 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఆర్ఆర్‌బిల ద్వారా భర్తీ చేసేందుకు నియామకాల ప్రక్రియను చేపట్టాలని రైల్వే శాఖ ఈ మేరకు నిర్ణయించినట్లు అధికార వర్గాల సమాచారం.

# ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్న తెలుగు పాస్టర్లు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఖతర్ దేశంలో చట్ట నిబంధనలకు విరుద్ధంగా మతప్రచారం చేస్తున్నారనే అభియోగంపై పోలీసులు అదుపులోకి తీసుకున్న 9 మంది ప్రవాస క్రైస్తవ పాస్టర్లకు ఊరట లభించింది. వీరిలో ముగ్గురు ఏపీకి చెందిన వారు కాగా, దేశం విడిచి వెళ్లకుండా వీరిపై ఉన్న నిషేధాన్ని తొలగించడంతో వీరంతా ఖతర్ నుంచి విడుదలై స్వస్థలాలకు చేరుకున్నారు. పశ్చిమ గోదావరి, విజయనగరం, కృష్ణా జిల్లాలకు చెందిన ఈ ముగ్గురూ క్రైస్తవ ప్రముఖ బోధకులు.

# శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణానికి నిధులు పెంపు



- అమలవుతున్న రూ.10లక్షలు స్థానంలో మూడు కేటగిరీల్లో చెల్లింపులు
- పాతబడిన భవనాలు తొలగింపునకుబోర్డు నిర్ణయం

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోబాటు ఇతర ప్రాంతాల్లోనూ సనాతన హిందూ ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోనికి తీసుకెళ్ళేందుకు ,మతమార్పిడులను అరికట్టేందుకు శ్రీవాణిట్రస్ట్ ద్వారా నిర్మించే ఆలయాలకు నిధులు మూడు కేటగిరీలుగా విడుదల చేయనున్నారు .ఇందుకు దీనిపై సుదీర్ఘంగానే చర్చించిన ప్రస్తుత టిటిడి పాలకమండలి పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకుంది. మారుమూలగ్రామాల్లోనేగాక ఎస్సీ,ఎస్టీ వెనుక బడిన ప్రాంతాలు, గిరిజన తాండాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించాలని టిటిడి ఇప్పటికే ఆమోదించింది. ఈ ఆలయాల నిర్మాణాలు పక్కాగా నిర్వహించేందుకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు ఇది వరకు 10లక్షలు రూపాయలు మాత్రమే విడుదలయ్యేది. ఈ నిధులు విడుదల ఇప్పుడు మూడు కేటగిరీల్లో చేపట్టనున్నారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి పాలకమండలి సమావేశం జరిగింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నేతృత్వంలో శ్రీవాణిట్రస్ట్ ద్వారా ఆలయాల నిర్మాణంపై సమీక్షించి అనుగుణంగా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నిరాదరణకు గురైన ఆలయాల ధూప దీపనైవేద్యాల నిర్వహణకు ప్రణాళికలు, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాలకు అవసరమైన నిదులు కేటాయింపుపై సమీక్షించారు. శ్రీవాణి ట్రస్ట్‌లో ప్రస్తుతం ఉన్న నిబంధనలను పున:సమీక్షించి 10లక్షలు రూపాయలకు బదులు మూడు కేటగిరీల్లో 10లక్షలు రూపాయలు, 15లక్షలు, 20లక్షల రూపాయలుగా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఒకే కేటగిరి క్రింద చెల్లించే 10లక్షల రూపాయల్లో మార్పుచేశారు. సనాతనధర్మాన్ని జనంలోకి తీసుకెళ్ళేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివని, ఆలయాల నిర్మాణాలతో దైవచింతన, ఆధ్యాత్మికత, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయని బోర్డు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇప్పటికే సమరసత సేవా ఫౌండేషన్, దేవాదాయశాఖ సంయుక్తంగా నిర్మితమవుతున్న ఆలయాల ప్రస్తుత స్థితి, జీర్ణోద్ధారణ పనులు ఏ దశలో ఉన్నాయోనని కూడా చర్చించారు. రాష్ట్రదేవాదాయశాఖ ఆదేశాలతో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ వెనుక బడిన ప్రాంతాల్లో నిర్మించే శ్రీవారి ఆలయాలు ,భజన మందిరాలకు నిధులు చెల్లించేందుకు ఈ మూడు కేటగిరీలు దోహదపడుతాయి. ఇప్పటి వరకు నిర్మించిన 320 ఆలయాలకు 79.82 లక్షల రూపాయలతో మైకెసెట్లను ఉచితంగా అందించేందుకు నిర్ణయించారు. వివిధ దేశాల్లోనూ ఆలయాలను నిర్మించాలని ఇందుకు సబ్‌కమిటీ ఏర్పాటుచేయాలని ఆమోదించారు. తిరుమలలో పాతబడిన పురాతన విశ్రాంతి భవనాలు, కాటేజీలను ఐఐటి నిపుణుల సూచనలతో తొలగించి ఆ స్థానంలో పున:నిర్మాణం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి,దర్శన సదుపాయాలు మరింత సులభం చేయడానికి వీలుగా అలిపిరి వద్ద బేస్‌క్యాంపు ఏర్పాటుకు టిటిడి బోర్డు నిర్ణయించింది. భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటు చేయాలని ఆలోచనకు శ్రీకారం చుట్టనున్నారు. ఆద్యాత్మిక, ఆహ్లాద వాతావరణం నెలకొల్పేలాచూడనున్నారు. ఈ బోర్డు సమావేశంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మాం, బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సుచిత్ర ఎల్లా, శాంతారాం. జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎన్.నర్సి రెడ్డి, జ్యోతులనెహ్రూ, ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మి, మునికోటేశ్వర రావు, దర్శన్ ,టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

# నానో ఎరువుల వినియోగానికి సబ్సిడీ ప్రతిపాదనలేదు

రాజ్యసభలో కేంద్రం స్పష్టం - వైసిపి ఎంపి మేడా రఘునాథరెడ్డి వెల్లడి



**రాజంపేట, జూలై 22 ప్రభాతవార్త** దేశంలో నానో ఎరువుల వాణిజ్య వినియోగాన్ని వేగవంతం చేయడానికి సబ్సి డీ ఇవ్వాలన్న ప్రతిపాదన ఏది లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రోత్సాహక పథకం కూడా ఏది ఇప్పటివరకు పరిశీలనలేదని రాజ్యసభలో వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి అడిగిన ప్రశ్నకు సమానంగా లిఖిత పూర్వకంగా పేర్కొంది. నానో ఎరువుల వాణిజ్య వినియోగాన్ని వేగవంతం చేయడానికి తీసుకున్న చర్యలు, ఎరువుల వినియోగాన్ని ప్రోత్స హించడానికి ప్రభుత్వం వాటి ఉత్పత్తికి సబ్సిడీ ఇవ్వాలని భావిస్తుందా అని ఎంపీ ప్రశ్నించారు. నానో ఎరువుల వినియోగానికి తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. అందుకు మంగళవారం కేంద్ర రసాయనాలు,ఎరువుల మంత్రిత్వ శాఖ మంత్రి స్మాత్ అనుప్రియ పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. నాను ఇరువుల వినియోగానికి అవగాహన శిబిరాలు, వెబ్‌నార్లు, నుక్కడ్ నాటకాలు, క్షేత్ర ప్రదర్శనలు, కిసాన్ సమ్మేళన్‌లు,ప్రాంతీయ భాషలలో చలనచిత్రాలు వంటి వివిధ కార్యకలాపాల ద్వారా నానో ఎరువుల వాడకాన్ని ప్రోత్స హిస్తున్నట్లు తెలిపారు.నానో ఎరువులను సంబంధిత కంపెనీలు ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.ఎరువుల శాఖ క్రమం తప్పకుండా జారీ చేసే నెలవారీ సరఫరా ప్రణాళికలో నానో ఎరువులు చేర్చినట్లు వివరించారు. నానో యూరియా వంటి నానో ఎరువులను ఆకులపై వేయడం ద్వారా సులభంగా ఉపయోగించడం కోసం ఖికిసాన్ డ్రోన్స్‌ఖి వంటి వినూత్న స్ప్రేయింగ్ ఎంపికలు , రిటైల్ పాయింట్ల వద్ద బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందుకు గ్రామ స్థాయి వ్యవస్థాపకుల ద్వారా పైలట్ శిక్షణ మరియు కస్టమ్ నియామక స్ప్రేయింగ్ సేవలను చురుకుగా ప్రోత్స హించడం జరుగుతుందన్నారు. ఎరువుల కంపెనీలతో కలిసి డిఒఎఫ్ దేశంలోని 15 వ్యవసాయ వాతావరణ మండలాల్లో సంప్రదింపులు, క్షేత్ర స్థాయి ప్రదర్శనల ద్వారా నానో డిఏపిని స్వీకరించడానికి మహా అభియాన్ ను ప్రారంభించిందన్నారు.నానో ఎరువులకు ఎటువంటి సబ్సిడీని అందించడం లేదని పేర్కొన్నారు. అయితే, శాఖ తన ప్రభుత్వ రంగ సంస్థలను (శిశీగేలు) నానో ఎరువుల ఉత్పత్తి ప్లాంట్లను స్థాపించడానికి చురుకుగా ప్రోత్స హిస్తోందన్నారు.డ్రోన్లను ఉపయోగించి నానో ఎరువుల వాడకం ఖర్చుతో కూడుకున్న సాంకేతికతగా ఉద్భవించిందన్నారు. వ్యవసాయం రైతు సంక్షేమ శాఖ , నమో డ్రోన్ దీదీ పథకాన్ని అమలు చేసిందన్నారు.



# ఆహారపదార్థాల తనిఖీకి అత్యాధునిక పరిశోధనశాల

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిది:** అత్యాధునిక పరికరాలతో తిరుమలలో ఏర్పాటుచేసిన ఆహార నాణ్యాత పరీక్ష పరిశోధనశాల ద్వారా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరంలేదని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. గతంలో స్వామివారి ప్రసాదాలు,నెయ్యి తదితర వస్తువుల నాణ్యతను పరీక్షించేందుకు తిరుమలలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆహార పరిశోధనశాలను మంగళవారం సాయంత్రం ఈ ముగ్గురు కలసి ప్రారంభించారు. 75 లక్షలు రూపాయలు విలువైన ఈ పరికరాలను గుజరాత్ లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు విరాళంగా అందజేసిందని వివరించారు. ఇందులో పనిచేసే సిబ్బంది మైసూర్‌లోని సిఎఫ్‌టిఆర్ఐలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతారామ్, సదాశివరావు, నరేష్ ,సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమన్నారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి అధికారులు పాల్గొన్నారు.

# యూరియాను వ్యవసాయేతర రంగాల్లో వినియోగిస్తే కఠిన చర్యలు

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



**విజయవాడ, జూలై 22, ప్రభాత వార్త ప్రతినిధి:** యూరియాను వ్యవసా యే తర రంగాల్లో అక్ర మంగా విని యోగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్లను ఏపీ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. యూరియా వినియోగం ఏటా 15 నుంచి 20 శాతం పెరుగుతుండటం గమనించినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీపై అందిస్తున్న యూరియా పక్కదారి పడుతున్నట్లు కేంద్ర నిఘా సంస్థలు తెలిపాయని వెల్లడించారు.

రైతుల కోసం కేటాయించిన యూరియాను ఆక్వా, చేపల చెరువులకు, పశువుల దాణా పరిశ్రమకు, నాటుసారా తయారీకి, ప్లాస్టిక్, ప్లైవుడ్, రసాయనిక పరిశ్రమలకు, కల్తీ పాల తయారీ, అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాల తయారీకి వినియోగిస్తున్నట్లు నిఘా సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు రైతులు సిఫార్సు చేసిన మోతాదుకు మించి వినియోగించడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రెండోసారి విత్తనాలు వేసుకోవాల్సి రావడం వల్ల యూరియా వాడకం అధికమవుతుందని చెప్పారు.

యూరియా అక్రమ వినియోగం నిరోధించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.

# ఎపి నుంచి వారానికి 1,194 విమానాల రాకపోకలు

- కుప్పం ఎయిర్‌పోర్టు స్థలానుమతి కోసం దరఖాస్తు - 11 చోట్ల నుంచి సీప్లేన్ నిర్వహణకు ఎల్ఒఐల జారీ - రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రస్తుతం వారానికి 1,194 విమానాలు రాకపోకలు సాగిస్తున్నట్లు కేంద్ర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. రాజ్యసభలో టిడిపి సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు బదులిచ్చారు. రాష్ట్రంలో 2021లో ఓర్వకల్లు విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందని, ప్రస్తుతం భోగాపురం విమానాశ్రయ నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. గతదర్తి విమానాశ్రయం నిర్మాణం కోసం 2018లో కుదుర్చుకున్న కన్సెషన్ అగ్రిమెంట్‌ను ఆ తర్వాత రాష్ట ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. 2008 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్స్ పాలసీ ప్రకారం ఈ ప్రాజెక్టను అమలు చేయాలంటే కొత్త ఎయిర్‌పోర్టు డెవలపర్‌ను ఎంచుకోవడంతో పాటు భూసేకరణ,చట్టబద్ధమైన అనుమతులు,ఆర్థిక వనరులను సమకూర్చుకోవాల్సి ఉంటుందన్నారు. కుప్పంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అవసరమైన స్థలానుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత జూన్‌లో ధరఖాస్తు పంపిందని చెప్పారు.ఉడాన్ 5.5కింద అరకు,గండికోట,కాకినాడ, కోనసీమ, లంబసింగ్, నర్సాపూర్,ప్రకాశం బ్యారేజీ, రుషికొండ, శ్రీశైలం, తిరుపతి, నాగార్జునసాగర్ ల నుంచి సీప్లేన్‌ల నిర్వహణక అవసరమైన బిడ్డింగ్‌లు దాకలు చేసుకోవాడానికి వీలుగా ఎయిర్‌లైన్ ఆపరేటర్లకు లెటర్ ఆఫ్ ఇండెం ట్(ఎల్ఓఐ)లు జారీ చేసినట్లు వైకాపా సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. సీ ప్లేన్‌ల నిర్వహణ కోసం డిజీసీఏ భద్రతా నిబంధనల్లో సవరణలు చేసిందని, దీని ప్రకారం శిక్షణావసరాలు, అనుమతుల ప్రక్రియ,స్థలం ఎంపిక సరళంగా ఉంటుం దన్నారు. కేంద్ర ప్రభుత్వ రక్షణలో 135 పురాతన స్మారక కేంద్రాలు కేంద్ర ప్రభుత్వ రక్షణలో ఆంధ్రప్రదేశ్‌లో 135 పురాతన సా ్మరక కేంద్రాలు ఉన్నట్లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ తెలిపారు. ఆయన లోక్‌సభలో టిడిపి సభ్యుడు జీఎం హరీష్ మాథుర్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. వీటి కోసం గత నాలుగేళ్ళలో రూ.36 కోట్లు కేటాయించగా, అందులో రూ.35 కోట్లు ఖర్చయినట్లు వెల్లడించారు.

# భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వైకుంఠమ్ 3 కాంప్లెక్స్

- అన్యమత ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టం
- టిటిడి బోర్డులో చర్చ
- 'వార్త' కథనాలపై సమీక్ష

**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపవుతున్న నేపథ్యంలో తిరుమల వెలుపల కిలోమీటర్ల క్యూలైన్లకు స్వస్తిపలకడానికి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణం చేపట్టేందుకు నిపుణుల కమిటీని టిటిడి బోర్డు ఏర్పాటు చేసింది. ఈ కమిటీ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నివేదికలిస్తే వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు బ్రహ్మోత్సవాల్లోపు నిర్ణయం తీసుకునే దిశగా అడుగులేస్తోంది. అలాగే హిందూ ధార్మికసంస్థ టిటిడిలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులపై నిఘా పెట్టామని, ,అలాంటి ఉద్యోగులను ఎవరినీ వదలిపెట్టే ప్రసక్తేలేదని కూడా బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ రెండు అంశాలపై ఈనెల 13వతేదీన 'వార్త'దినపత్రికలో "వెలుపల క్యూలైన్ల నియంత్రణకు వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణంతోనే !2000లో వైకుంఠమ్ -2 కాంప్లెక్స్ నిర్మాణం"శీర్షికతో ప్రత్యేక కథనం, మూడురోజుల క్రిందట "అన్యమత ఉద్యోగులపై చర్యలేవీ!?"కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు మంగళవారం సమావేశంలో కీలకంగా చర్చించి అభిప్రాయాలు వెలువడించారు. వేలాదిమంది భక్తుల వెలుపల క్యూలైన్ల నియంత్రణకు వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం శరణ్యమనే అభిప్రాయాలపై ఏకీభవించారు. వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం తిరుమలలో 40వేలమంది భక్తులు వస్తేనే వైకుంఠమ్ -1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరిషెడ్లు నిండి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు దూరం శిలాతోరణం వరకు భక్తుల లైన్లు వ్యాపిస్తున్నాయి. 1980లో భక్తులకు అప్పటి సంఖ్యకు తగ్గట్లు అవసరాలకు కనీసం తలదాచుకునేందుకు వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు.

# తిరుమల సమాచారం

## ఆగస్ట్ 8న టిటిడి ఆలయాల్లో సౌభాగ్యం

- 28న సద్గమయ కార్యక్రమం
- హెచ్‌డిపిపి నూతన కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరణ



**తిరుమల,జూలై 22ప్రభాత వార ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని అన్ని ఆలయాల్లో ఆగస్ట్ 8వతేదీ శుక్రవారం సౌభాగ్యం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయా లను సందర్శించే మహిళలకు గాజులు, పూలు,పసుపు,కుంకుమ,అక్షతలు సమర్పించే ప్రత్యేక కార్యక్రమంగా దీన్ని రూపొందించారు. సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్ళేందుకు ,విద్యార్థులకు మానవీయ విలువలు నేర్పేందుకు ఈనెల 28న సద్గమయ కార్యక్రమం ప్రారంభం కానుంది. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఏడాదిపాటు చేపట్టే పలు కార్యక్రమాలతో రూపొందించిన బ్రోచర్‌ను మంగళవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో ఆవిష్కరించారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడిఇ ఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మాం, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పనబాకలక్ష్మి,శాంతారాం, నర్సి రెడ్డి పలువురు బోర్డు సభ్యులతో కలసి ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఛైర్మన్ నాయుడు మాట్లాడుతూ టిటిడి .ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కార్యక్రమాలు సనాతన హిందూ ధర్మవ్యాప్తికి దోహదపడుతాయన్నారు. సనాతన ధర్మాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్ళేందుకుఈ బ్రోచర్ ఉపయోగపడుతుందన్నారు. ఆగస్ట్ 8న సౌభాగ్యం, అక్టోబర్ 2వతేదీ మన వారసత్వం, ఆగస్ట్ 15న సన్మార్గం, ఆగస్ట్ 31న హరికథవైభవం, అక్టోబర్ 12న అక్షరగోవిందం, డిసెంబర్ 1వతేదీ భగవద్గీతానుష్టానం,బోధన, 2026 వేసవిసెలవుల్లో 16సంవత్సరాల లోపు పిల్లలకు సంప్రదాయ భజనపై భజే శ్రీనివాసం, సంప్రదాయ భజన శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. వీటితో బాటు వన నిధి, గిరిజనార్ధనం వంటి కార్యక్రమాలను రూపొందించడం చక్కగా ఉందన్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అంతా శుభాలు

- స్వామివారిసేవలో తరించడం అదృష్టం
- మైసూరు మహారాణి రాజమాత ప్రమోదాదేవి



**తిరుమల,జూలై 22 ప్రభాతవార్తప్రతినిధి:** మైసూరు మహారాజు సంస్థానంకు చెందిన తామంతా కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో ఆనందంగా ఉన్నామని మైసూరు సంస్థానం రాజమాత ప్రమోదాదేవి, మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ్ వడియార్‌లు తెలిపారు. స్వామివారిసేవలో పాల్గొని స్వామివారికి పల్లవోత్సవంతో ఆతిథ్యం ఇవ్వడం మా అదృష్టమన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లతో దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్న మైసూరు సంస్థానం కుటుంబం దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకన్న దర్శనంతో ఆనందం : ప్రముఖులు




**తిరుమల,జూలై 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడంతో మనసు ఆనందంగా ఉంటుందని పలువురు ప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ఎమ్మెల్యే సూర్యనారాయణ, నటుడు నందు తిరుమలకు చేరుకుని దేవదేవుడిని దర్శించుకున్నాడు. టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లుచేసి తనకు స్వామివారి దర్శనం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు.

## వేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

- సుందరంగా సిద్ధమవుతున్న ఏడుకొండలు!

**తిరుమల,జూలై 22ప్రభాత వార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామికి సెప్టెంబర్ 23నుండి మొదలు కానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమ లలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. తొమ్మిది రోజులుపాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు,గ్యాలరీలు నిర్మాణం, ఆలయానికి ఎదురుగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు,ఆస్థాన మండపం వద్ద భక్తులు వానకు తడవకుండా ఉండేలా షెడ్లు నిర్మాణం జరుగుతోంది. మాఢవీధుల్లో ఎండకు.వానకు రక్షణగా గ్యాలరీలు నిర్మితమవుతున్నాయి. ఇంజనీరింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలు మాత్రమే జరగనున్నాయి.ఈ వాహనసేవలను భక్తుల మధ్య జరిపించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమవుతోంది. ఆలయం పరిసరాలు ,మాఢవీధుల్లో గ్యాలరీలు, ఇనుప పైపులతో నింపేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు కొండను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసే పనులు ఆరంభమయ్యాయి.

## నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రంతో భక్తులకు మరింత సౌలభ్యం



**తిరుమల,జూలై 22 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి భక్తులకు మరింత సౌకర్యవంతంగా శ్రీవాణి దర్శన టికెట్లు జారీ చేసేందుకు తిరుమల అన్నమయ్య భవనం ఎదురుగా నూతన శ్రీవాణి దర్శన టికెట్ల కేంద్రం సిద్దమైంది.ఈ కేంద్రాన్ని మంగళ వారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఓ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరితోకలసి ప్రారంభించారు. అత్యాధునిక మౌలక సదుపాయాలతో రూ. 60 లక్షల వ్యయంతో కొత్త కౌంటర్లను నిర్మించినట్లు తెలిపారు. నేటి నుంచి కౌంటర్ల ద్వారా భక్తులకు టికెట్ల పంపిణీ ప్రారంభమవుతుందని, భక్తులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం హెచ్‌వీసీ, ఏఎన్సీ ప్రాంతాల్లో భక్తుల సౌలభ్యం కోసం నూతనంగా ఆధునీకరించిన ఉప విచారణ కార్యాలయాలను టిటిడి ఛైర్మన్ ప్రారంభించి భక్తుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక సదుపాలయాలను పరిశీలించారు.

# సమాచార కమిషనర్ల పోస్టులకు నోటిఫికేషన్

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:**రాష్ట్ర ముఖ్య సమాచార కమీషనర్,సమాచార కమీషనర్ పోస్టుల బర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన జారీ చేసింది. న్యాయ,శాస్త్ర సాంకేతిక సామాజిక సేవ,పాత్రికేయం,మాస్ మీడియా,ప్రభుత్వ పాలన రంగాల్లో విశేష పరిజ్ఞానం,అనుభవం ఉన్నవారు ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఔత్సాహికులు తమ వివరాల్ని ఆగస్టు నాలుగో తేదీ సాయంత్రం 55.30 లోపు రిజిష్టర్ పోస్టు ద్వారా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి,సాధారణ పరిపాలన శాఖ,రాష్ట్ర సచివాలయం,వెలగపూడి,అమరావతి' చిరునామాకు పంపాలని సూచించింది.వివరాలను ఈ-మెయిల్ ఐడీ జిఎడి.ఎఆర్‌సెక్షన్ అట్ ది రేట్ ఆఫ్ జిమెయిల్.కాం ద్వారా కూడ పంపొచ్చంది.

వార్త


ఆకారాన్ని మాత్రమే చూసి మంచి చెడ్డలు నిర్ణయించుకునేవారు సంకుచిత స్వభావులు మాత్రమే.

-ఆస్కార్ వైల్డ్

# కీలుబొమ్మలుగా మారొద్దు!

స్వతంత్ర ప్రతిపత్తితో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఈడీలు రాజకీయ క్రీడలో పావులుగా మారి తమకు సంబంధం లేని విషయాల్లో తలదూర్చి దూకుడు ప్రదర్శించినప్పుడల్లా న్యాయస్థానాల చేత మొట్టికాయలు తింటూనే ఉన్నాయి. ఇలాంటి అంశాలను క్రోడీకరిస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ తమ అధికారాలను, విధులను దుర్వినియోగం చేస్తోందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్‌గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేసింది. ఇది తాజా అంశం ఇంతకు ముందు ఎన్నోసార్లు ఈ కేంద్ర దర్యాప్తు సంస్థల రాజ కీయ ఒత్తిడులకులొంగి చేసిన నిర్వాకాలను సుప్రీంకోర్టు తీవ్రంగానే మందలించింది. ప్రస్తుత 'ముడా' (మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ)భూ కేటాయింపుల కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య శ్రీమతి బిఎం పార్వతికి వ్యతిరేకంగా ఈడీ జారీ చేసిన సమన్లను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టులోని ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సోమవారం నాడు సుప్రీంకోర్టు ధర్మా సనం సమర్థించింది. హైకోర్టులో వచ్చిన తీర్పుకు సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌లో ఉన్నత ధర్మాసనం తమ పరిశీలనకు లోబడే కొన్ని విమర్శలు చేసింది. అవే కేంద్ర దర్యాప్తు సంస్థల నిర్వాకాన్ని,వాటిని తమకనుకూలంగా వాడుకోజూసిన పార్టీల ఆలోచనలను సుప్రీం ధర్మాసనం ఎండగట్టింది. ఈసారి అక్షింతలు వేయించుకునే వంతు 'ఈడీ'దయ్యింది. ఇంతక్రితం 2013లో సిబిఐని 'పంజరంలో చిలక'గా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్నది మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం. కేంద్రంలో ఏ పార్టీ, ఎవరు అధికారంలో ఉన్నా సుప్రీంకోర్టు ఒకే రకంగా వ్యాఖ్యానిస్తోందంటే వ్యవస్థలో ఉన్న లోపం ఇప్పటికీ సరికానట్లే! ప్రజాస్వామ్యానికి ప్రధాన స్తంభంగా వినుతికెక్కిన న్యాయవ్యవస్థ ఇతర వ్యవస్థల్లోని లోపాలను ఎత్తిచూపి న్యాయబద్ధంగా చట్టబద్ధంగా పనిచేసేందుకు ఓ 'మలుకర్ర' లా వ్యవహరిస్తుంటుంది. సిబిఐ ఈడి కేంద్ర దర్యాప్తు సంస్థలు నియమబద్ధంగా చట్టాలు,న్యాయ విధానాలకు లోబడి తమ దర్యాప్తులో ఎవరి జోక్యం లేకుండా పనిచేయాలి. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి. వీటన్నిటినీ వదిలిపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చిచ్చు రాజేసే పనులకు తోడ్పడుతున్నాయనో, రాజకీయ ప్రమేయంతోనో కేసుల వ్యవహారాలను ముందుకు తీసుకుపోతున్నాయనో ఆరోపణలు ఎదుర్కోవాల్సి వస్తోంది. తాజాగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య కుటుంబాన్ని అప్రతిష్ట చేసే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను దురద్దేశపూర్వకంగా తమ రాజకీయ పోరాటాలను వాడుకుంటోందని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒకరోజు ముందు మరో కేసులోఈడీని మద్రాసు హైకోర్టు కూడా ఇదేమాదిరి మందలించింది. కర్ణాటక ఎస్‌ఎల్‌పిలో అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీరాజు సుప్రీంకోర్టు వేసిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోవడంతో 'రాజకీయ స్వప్రయోజనాల కోసం, విపక్ష పార్టీలపై కక్ష సాధింపు కోసమే ఈడిని దుర్వినియోగం చేస్తున్నట్లు అనిపిస్తోందని సుప్రీం స్పష్టంగానే వ్యాఖ్యానించింది. దేశమంతటా ఈడిని ప్రత్యర్థులపై ఉసికొల్పే 'రాజకీయ' క్రీడకు ఆస్కారమివ్వద్దని గట్టిగానే హితవు చెప్పింది. రాజకీయ యుద్ధాలు ఎన్నికల వేదికల మీదనే తప్ప బయట వేసే ధోరణి మంచిదికాదని, ఇదే కొనసాగితే తాము కఠిన చర్యలు తీసుకుంటామని ఈడిని హెచ్చరించారు. ఇలా కోర్టుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలకు చీవాట్లుపడినప్పుడల్లా ప్రత్యర్థి పార్టీలు తమవంతుగా తీర్పులను వ్యాఖ్యలను స్వాగతిస్తుంటారు. ఇప్పుడూ అదే జరిగింది. అటు వారు ఇటైనా, ఇటువారు అటైనా అధికార, విపక్షపార్టీలస్పందన ఇలాగే ఉంటుంది. ఆ సంస్థ కార్యకలాపాల్లో అనవసర జోక్యాలు,అధికార దుర్వినియోగాలు బయటపడ్తుంటాయి. అంతవరకు మీమాంసలతో చర్చించుకునే పజాబాహుళ్యానికి అసలు విషయాలు తేటతెల్లమవుతుంటాయి. న్యాయ సమ్మతంగా వ్యవహరించి ఉంటే గతంలో ఎన్నో సందర్భాల్లో 'కోర్టు మంద లింపు'లకు గురైన 'ఈడీ' వ్యవహారం మరోసారి ఇప్పుడు కోర్టు ముందు నవ్వులపాలు కాదు. గతంలో మహారాష్ట్ర లో జరిగిన అనుభవాన్ని కూడా జస్టిస్ బిఆర్‌గవాయ్ ఈ కేసు సందర్భంగా ఉటంకించారు. అంటే 'చర్విత చరణం'గా తప్పులు చేసే పద్ధతి మారాలని సూచించినట్లే. కక్షిదారులకు చట్టపరమైన సలహాలిచ్చే న్యాయవాదులకు కూడా ఈడి నోటీసులందించి మరో అద్భుతం సృష్టించింది. ఈ కేసును కూడా సుప్రీం ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించి, ఈ అంశంపై 'అమికస్ క్యూరీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రభావితం చేసే వర్గాలపై ఈడీ నోటీసుల వ్యవహారాన్ని కూడా ధర్మాసనం సీరియస్‌గా తీసుకొంది. తమ దృష్టికి వచ్చిన ప్రతి విషయాన్నీ దర్యాప్తు చేయడానికి మీరేం సూపర్ కాప్‌కాదు. డ్రోన్‌లా ఎగిరిపోనక్కర్లేదని ఈడీని మద్రాస్ హైకోర్టు అంతకుముందు రోజే హెచ్చరించింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ చెన్నైకి చెందిన ఓ పవర్ జనరేషన్ సంస్థకు చెందిన రూ. 901 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సీజ్‌చేసిన విషయంలో కాస్త తీవ్రంగానే మందలించింది. రాజకీయ ఉద్దేశ్యాల ప్రేరణతో చేపట్టేవన్నీ తాత్కాలిక వేధింపులకే తప్ప తుదకంటా నిలవవని ఎన్నో సందర్భాల్లో తేలినందున స్వచ్ఛమైన నియమనిబద్ధమైన ఆలోచనలతో కేసులు స్వీకరించిదర్యాప్తు చేయలేకపోతే ఆయా సంస్థలు నవ్వులపాలు కాక తప్పదు.

మిక్కిలి ధనం కానీ, గొప్ప విద్యకానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

శత్రువుల నుంచి కాపాడుకోవాలంటే వాళ్లని మిత్రులుగా మార్చుకోవడమే ఉత్తమమైన మార్గం.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### సమన్వయంతో పని చేయాలి

జూన్ 2025లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతానికి తగ్గినట్టు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించడం కొంత ఊరట కలిగించినా, ఇది తాత్కాలిక ఉపశమనంగా మాత్రమే పరిగణించాలి. గత నెలల్లో ఆహారధరలు, నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరగడంతో మధ్య తరగతి, పేదవర్గాలు తీవ్ర ఆర్థికఒత్తిడిని ఎదుర్కొన్నారు. బియ్యం, కూరగాయలు,పాలు వంటిమౌలికావసరాలధరలు సామాన్యుడికి అధిక భారం మోపుతున్నాయి. ఇది ఆరోగ్యంపై, విద్యపై, జీవన నాణ్యతపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. చిన్నారులు,మహిళలు పోషకాహారం నుండి దూరమవుతున్నారు. ఇది ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేయాల్సిన అంశం. ధరల నియంత్రణకు సరఫరా గొలుసును బలోపేతం చేయాలి.వృద్ధి లక్ష్యాలను కొనసాగిస్తూ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### జాలర్ల జీవితాలకు కొత్తబాట వేయాలి

కచ్ఛతీవు వివాదం ఎన్నికలమ్యానిఫెస్టోకు పరిమితం కావడంవిషాదం.ఎప్పుడో ఇందిరాగాంధీ పీరియడ్‌లో కుదిరిన ఒప్పందం పైన ఇప్పుడు వివాదాలు రేపడం జాలర్ల జీవితాలకు సంబంధించిన అంశం కావడం బాధాకరం. నేడు అది రాజకీయ అస్త్రంగా మారడం విషాదం. బిజెపి ప్రభుత్వం కొత్తతరహా విదేశాంగ విధానానికి రూపకల్పన చేశామని చెపుతున్నారు కదా. విదేశాంగ నిపుణులను ఆర్థిక వేత్తలను, కోస్టల్ ఏరియా నిపుణులను, ఇరు దేశాల పౌర హక్కుల ఉద్యమ కారులను, నియమించి వేలాది జాలరుల జీవితాలకు కొత్త బాట వేయాలి.

- భారత అవినాష్, జనగామ

### సంప్రదాయాన్ని పాటించాలి

ఈకాలంలో ఆడపిల్లలు బాగా చదువు కోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన తరువాత వారికి వంట చేయడం చేత కావట్లేదు. వివాహమైన తరువాత చాలా శ్రమపడవలసి వస్తోంది. ఏకూర ఎలా చేయాలనేది తెలియక చరవాణిలోవంటలు యాప్‌లనుచూసిచేస్తున్నారు.లేదా బయటనుంచి ఆర్డర్లు పెడుతున్నారు. ఆడపిల్లలకు అన్ని రకాల వంటలను చిన్నప్పటి నుండే నేర్పడం మొదలు పెట్టాలి.

- కె. రామకృష్ణ, సికింద్రాబాద్

### విత్తనాలను సరఫరా చేయాలి

రోజు రోజుకు కూరగాయలు,పండ్ల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.రాష్ట్రప్రభుత్వం అన్నిగ్రామాల్లో,పట్టణాల్లోప్రతి ఇంట్లో, అపార్ట్మెంట్ లలో కూరగాయలు, పండ్ల చెట్లను నాటేవిధంగా ప్రభుత్వమే కూరగాయల విత్తనాలు,పండ్ల చెట్లను నామమాత్రపు ధరకు పంపిణీ చేయాలి.అలా పంపిణీ చేయడానికి పట్టణాల్లో,గ్రామాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల ద్వారా ప్రచారంచేయాలి. చెత్తసేకరించే వారిద్వారా ప్రతి ఇంటికి కూరగాయల విత్తనాలను,పండ్ల చెట్లను పంపిణీ చేయాలి. మున్సిపల్ శాఖ,గ్రామ పంచాయతీలు సేకరించిన చెత్త ద్వారా తయారుచేసినవర్మికంపోస్ట్‌ను నామమాత్రపు ధరకుపంపిణీ చేయాలి. తద్వారా తెలంగాణ రాష్ట్రం కూరగాయలు, పండ్లు పండించడం, ప్రజలందరికీ చౌక ధరలకు నాణ్యమైన కూరగాయలు, పండ్లు అందేవిధంగా చేయవచ్చు. ప్రజలు తమకు సరిపోను మిగిలిన కూరగాయలు పండ్లను తక్కువ ధరకు మున్సిపల్ శాఖ, గ్రామ పంచాయతీల ద్వారా సేకరించి మార్కెట్‌కు తరలించవచ్చు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పించాలి.

-సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

### పార్కింగ్ ఏరియా ఉండాలి

మన పట్టణాలు, నగరాలలోని కాలనీలలో అనేక మంది తన కార్లను తమ ఇళ్ళలో కాకుండా రోడ్డుపై నిలుపు చేస్తున్నారు. దీని వల్ల రోడ్లు ఇరుకై నడిచే వారికి, వాహనాలు నడిపే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కార్లను కొనుక్కుని తమ ఇంటిలో కాకుండా రోడ్ల మీద పార్క్ చేయటం ఇతరులను ఇబ్బందులకు గురి చేయటమే అవుతుంది. వినియోగదారులు కార్లు కొనేటప్పుడు కానీ, రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పుడు కానీ, కారు కొనుక్కునే సదరు వినియోగదారునికి తమ ఇంటిలో పార్కింగ్ సదుపాయం ఉందని చూపే ఋజువు ఉంటేనే వాహనాన్ని రిజిస్టర్ చేయాలనే విధానం ప్రభుత్వాలు వెంటనే ప్రవేశపెట్టాలి.ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

టీఎస్‌ఆర్టీసీ బస్సుల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతుంది. బస్సులు తప్పకుండా సమయపాలన పాటించాలి. బస్టాండులో టైమ్ టేబుల్ బోర్డు లు ఏర్పాటు చేయాలి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రయాణికులు సరి అయిన సమయంలో సురక్షితంగా వెళ్లడానికి బస్సుల సమయ పాలన అవసరం.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# ఇ-దర్శన్ కేంద్రాలతో ప్రయోజనమే..

**తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడీ ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒక ప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి.**

అప్పన్న గొనప

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అనేది కోట్లాది మంది హిందూ భక్తుల జీవిత లక్ష్యంగా మారిన పవిత్రతతో కూడిన ఆధ్యాత్మిక యాత్ర. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ శ్రద్ధతో, నమ్మకంతో పాల్గొంటారు. దేశమంతటా, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది భక్తులు తిరుమలకు వచ్చి శ్రీవారి కృపను పొందాలనుకుంటారు. ఈ ఆధ్యాత్మిక యాత్రను సులభతరం చేయడం, భక్తులకు ఏ విధంగానైనా ఇబ్బందులు కలగకుండా చూడడం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రధాన బాధ్యత. ఈ క్రమంలో ఒకప్పుడు ప్రారంభించిన 'ఈదర్శన్' కేంద్రాలు ఎంతో కాలం పాటు భక్తులకు సహాయకరంగా నిలిచాయి.కానీ గత ఏడు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా 100కు పైగా ముఖ్య ప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలను పూర్తిగా మూసివేయడం వల్ల లక్షలాది సామాన్య భక్తులకు అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. భక్తుల ప్రయాణం ఆధ్యాత్మిక పథంగా కాకుండా ఒక నిరాశాజనకమైన సమస్యల యాత్రగా మారుతోంది. 'ఈదర్శన్' కేంద్రాల మూసివేత అనేది సాధారణమైన పరిపాలనా చర్యకాదు. ఇది లక్షలాది మంది సామాన్య ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష ప్రభావాన్ని చూపే నిర్ణయం. గతంలో ఈ కేంద్రాల ద్వారా భక్తులు స్వయంగా తమ పట్టణ, జిల్లా కేంద్రాల ద్వారా దర్శన టికెట్లు, ఆర్జిత సేవల టికెట్లు వసతి గదుల బుకింగ్ చేసుకునే సదుపాయం కలిగి ఉండేవారు. అంతేకాదు,ఇందులో పని చేసే టీటీడీ సిబ్బంది భక్తులకు సహాయంగా ఉండి అవసరమైన సమాచారం అందించేవారు. పెద్దవారికి, వికలాంగులకు, టెక్నాలజీపై అవగాహనలేని వారికి ఇది ఒక దైవ ప్రసాదంగా భావించవచ్చు. అయితే ప్రస్తుతం టీటీడీ టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అందిస్తోంది. అంటే భక్తులు తిరుమల దర్శనానికి ముందు మూడు నెలల పాటు వేచి ఉండి, ఆన్‌లైన్‌లో టికెట్ పొందాల్సిన అవసరం ఏర్పడింది. ఇది సాంకేతికంగా అందరికీ సాధ్యపడే పనికాదు. స్మార్ట్‌ఫోన్లు లేని వారు, ఇంటర్నెట్ బాగా వాడలేని వారు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు, లేదా చదువురాని వృద్ధులు - వీరంతా తిరుమల దర్శనం పొందేందుకు ఇప్పుడు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఈ పరిస్థితిలో, చాలా మంది భక్తులు స్థానికంగా ఉన్న ఇంటర్నెట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కానీ అక్కడ వారు అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరికొంతమంది దళారుల చేతుల్లో మోసపోతున్నారు. దర్శనానికి ఉచితంగా లేదా తక్కువ ధరకు లభించాల్సిన టికెట్ల కోసం వేల రూపాయలు చెల్లించే పరిస్థితులు కనబడుతున్నాయి. వీటితో పాటు వికలాంగులు, వృద్ధులు, గర్భిణులు వంటి ప్రత్యేక వర్గాల భక్తులకు కూడా టికెట్లను పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందించడం వల్ల వారు ప్రత్యక్షంగా తిరుమల కొండపైకి వచ్చి టికెట్ల కోసం వేచిఉండాల్సి వస్తోంది. ఇది వారి ఆరోగ్యానికే కాకుండా భక్తి భావనకూ ఎదురుదెబ్బలాంటిదే. టీటీడీ తమ సేవలన్నింటిని ఆన్‌లైన్ లోకి మార్చడం ఒక ఆధునికీకరణ చర్యగా భావించవచ్చు. కానీ ప్రతి ఆధునికతను ప్రజల అవసరాలకు అనుగుణంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. అన్ని వర్గాల ప్రజలు



ఒకే స్థాయిలో డిజిటల్ ప్రపంచాన్ని వాడలేరు. భక్తులలో చాలా మంది పేదలు, గ్రామీణ ప్రాంతాలవారు, వృద్ధులు, నిరక్షరాస్యులు ఉంటారు. వీరందరికీ ఆన్‌లైన్ టికెట్లప్రక్రియ పూర్తి చేయడం చాలా కష్టంగా మారుతుంది. వారు అవసరమైన సమాచారం పొందడానికే కాదు, సరైన విధంగా గది బుకింగ్ చేసుకోవడానికి కూడా ఇతరులపై ఆధారపడుతున్నారు.ఇది వారిని ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. భక్తుల ఈ పరిస్థితిని గుర్తించి, తిరిగి ప్రత్యక్ష సేవల విధానాన్ని అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో, ఒక ప్రత్యేకమైన పథకాన్ని రూపొందించి, భక్తులందరికీ టికెట్లను పునరుద్ధరించిన ఈదర్శన్ కేంద్రాల ద్వారా అందించే విధంగా టీటీడీ కార్యాచరణ రూపొందించాలి. ప్రతి జిల్లాలో కనీసం ఒకటి, ప్రధాన పట్టణాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా భక్తుల సమస్యలకు పరిష్కారం చూపవచ్చు. తిరుమల యాత్ర అనేది ఒక ఆధ్యాత్మిక యాత్ర. భక్తులు తమ మనోభావాలను, శ్రద్ధను తీసుకొని స్వామివారి సన్నిధికి చేరుకుంటారు. అలాంటి యాత్రను ఆధునిక సాంకేతికత పేరుతో ఒక టెక్నికల్ కాంప్లికేషన్‌గా మార్చకూడదు. ప్రతి భక్తుడూ సమానంగా స్వామివారి దర్శనం పొందేహక్కు కలిగి ఉన్నాడు. ప్రత్యక్ష టికెట్ల విక్రయ కేంద్రాలు లేకుండా, భక్తులను ఆన్‌లైన్‌కు పరిమితం చేయడంవల్ల, వారి ఆధ్యాత్మిక యాత్ర అర్థరహితంగా మారుతోంది.కొన్ని నిమిషాల్లోనే అన్నిటికెట్లు బుక్ అయిపోవడం, సర్వర్లు డౌన్ కావడం, ఫోన్లో సిగ్నల్స్ రాకపోవడం వంటి సమస్యలు ప్రతిరోజు ఎదురవుతున్నాయి. అలాంటి సమయంలో భక్తులుస్వామిని దర్శించాలన్న ఆకాంక్షను వదులుకుంటున్నారు. ఇది అత్యంత బాధాకరమైన స్థితి. ఈపరిస్థితి మారాలంటే తిరిగి ప్రత్య క్ష సేవల అందుబాటు రావాలి. ఈదర్శన్ కేంద్రాలను తిరిగి తెరవడం ఒక ముఖ్యమైన పరిష్కారమార్గం. వీటి ద్వారాభక్తులు భద్రతగా, సులభంగా, నమ్మకంగా తమ సేవలను పొందగలుగుతారు.ప్రభుత్వం టీటీడీ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యపట్ల టీటీడీ ధర్మకర్తల మండలి, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. ఇది భక్తుల విజ్ఞప్తి మాత్రమే కాదు,ఒక సామాజిక బాధ్యత. లక్షలాదిమంది సామాన్యులు భగవంతుని దర్శించుకోవాలనుకుంటే, వారిని ఆన్‌లైన్ పద్ధతిలోనే బంధించడం సమంజసంగా ఉండదు. ప్రత్యక్ష సేవల ద్వారా భక్తులకు మరింత మానవీయత, నైతికత, నిబద్ధతతో కూడిన అనుభవం లభిస్తుంది. ప్రతి పట్టణంలో తిరిగి ప్రారంభించదగ్గ ఈదర్శన్ కేంద్రాలద్వారా భక్తుల ఆర్థికభద్రత కూడా కాపాడబడుతుంది. దళారులచేతుల్లో మోసపోవడం తగ్గుతుంది. అందువల్ల, ఈ సమస్యపై టీటీడీ ఒకకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, సమీక్ష చేసి, భక్తులకు ప్రత్యక్ష సేవలు అందించే దిశగా ముందడుగు వేయాలి. ఈ కేంద్రాలను తిరిగి తెరిచి భక్తుల కష్టాలను తీర్చడంద్వారా టీటీడీ తనధర్మాన్ని నిర్వర్తించగలదు. తిరుమల శ్రీవారిదర్శనం అనేది ఒక పవిత్ర ఆధ్యాత్మిక అనుభవం మాత్రమే కాదు అది కోట్లాది మందికి విశ్వాసం, భద్రత, ధైర్యానికి నిలయంగా ఉంది. అలాంటి దర్శనాన్ని అందరికీ అందుబాటులోకి తేవడం అనేది టీటీడి ప్రభుత్వాల బాధ్యత.ఈబాధ్యతను నెరవేర్చడంలో ఈదర్శన్ కేంద్రాల పునఃప్రారంభం ఒక ముఖ్యమైన చర్య. సాంకేతికతను నమ్మడం మంచిదే అయినా, అది సమానంగా అందరికీ ఉపయోగపడేలా ఉండాలి. అందుకే, తిరిగి ఈ కేంద్రాలను ప్రారంభించి, భక్తుల అవసరాలకు స్పందించే విధంగా ఒకప్రజాభిమాన వ్యవస్థను ఏర్పరచాలి. టీటీడీ ధర్మకర్తల మండలి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలి. •

# మద్యం విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి

కామిడి సతీష్ రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో, పట్టణాలలో పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు మద్యాన్ని విక్రయిస్తున్నాయి. మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతూ వున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా ఏరులై పారుతున్నా అన్నీ తెలిసినా అటువైపు కన్నెత్తి చూడకుండా ఎక్సైజ్ అధికారులు వ్యవహరించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తున్నాయి. అన్ని జిల్లాలలో బెల్టుషాపుల దందా జోరుగా సాగుతోంది. కిరాణాదుకాణం నుంచి మొదలుకొని నివాసగృహాలు, పాన్‌షాపులు, కల్లు కాంపౌండ్‌ల సమీపంలో మద్యం ఏరులై పారుతోంది. భవననిర్మాణ కార్మికులు, కూలీలు, హోటల్‌లు, ఇసుక రవాణా కార్మికులకు తెల్లవారు జామునే మద్యం అందిస్తూ బెల్టు దందాను మూడు క్వార్టర్లు, ఆరు ఆఫ్‌లుగా సాగిస్తున్నారు. గతంలో వైన్ షాపుల పరిసరాలలో కొనసాగిన ఈ దందా ప్రస్తుతం గల్లీకొకటి ఏర్పాటు కావడంతో మద్యం ప్రియులు ఉదయం టీ, కాఫీలకు బదులుగా మద్యాన్ని తాగుతూ ఎక్కడపడితే అక్కడ పడిపోతూ గాయాలపాలవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకంగా ఉదయం పూట వాహనాలలో తీసుకువచ్చి, ఆ ప్రాంతంలోనే ఓ కల్లు కాంపౌండ్ పరిసరాలలో పలువురు పాన్ షాపులు ఏర్పాటుచేసి అందులో బెల్టుదుకాణం నడిపిస్తున్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. గుడుంబా విక్రయాలు మానేసిన వారికి ప్రభుత్వం ఓవైపు స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే, మరో వైపు బెల్టు దుకాణాలు పల్లెలు, పట్టణ ప్రజలను మత్తులో ముంచుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు కొనసాగుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. లిక్కర్ డాన్లు వివిధ జిల్లాల్లో కమీషన్లకు బెల్టు షాపుల వారికి మద్యం సరఫరా చేస్తున్నారు. రోజుకు ఎంత అమ్మితే అంత కమీషన్లు అందిస్తుండడంతో బెల్టుషాపుల నిర్వాహకులు ఒకరిని చూసి మరొకరు ఈ దందాను జీవనోపాధిగా చేసుకుంటున్నారు. ఉదయం



నుంచి సాయంత్రం వరకు ఈ దందాను బహిరంగంగా కొనసాగిస్తూ ప్రజలను మత్తులో ముంచుతున్నారు. ఆ మద్యం తాగిన వ్యక్తులు వాటికి బానిసలై తమ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలు,పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని అధికారులు ప్రకటిస్తుంటే మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో యథేచ్ఛగా బెల్టుదుకాణాలు కొనసాగుతున్నాయి. కొత్త మద్యం విధానం అమల్లోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో బెల్టుదుకాణాలు జోరందుకున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలోనే మద్యం షాపులు కొనసాగుతున్నాయి. వివిధ మండలంలలోని కొన్ని గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామస్థులు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షల బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని తెలుస్తుంది. అందులో బాటిళ్లను ఎంఆర్‌పీ కంటే రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువకు విక్రయిస్తున్నారు. కొందరైతే వాహనాలను ఉదయం సమయంలో తీసుకువచ్చి అడ్డకూలీలకు, ఇసుక ట్రాక్టర్ల మీద వెళ్లే కూలీలకు అమ్మకాలు జరుపుతున్నారు. వివిధ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్ల వద్ద గల కిరాణా దుకాణాలలో కల్తీమద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలుస్తోంది. అన్ని జిల్లాలలో ఈ దందా సంగతి తెలిసిన సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు సిబ్బందికి ప్రత్యేకంగా వారం, నెలకు చొప్పున ముడుపులు అందుతుండడంతో ఏదైనా ఫిర్యాదు రాగానే బెల్టు షాపుల నిర్వాహకులకు సమాచారం అందించి తనిఖీల విషయాలను చేరవేస్తున్నారు. దీంతో అప్రమత్తం అవుతున్న బెల్టు షాపుల వారు తనిఖీలలో ఏమీ దొరకకుండా జాగ్రత్త పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఈ బెల్టుదందాకు అడ్డుకట్ట పడడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించిన వారవుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.యువత మాత్రం నిత్యం వీటికి బానిసై ఒళ్లు గుల్ల చేసుకుని భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారు.ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది.ఇకనయినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.బెల్ట్ షాప్ నిర్వాహకుల మీద ఉక్కుపాదం మోపాలి. •

# ట్రంప్ వాణిజ్య పన్నుల వార్ డైలాగ్‌లకే పరిమితమా?


దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ ఉక్రెయిన్, రష్యా దేశాల మధ్య యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వానికి చేసిన పరిస్థితులు అనుకూలించకపోవడంతో, అత్యంత శక్తివంతమైన రష్యా దేశాన్ని ఒప్పించలేక చివరకు అమెరికా ఉత్పత్తులపై అంతర్జాతీయంగా వాణిజ్య వ్యాపార ఎగుమతులు దిగుమతులపై అధిక శాతం సుంకం(టారిఫ్ ) విధిస్తున్నట్లు ప్రకటించడం, రష్యా ఆర్థిక వ్యవస్థనీ పరోక్షంగా దెబ్బతీసే విధంగా ఇలాంటి వ్యాఖ్యలు చేసినట్టు ఉన్నాయా అనేవాదనలు తెరపైకి వస్తున్నాయి. అంతేకాదు రష్యాతో ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార వాణిజ్య సంబంధాలు కలిగిన భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాలు ఉక్రెయిన్ రష్యా మధ్య జరుగుతున్న యుద్ధం ముగించే విధంగా రష్యాపై ఒత్తిడి చేయాలని, లేకుంటే భారత్, బ్రెజిల్, చైనా దేశాలపై వాణిజ్య సుంకాలు వంద శాతం విధిస్తామని బెదిరించే రీతిలో ట్రంప్ వ్యాఖ్యలు చేయడం విమర్శలకు తావు ఇచ్చే విధంగా లేకపోలేదు. ప్రపంచ దేశాలకు అమెరికానే పెద్ద దిక్కు అన్నట్టు ట్రంప్ అప్పుడప్పుడు దేశాల మధ్య నెలకొన్న వివాదాల్లో మధ్యవర్తిత్వం వహిస్తూ సమస్య పరిష్కారానికి తాను అనుకునే రీతిలో ప్రయత్నించి, చెప్పితే వినని దేశాలపై అమెరికా ఉత్పత్తులపై పన్ను (టారిఫ్) అధికంగా విధిస్తామని, చెప్పినట్టు వినే దేశాలకు పన్నురాయితో పాటు ఆయుధ సంపత్తిని విక్రయిస్తామని ఏమైనా చేసుకోండి అనే రీతిలో ట్రంప్ వ్యవహార శైలి ఉంటుందా అనే సందేహాలు కలగక మానవు. తరచుగా అమెరికా అధ్యక్షుడు నుండి వస్తున్న పదం టారిఫ్ అంటే అంతర్జాతీయంగా వ్యాపార వాణిజ్య రంగాలలో తమ దేశ ఉత్పత్తుల్లో ఎగుమతులు దిగుమతులలో విధించే సుంకం లేదా పన్ను. ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవిని పొందిన అనంతరం వాణిజ్య వ్యాపార సంబంధాల్లో అంతర్జాతీయంగా ఉన్న అమెరికా ఉత్పత్తుల ఎగుమతి దిగుమతుల విషయంలో తమకు అనుకూలంగా లేని దేశాలపై ఒక రకమైన టారిఫ్, అనుకూలంగా ఉన్న దేశాలపై తక్కువ శాతంటారిఫ్ విధానాన్ని అవలంబిస్తూ, దేశాల వాణిజ్యాన్ని నియంత్రించడానికి ద్వంద వైఖరితో ప్రత్యక్షంగా పరోక్షంగా అంతర్జాతీయంగా ప్రపంచ దేశాలపై అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిబింబించేలా ట్రంప్ ప్రయత్నిస్తున్నడా అనే సంశయం కలగక మానదు. అయితే రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని నివారించడానికి భారత్ ,బ్రెజిల్ ,చైనాలు తప్పనిసరిగా రష్యాను ఒప్పించాలని లేనిపక్షంలో అధిక టారిఫ్‌కు సంబంధించిన దేశాలపై అధిక శాతం విధిస్తామనడం ట్రంప్ వైఖరి ముమ్మాటికి సరి అయినదా కాదా అనే భిన్న వాదనలు లేకపోలేదు. భారత్, బ్రెజిల్, చైనా లాంటి స్వతంత్ర దేశాలు స్వయంగా నిర్ణయాలు తీసుకుంటాయి కానీ, అమెరికా ఒత్తిళ్లకు బెదిరింపులకో తలొగ్గవనే విషయాన్నిఅమెరికా గ్రహించాల్సి వస్తుందేమో. అవసరమైతే భారత్ లాంటి దేశాలు అమెరికా ఉత్పత్తుల దిగుమతులను సాధ్య మైనంతగా తగ్గించి, స్వదేశీ ఉత్పత్తులను పెంచుకొని తమ దేశ



ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఆంక్షల ప్రభావం చూపకుండా తమ దేశ ప్రయోజనాల కొరకు తమకు సహకరించే దేశాలతో వాణిజ్య వ్యాపారాలు కొనసాగిస్తాయి. అంతేకానీ అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని దేశాల మధ్య అంతర్గత యుద్ధాల్లో అనవసరంగా ఏకపక్షంగా ఎలాంటి సూచనలు సలహాలు చేయవలసిన అవసరం లేదనే అభిప్రాయాన్ని భారత్ లాంటి దేశాలు పరోక్షంగా వ్యక్తపరుస్తుండడం విశేషం. అమెరికా ఏమి అనుకున్నదో ఏమోకానీ ఎవరు ఏది చెప్తే అది వినడానికి రష్యాదేశం ఏమైనాఇజ్రాయిల్, ఇరాన్, పాకిస్థాన్ లాంటి దేశాలవలే కాదు కదా.ఆసియా ఖండంలో బలమైన దేశాలుగా ఉన్న భారత్ లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాల కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంటుంది. అవసరమైతే తప్ప ఇతరుల జోక్యాన్ని పూర్తిగా తోసిపుచ్చే విధానం నిర్దిష్టమైన విదేశాంగ విధానం భారత్ లాంటి దేశాలకు ఉన్నదని అమెరికాకు తెలియదా ఏమి. అలాంటప్పుడు అమెరికా ఒత్తిడితో భారత్ లాంటి దేశాలు అనవసరంగా వేరొక దేశ అంతర్గత విషయాల్లో జోక్యానికి ఎందుకు ప్రయత్నిస్తాయి అనే ప్రశ్నలు తలెత్తక మానవు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానంలో సరికొత్తపోకడలకు భాష్యాన్ని ఇస్తున్నట్టు, ప్రతి విషయాన్ని వాణిజ్య వ్యాపారంలో అధిక పనుల విధానంతో ముడి పెడుతుండడం విశేషం. అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికల ముందు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావడానికి ఏకంగా తనకేవ్వరు ప్రపంచంలో శత్రువులు లేనట్లు తన మాటను వినేవారే అధికమంటూ, యుద్ధాలను అధికారంలోకి రాగానే క్రమంగా ఆపిస్తానని రష్యా అధ్యక్షునితో తనకు మంచి సంభాషణే ఉన్నట్లుఅప్పట్లో వార్తలువచ్చాయి. అయితే డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి కైవసం చేసుకున్న తర్వాత ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఆపడమేమో గానీ, ఇజ్రాయిల్ పాలస్తీనా హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపించే ప్రయత్నంలో ఏకంగా ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై అమెరికా దాడి చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అనంతరం జరిగిన పరిణామాలలో ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు తానే కారకున్ని అని చెప్పుకుంటూ వచ్చిన డోనాల్డ్ ట్రంప్ టెర్రరిస్టులకు బహిరంగంగానే ఆశ్రయం ఇస్తున్న పాకిస్థాన్ పైభారత్ తీసుకున్న చర్యలు నిర్దిష్టంగా ఉన్నప్పటికీ భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపించానని యుద్ధం ఆపకుంటే వాణిజ్యపరమైన ఆంక్షలు విధిస్తాం అనగానే యుద్ధం ఆగిపోయిందని ట్రంప్ అంతర్జాతీయ వేదికలపై చెప్పిన విషయం విధితమే. ఏది ఏమైనప్పటికీ ట్రంప్ రష్యా. ఉక్రెయిన్‌మధ్య యుద్ధం ఆగిపోవాలని కోరుకోవడం సహజమే. నిజానికి ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వల్ల భారీగా ప్రాణ ధన నష్టాలను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలకు డోనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి కొంత ఆశాజనకంగా గోచరించవచ్చు కానీ ప్రపంచ శాంతికి తానే ముందు వరుసలో ఉన్నట్లు వ్యవహరించాలనుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచంలో దేశాల మధ్య యుద్ధ వాతావరణాన్ని నివారించడానికి టారిఫ్ విధానాన్ని ఆయుధంగా మలచుకొని సామవేద దండోపాయలతో దేశాలపై ఒత్తిడి పెంచి యుద్ధాలను ఆపాలని చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయో లేదో వేచి చూడాల్సిందే. •

# ఉభయ సభల్లో విపక్షాల ఆందోళనలు



## గందరగోళంతో సభ నేటికి వాయిదా!

## ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్ ఓటర్ల జాబితాల సవరణపై చర్చకు పట్టుపట్టిన విపక్షాలు

### విపక్షాల వాయిదా నోటీసులను తిరస్కరించిన హరివంశ్

**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేయడంతో మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనలు చేయడంతో, దిగువ సభ కార్యకలాపాలను తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. అయితే తిరిగి సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో, స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష పార్టీల ఆందోళనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడ్డాయి. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం రాత్రి ఆకస్మిక రాజీనామా చేయడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన మధ్య ఎగువ సభ ఉదయం కార్యకలాపాలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. తరువాత కూడా నిరసనలు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ధన్‌ఖడ్ రాజీనామా, బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ అంశాలపై చర్చ చేపట్టడానికి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీసులను హరివంశ్ తిరస్కరించారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. అయితేఉభయ సభల్లోనూ ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది. తొలిరోజున ప్రతిపక్షాలు పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమండ్ చేయడంతో ఉభయసభలు వాయిదా పడిన సంగతి తెలిసిందే. తొలిరోజు నిరసనల మధ్యనే రాజ్యసభ షిప్పింగ్ డాక్యుమెంటేషన్ చట్టాలను ఆధునీకరించే లాడింగ్ బిల్లును విజయవంతంగా ఆమోదించింది. ఈ బిల్లు లోక్‌సభలో ఇప్పటికే ఆమోదం పొందింది. సమావేశాల మొదటి రోజున హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌సిన్హాపై మోపిన అభిశంసనపై రాజ్యసభలో ప్రసంగించిన అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. జులై 21న ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ఆగస్టు 21 వరకు జరగనున్నాయి. ఆగస్టు 12 నుండి ఆగస్టు 17 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల విరామం ఉంటుంది. ఆగస్టు 18న తిరిగి సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

ఇదిలా ఉండగా తాజాగా జస్టిస్ యశ్వంత్ వర్మపై మోపిన అభిశంసన తీర్మానంపై ఐయుఎంఎల్ ఎంపిఇటి మహ్మద్ బషీర్ మాట్లాడుతూ, ఈ అభిశంసన చాలా ముఖ్యమైనది. ఆ న్యాయమూర్తి వ్యవహారాల కారణంగా భారత న్యాయ వ్యవస్థ స్థితి మరింత దిగజారింది. అందుకే తాము దీనిపై మెమోరాండంను స్పీకర్‌కు సమర్పించామన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందిస్తుందని ఆశిస్తున్నామని బషీర్ పేర్కొన్నారు.



# గాజాలో యుద్ధం ఆగాల్సిందే

## 25 దేశాల సంయుక్త ప్రకటన

### 59 వేలు దాటిన పాలస్తీనియన్ల మరణాలు

**లండన్, జూలై 22 :** గాజాలో యుద్ధం ఆగితీరాలని, అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ గౌరవించాలని బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్‌లతో సహా మొత్తం 25 దేశాలు సోమవారం ఒక సంయుక్త ప్రకటన వెలువరించాయి. కొనసాగుతున్న దాడుల కారణంగా గాజాలో సామాన్యుల కష్టాలు మరింతగా పెరిగాయని ఆయా దేశాల విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. చాలీచాలని సాయం అందించడమే కాక, కనీస అవసరాలైన ఆహారం, నీళ్ల కోసం వేచి వున్న అమాయక ప్రజలను, మహిళలు, పిల్లలను విచక్షణారిహతంగా హతమార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. 'ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుసరిస్తున్న సహాయ పంపిణీ విధానం అత్యంత ప్రమాదకరం. ఇది అస్థిరతను పెంపొందించడంతోపాటు గాజా వాసుల కనీస మానవ గౌరవాన్ని హరిస్తోంది' అని సంయుక్త ప్రకటన తెలియజేసింది. గాజాలోని అన్నార్తుల పట్ల ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వైఖరిని ఐరాస తీవ్రంగా ఖండించింది. ఆహార కేంద్రాల వద్ద వచ్చే వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కాల్పులు జరుపుతోందంటూ మండిపడింది.

ఆదివారం ఒక్కరోజే 80 మంది ఉసురు తీయడాన్ని ప్రస్తావించిన ఐరాస ఆహార విభాగం (డబ్ల్యుఎఫ్‌పి).. పాలస్తీనియన్ల పాలిట భయంకరమైన రోజుల్లో ఒకటని అభివర్ణించింది.

సెంట్రల్ గాజాలోని నెట్‌జరిమ్ కారిడార్ వద్ద గుంపుగాచేరిన పాలస్తీనియన్లపైజరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. హమాస్‌శ్రేణులు లక్ష్యంగా 21 నెలలుగా యథేచ్ఛగా ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న దాడుల్లో మరణాలు 59 వేలు దాటాయని గాజా ఆరోగ్య విభాగం సోమవారం తెలిపింది. 2023 అక్టోబరు 7 నుంచి సాగిస్తున్న దాడుల్లో క్షతగాత్రుల సంఖ్య 1,42,135కు చేరుకుందని వివరించింది.

# ఎట్టకేలకు కేరళను వీడిన బ్రిటన్ ఫైటర్ జెట్

**తిరువనంతపురం, జూలై 22:** సాంకేతిక సమస్యల కారణంగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో నెల రోజులుగా నిలిచిపోయిన బ్రిటిష్ రాయల్ నేవీ ఎఫ్-35 బి స్టెల్త్ యుద్ధ విమానం ఎట్టకేలకు టేకాఫ్ అయ్యింది. మంగళవారం ఉదయం కేరళను వీడింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన బ్రిటన్ దేశానికి చెందిన ఎఫ్-35 బి 40 రోజులుగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టులోనే నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇండో-యుకె నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బి విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఆ విమానాన్ని జూన్ 14న అర్థరాత్రి తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో దించేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరత కారణంగా విమానాన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఆ ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య తలెత్తినట్లు ఆ తర్వాతే యుకె అధికారులు వెల్లడించారు.

ఈ ఫైటర్ జెట్‌కు ఇక్కడ మరమ్మతులు చేయడానికి వీలుకాకపోవడంతో బ్రిటన్ నుంచి నిపుణులను రప్పించారు. 24 మంది స్పెషల్ ఎక్స్‌పర్ట్స్ బృందం వచ్చి విమానానికి మరమ్మతులు చేపట్టింది. విమానంలోని లోపాలను సరిచేసింది. దీంతో విమానం ఎట్టకేలకు గాల్లోకి ఎగిరింది. దాదాపు ఐదు వారాల తర్వాత మంగళవారం ఉదయం కేరళ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయి బ్రిటన్‌కు బయల్దేరి వెళ్లింది.



## భారత్-పాక్ సరిహద్దుల్లో బిఎస్ఎఫ్ 'డ్రోన్ స్క్వాడ్రన్'

**న్యూఢిల్లీ, జూలై 22:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పిఒకెతోపాటు పాక్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అటునుంచి దాయాది దేశం కూడా మనపై డ్రోన్లతో దాడులకు యత్నించింది. దీంతో భారత బలగాలు అప్రమత్తమయ్యాయి. భవిష్యత్తులో ఇటువంటి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా భారత్-పాక్ సరిహద్దులో గస్తీ పెంచడంతోపాటు 'డ్రోన్ స్క్వాడ్రన్'లను ముమ్మరంగా మోహరించే పనిలో నిమగ్నమయ్యాయి. సరిహద్దులో నిర్దిష్ట ఔట్ పోస్టుల్లో ఉండే డ్రోన్ దళాల్లో నిఘాకు సంబంధించి అనేక వ్యవస్థలు ఉంటాయి. ఈ స్క్వాడ్రన్‌లో నిఘాతోపాటు మానవరహిత విమానాలు లేదా డ్రోన్లు ఉంటాయి. ఈ పరికరాలను ఆపరేట్ చేసేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది ఇక్కడ విధులు నిర్వర్తిస్తారు. చండీగఢ్‌లోని బిఎస్ఎఫ్ వెస్టర్న్ కమాండ్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఈ బృందాలకు దిశా నిర్దేశం చేస్తుంది. రక్షణ పరిశోధన, నిఘా సంస్థలతో ఈబృందాలు కీలకవివరాలను పంచుకుంటాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితులు తలెత్తినప్పుడు శత్రు డ్రోన్లపై దీటుగా విరుచుకుపడతాయి.

# గడ్చిరోలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



**గడ్చిరౌలి, జూలై 22:** విదేశీ నిధులతో గడ్చిరౌలిపై అర్బన్ నక్సల్స్ దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరం చేస్తున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించారు. లాయిడ్స్ అండ్ ఎనర్జీ లిమిటెట్ సంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్చిరౌలి జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. గడ్చిరౌలిలో నక్సలిజం తగ్గుతోందని, ప్రస్తుతం కొంతమంది నక్సలైట్లు మాత్రమే ఉన్నారని, వాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు అని, ఇక్కడి అడువుల్లో వాళ్లు ఉన్నారని ఆయన అన్నారు. హింసను వీడాలని నక్సలైట్లకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఫడ్నవీస్ తెలిపారు. ప్రధాన జీవనస్రవంతిలో కలవాలని కోరుతున్నట్లు తెలిపారు.

అయితే తుపాకీ పట్టుకుని తిరిగే నక్సలైట్లు తగ్గుతున్న దశలో.. అర్బన్ నక్సల్స్ సంఖ్య పెరుగుతోందని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అర్బన్ నక్సల్స్ పట్ల అలర్ట్‌గా ఉండాలని, వాళ్లు తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారని, గడ్చిరౌలిలో స్టీల్ ప్లాంట్ కోసం శంకుస్థాపన చేయగా, మరుసటి రోజే సోషల్ మీడియాలో దుష్ప్రచారం మొదలుపెట్టారని, గిరిజనులను చంపుతున్నారని ప్రచారం చేస్తున్నట్లు సిఎం ఆరోపించారు. భారీ స్థాయిలో అడవుల్ని నరికివేస్తున్నట్లు ప్రచారంచేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేస్తుంటే.. ఎలా వ్యతిరేక ప్రచారం చేపడుతున్నారని ఆయన అడిగారు.

మహారాష్ట్రకు సంబంధం లేని వ్యక్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని, ఇద్దరు కోల్‌కతాలో ఉన్నారని, మరో ఇద్దరు బెంగళూరులో ఉన్నారని, వాళ్లు విదేశీ నిధులతో.. సోషల్ మీడియా పోస్టులతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారని సిఎం ఫడ్నవీస్ పేర్కొన్నారు. అబద్ధాలు చెబుతూ అర్బన్ నక్సల్స్ గడ్చిరౌలిని అభివృద్ధికి దూరం చేస్తున్నారని ఆయన తెలిపారు.

# ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 9.74 లక్షల టన్నుల డిఎపి దిగుమతి

## ఎరువుల లభ్యతపై రాజ్యసభలో కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ ప్రకటన



**న్యూఢిల్లీ, జూలై 22:** దేశీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశం 9.74 లక్షల టన్నుల డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డిఎపి)ని దిగుమతి చేసుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరానికి డిఎపి దిగుమతికి గణాంకాలను కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియపటేల్ రాజ్యసభలో వెల్లడించారు. దేశం ఏప్రిల్‌లో 2.89 లక్షల టన్నులు, మేలో 2.36 లక్షల టన్నులు, జూన్‌లో 4.49 టన్నులు దిగుమతి చేసుకుందని చెప్పారు.

2024-25 ఆర్థికసంవత్సరంలో 45.69 లక్షల టన్నులు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 55.67 లక్షల టన్నులు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 65.83 లక్షల టన్నులు, 2021-22 ఆర్థిక సంవత్సంలో 54.62 లక్షల టన్నులు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 48.82 లక్షల టన్నులు దిగుమతి చేసుకుందని వివరించారు. యూరియాను 2024-25లో 56.47 లక్షల టన్నులు, 2023-24లో 70.42 లక్షల టన్నులు, 2022-23లో 75.80 లక్షల టన్నులు, 2021-22లో 91.36 లక్షల టన్నులు, 2020-21లో 98.28 లక్షల టన్నులు దిగుమతి చేసుకున్నట్లు వివరించింది. ఖరీఫ్ నేపథ్యంలో రైతుల అవసరాలను తీర్చేందుకు అవసరమైన ఎరువులు ఉన్నాయని తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో రసాయన ఎరువుల అవసరం గతేడాది కంటే ఎక్కువగా ఉందన్నారు. రుతుపవనాలతోపాటు సాగు విస్తీర్ణం పెరిగింది. ఏప్రిల్ 2010 నుంచి కేంద్రం ఫాస్ఫేటిక్, ఫొటాసిక్ (పిఅండ్‌కె) ఎరువుల కోసం పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బిఎస్) విధానాన్ని అమలుచేసింది.

ఎరువుల డిమాండ్, ఉత్పత్తి మధ్య అంతరాన్ని దిగుమతుల ద్వారా తీరుస్తామని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ చెప్పారు. భౌగోళిక రాజకీయ కారణంగా సరఫరా గొలుసులో ఎదురైన అంతరాయాల ప్రభావాన్ని తగ్గించేందుకు.. ఎరువుల కంపెనీలు నిరంతరాయంగా సరఫరాను చేసేలా డిఎపి ఉత్పత్తి చేసే దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

## ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన మహిళ

### ఇంట్లో గొయ్యితీసి పూడ్చేసి పరార్

**ముంబై, జూలై 22:** ప్రియుడి సాయంతో భర్తను చంపి, ఇంట్లోనే పూడ్చిపెట్టిన ఓ మహిళ .. ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా ప్రియుడితో పారిపోయింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దారుణ ఘటన మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధనివ్‌బాగ్ ప్రాంతానికి చెందిన విజయ్ చౌహాన్ (34), చమన్ అలియాస్ గుడియాదేవి (32) పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే గుడియాదేవి తమ పొరుగునే ఉన్న మోనువిశ్వకర్మ (33)తో వివాహేతర సంబంధాన్ని ఏర్పరుచుకుంది. దీంతో వారిద్దరూ తమకు అడ్డుగా ఉన్న విజయ్ చౌహాన్‌ను చంపడానికి ప్రణాళిక వేసుకున్నారు. దాదాపు 15 రోజుల క్రితం వీరిద్దరూ విజయ్‌ను హత్యచేసి, అతని ఇంట్లోనే గొయ్యి తీసి పాతిపెట్టారు. తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా ఉండడానికి అక్కడ కొత్త టైల్స్‌తో కప్పి ఏమీ తెలియనట్లుగా ఉన్నారు.

అయితే ఈ కేసు ఎలా వెలుగులోని వచ్చిందంటే.. విజయ్ తోబుట్టువులు ఓ ఇల్లు కొనాలని అనుకుని డబ్బులకోసం వారు విజయ్‌కు ఫోన్ చేయగా, ఎన్నిసార్లు ఫోన్ చేసినా విజయ్ స్పందించలేదు. దీంతో వారు తమ సోదరుడి ఇంటికి వెళ్లి ఆరా తీయగా, తన భర్త పని కోసం కుర్లాకు వెళ్లాడని గుడియా చెప్పింది. దీనితో వారు వెళ్లిపోయారు. ఆ తర్వాత విజయ్ తిరిగి ఇంటికి వచ్చాడో, లేదో తెలుసుకోవడానికి ఈ నెల 19న మళ్లీ గుడియాకు ఫోన్ చేశారు. కానీ ఆమె ఫోన్‌ను స్విచ్ ఆఫ్‌చేసి ఉంది. దీంతో విజయ్ సోదరులకు అనుమానం వచ్చి ఇంటికి వెళ్లిచూశారు. ఆమె కనిపించకపోవడంతో పెల్హార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దీంతో రంగంలోకి దిగిన పోలీసులు విజయ్ ఇంటిని పరిశీలించగా, అక్కడ కొత్తగా వేసిన టైల్స్ కనిపించాయి. వాటిని తొలగించి చూడగా, దుర్వాసనవచ్చింది. దీనితో అక్కడ తవ్విచూడగా కుళ్లిపోయిన స్థితిలో విజయ్ మృతదేహం కనిపించింది. ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ముంబయిలోని జెజె ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు.

# ధన్‌ఖడ్ రాజ్యాంగ విలువలను కాపాడారు

## ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాన్ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మీ పదవీ కాలంలో ఉప రాష్ట్రపతి పదవి గౌరవాన్ని అచంచలమైన నిబద్ధతతో నిలబెట్టారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ దయ,నిష్పాక్షికత,సమగ్రతతో భాధ్యతలు నిర్వహించారు. రాజకీయ ఒత్తిడి లేకుండా నిర్భయంగా మీ అభిప్రాయాలను వ్యక్తీకరించారు.గౌరవనీయమైన పాత్ర నుంచి వైదొలగుతున్న మీకు మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన జీవనం ఉండాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ గత రాత్రి రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ హోదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న జెడియూ నేత హరివంశ్ నడిపించనున్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా భాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ళ 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. ధన్‌ఖడ్ ఆదర్శనీయ రాజకీయ వేత్తని పవన్ అన్నారు.

## హాకీ క్రీడాకారిణిపై సామూహిక అత్యాచారంకేసులో

# నలుగురు కోచ్‌ల అరెస్టు

### ఒడిశా 'సాయ్' సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ప్లేయర్

**భువనేశ్వర్, జూలై 22:** ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లాలో 15 యేళ్ల టీనేజ్ హాకీ క్రీడాకారిణిపై కోచ్‌లే సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన నివ్వెరపరుస్తోంది. ఈ కేసులో నలుగురు హాకీ కోచ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దారుణం రూర్కెలాలోని సాయ్ (స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) సెంటర్‌లో చోటుచేసుకుంది. బాధితురాలు గత రెండేళ్లుగా ఈ కేంద్రంలో శిక్షణ పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న సాయంత్రం స్థానిక స్టేడియంలో కోచింగ్ సెషన్ ముగిసిన తర్వాత నలుగురు కోచ్‌లు .. ఆ క్రీడాకారిణిని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ వారు తనపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదరించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ రాత్రి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. భువనేశ్వర్ డిసిపి ప్రతీక్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకుని నలుగురు శిక్షకులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని వివిధ సెక్షన్లతోపాటు సామూహిక అత్యాచారం, పోక్సో చట్టం సెక్షన్ 6 కింద కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ సంఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# సంక్షిప్తంగా..

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదరింపు



**గాంధీనగర్, జూలై 22:** దేశంలో బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా అహ్మదాబాద్ విమానాశ్రయానికి ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు సోదాలు చేపట్టారు. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్‌కు మంగళవారం ఉదయం బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్ట్‌లో సోదాలు చేపట్టారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికిచేరుకుని బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అయితే ఇప్పటివరకు జరిపిన సోదాల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ కనిపించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అహ్మదాబాద్ క్రైంబ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శరద్ సింఘాల్ తెలిపారు.

## రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం, ఐదుగురు మృతి

**జైపూర్, జూలై 22:** రాజస్థాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. బికనీర్ జిల్లాలోని సిఖ్వాల్ ప్రాంతంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో అయిదుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జాతీయ రహదారి 11పై ఈ ఘటన చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు రెండు కార్లలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఖతుష్యం ఆలయ సందర్శనకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కార్లు ప్రమాదానికి గురయ్యాయి. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో కార్లు రెండూ నుజ్జునుజ్జు అయ్యాయి. కార్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు విద్యుత్ కట్టర్లను ఉపయోగించాల్సి వచ్చింది. కార్లలో ఉన్న మృతదేహాలను బయటకు తీసేందుకు దాదాపు గంట సమయం పట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు.

## భారత్‌కు అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు



**న్యూఢిల్లీ, జూలై 22:** భారత ఆర్మీ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు చేరుకున్నాయి. హిండన్ ఎయిర్‌బేస్‌లో తొలి విడితగా మూడు హెలికాప్టర్లు అమెరికా మిలిటరీ ట్రాన్స్‌పోర్టు ప్లేన్‌లో హిండన్ ఎయిర్‌బేస్‌కు చేరుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీటిని పూర్తిస్థాయిలో అసెంబుల్ చేసి తనిఖీలు నిర్వహించాక సైన్యానికి చెందిన ఏవియేషన్ కోర్ విభాగానికి అందించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాక వీటిని జోధ్‌పూర్‌కు తరలిస్తారు. అపాచీ హెలికాప్టర్‌లు భారత్‌కు చేరుకోవడంపై సైన్యం హర్షం వ్యక్తంచేసింది. ఇదో ముఖ్యమైలు రాయి అని వ్యాఖ్యానించింది. భారత అమ్ములపొదిలో అత్యాధునిక హెలికాప్టర్ల చేరికతో కార్యనిర్వాహకసామర్థ్యాలు మరింతపెరిగాయని పేర్కొంది. అపాచీ హెలికాప్టర్‌లతోకూడిన ప్రత్యేక స్క్వాడ్రన్‌ను గతేడాది మార్చిలోనే జోధ్‌పూర్‌లో ఏర్పాటు చేశారు.అపాచీ ఎహెచ్-64ఇ అటాక్ హెలికాప్టర్ల కోసం 2020లో అమెరికాతో భారత ఆర్మీ 600 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది.

## బీహార్ ఓటర్ లిస్టు నుంచి 51 లక్షల పేర్లు తొలగింపు

**పాట్నా, జూలై 22:** బీహార్ ఎన్నికల జాబితా నుంచి 51 లక్షల పేర్లు తొలగించినట్లు ఎన్నికల కమిషన్ మంగళవారం ప్రకటించింది. ఓటర్లు మరణించడం, వలస వెళ్లడం ఇందుకు కారణాలుగా తెలిపింది. ముసాయిదా ఎన్నికల జాబితాలో అర్హులైన ఓటర్లను చేరుస్తామని హామీ ఇచ్చింది. ఆగస్టు 1న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. 'బీహార్ ఎస్ఐఆర్ ఇంతవరకూ వెల్లడైన నిజాలు' అనే పేరుతో ఎన్నికల కమిషన్ ఇక నోట్ విడుదల చేసింది. ఇంతవరకూ నిర్వహించిన బీహార్ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో 18 లక్షల మంది ఓటర్లు చనిపోయినట్లు తమ దృష్టికి రాగా, 26 లక్షల మంది వివిధ నియోజకవర్గాలకు మారిపోయారని, రెండుచోట్ల పేరు నమోదు చేసుకున్న వారు 7 లక్షల మంది ఉన్నారని వివరించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ బాధ్యతగా ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్నామని ఇసి తెలిపింది.

# బోయకొండ గంగమ్మ ఆలయంలో పట్టుబడ్డ ఇంటి దొంగలు

## - పెద్దభోగం టిక్కెట్లలో చేతివాటం - ఆరుమందిపై వేటు

**బోయకొండ(చౌడేపల్లి), జూలై 22 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలంలో వెలసిన శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఇంటి దొంగలు పట్టుబడ్డారు...నెలల తరబడి గుట్టుచప్పుడు కాకుండా టిక్కెట్ల విక్రయాల్లో చేతివాటం ప్రదర్శిస్తూ వేలాది రూపాయలు కొట్టేస్తున్న వైనాన్ని పసిగట్టి పట్టుకొన్నారు...ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిపై వేటు వేసారు...ఉన్నతాధికారులు కథనం మేరకు...శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదాయం పెంచే క్రమంలో కొన్ని సంస్కరణలు తీసుకొచ్చారు. కొండపై భక్తులు అమ్మవారికి సమర్పించే పెద్దభోగం, చిన్నభోగం విషయంలో అమ్మవారికి చెందేలా రూ. 200ల టిక్కెట్టును ఏర్పాటు చేసారు. పెద్దభోగం, చిన్నభోగం చెల్లించే భక్తులు టిక్కెట్టును తీసుకోవాల్సి వుంది. అక్కడ ఆలయానికి చెందిన కొందరు టిక్కెట్టు పుస్తకాలను వారికి తగ్గట్టుగా మలచుకొన్నారు. ఆలయ అధికారులు ఏప్రిల్ నుంచి వందటిక్కెట్లుగల పుస్తకాన్ని అందించి సాయంత్రం సంబంధిత కలెక్షన్‌ను చెల్లించేవారు. ఈక్రమంలో టిక్కెట్టు పుస్తకంలోని ఓ భాగాన్ని భక్తులకందించి తర్వాత మిగిలిన సగంలో ఎవరైతే డ్యూటీలో వుంటారో వారి సంతకంతో కూడినదిగా వుంటుంది. ఇక్కడే ఇంటి దొంగలు తమ చేతికి పనిపెట్టారు. భక్తులకు ఇచ్చే టిక్కెట్టుతో పాటు పుస్తకంలో ఎవరూ గుర్తించరాదని అక్కడక్కడా తక్కిన టిక్కెట్టును ఇచ్చేసి భక్తులనుంచి ప్రతి టిక్కెట్టుకూ రూ. 200లు జేబులోకి వేసుకొన్నారు. ఏప్రిల్ నుంచి దాదాపు 55పుస్తకాలను విక్రయించారు. ఒక్కో పుస్తకానికి 100టిక్కెట్లుంటాయి. ఇప్పటి వరకు ఆయా టిక్కెట్ల నుంచి అక్కడక్కడా రూ. 47,200ల వరకు స్వాహా అయినట్లుగా అధికారులు గుర్తించారు. టిక్కెట్ల వ్యవహారంలో ఉన్నవారందరిపై ఎండోమెంట్ కమీషనర్ ఆదేశాల మేరకు వేటు వేసినట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. వారిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. టిక్కెట్ల వ్యవహారంలో ఎక్కడ ఎలా జరిగిందనే విషయంపై ఆరా తీస్తున్నట్లు వివరించారు. విక్రయాల్లో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగముని, సోమశేఖర్‌రాజు, మునిశేఖర్, గంగరాజు, హరిప్రసాద్, విజయ్‌కుమార్‌రెడ్డిలపై వేటు వేసి విచారిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



మెగా జాబ్ మేళాలో ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

# యువతకు ఉద్యోగాలు వారి కుటుంబాలకు గేమ్ ఛేంజర్

## - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, జూలై 22 ప్రభాతవార్త** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం వారి కుటుంబాలకు గేమ్ ఛేంజర్ లాంటిదని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కుప్పం కడ కార్యాలయంలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) అధ్వర్యంలో వన్‌ఎంటువన్‌బి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 35కు పైగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 600మందికి పైబడి యువతీయువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. యువగళ ం పాదయాత్ర సందర్భంగా ప్రకటించిన 20 లక్షల ఉద్యోగాలను రానున్న నాలుగేళ్లలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కుప్పం ప్రాంతంలో యువతకు ఉపాధి కల్పించేందుకు సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కడ ద్వారా కుప్పానికి వివిధ సంస్థల ద్వారా జాబ్ మేళాల నిర్వహణకు ఆదేశించారన్నారు. యువత తమకు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అతిత్వరలోనే స్థానికంగానే యువతకు ఉపాధి కల్పనకు వివిధ రకాల పరిశ్రమలు వస్తున్నాయన్నారు. యువత ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్‌లు మాట్లాడుతూ కుప్పంలో మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. యువతీయువకులు కష్టపడి చదివించిన దానికి ఫలితాలు ఇవ్వాలని సూచించారు. కుప్పంలో ఇది రెండో మెగా జాబ్ మేళా అని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో కడ సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాజ్‌కుమార్, రామచంద్ర, సుగుణమ్మ, సతీష్, వెంకటేష్, రఘు, వన్‌ఎంటువన్‌బి సంస్థ ప్రతినిధులు స్నేహ, దీపిక వెంకటేష్,మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శబరి ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్

## - రైలునెంబర్లు, వేళల్లో మార్పులు
## - సెప్టెంబరు 29నుంచి వర్తింపు

**గుంతకల్లు రైల్వే, జూలై 22,ప్రభాతవార్త** సీమాంధ్ర మీదుగా సికింద్రాబాద్-తిరువనంతపుర-సికింద్రాబాద్‌ల మధ్య తిరిగే శబరీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను సెప్టెంబరు 29నుంచి సూపర్‌ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రైలు నెంబర్లను సైతం మార్పులు చేసి నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తిరువనంతపురం- సికింద్రాబాద్-తిరువనంతపురం మధ్య తిరిగే నెంబర్ 17229/17230శబరీ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు 29నుంచి 20630/20629గా నెంబర్లను కేటాయించారు. తిరువనంతపురం నుంచి సికి ంద్రాబాద్ వెళ్లే నెంబర్ 20630శబరీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 29నుంచి ప్రతిరోజు ఉదయం 6.45గంటలకు తిరువనంతపురం నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురం వెళ్లే నెంబర్ 20629శబరీ సూపర్ ఫాస్ట్ సెప్టెంబరు 29నుంచి మధ్యాహ్నం 2.25గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 6.20గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో తెలుగు రాష్ట్రాల్లో చిత్తూరు, తిరుపతి,రేణిగుంట, గూడూరు, నెల్లూరు,సింగరాయకొండ, ఒంగోలు, చీరాల,బాపట్ల, నిడుబ్రోలు, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి,పిడుగురాళ్ల, నడికూడి, మిర్యాలగూడ, నల్గొండ,చర్లపల్లి స్టేషన్లలో నిలుస్తాయి.

# ఆదాయపు పన్ను ఫైలింగ్‌పై అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఎపి ట్రాన్స్‌కో

**విజయవాడ, జులై 22,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆదాయపు పన్ను (ఇన్‌కమ్ టాక్స్) ఫైలింగ్ పై అవగాహన కల్పించడం ద్వారా సంస్థకు సమగ్ర ప్రయోజనం కలగడం తో పాటు , ఉద్యోగుల వ్యక్తిగత ఆర్థిక బాధ్యతల్లో స్పష్టత పెరుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ (ఫైనాన్స్) ఎన్.వి. రమణ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో నిర్వహించిన ఈ అవగాహనా కార్యక్రమంలో ఉద్యోగులకు టాక్స్ ఫైలింగ్ ప్రాసెస్, కీలక సమాచారం, లాభాలు, తప్పక పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై జాయింట్ కమీషనర్ ఇన్కమ్ టాక్స్ అభినయ, ఇన్‌కమ్ టాక్స్ డిప్యూటీ కమిషనర్లు డాక్టర్ టీ. సవీష్ వర్మ ప్రేమ్ కుమార్, ఐఆర్‌ఎస్ సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో ఎఫ్‌ఎ సిసిఎ వీ.డి. సర్వేశ్వర రావు, ఎఫ్‌ఎ సిసిఎ కె.వి.ఎస్.ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ తరహా అవగాహనా కార్యక్రమాలు ఉద్యోగుల ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో సహాయపడతాయని, ముందుగానే పన్నుల ఫైలింగ్ పూర్తి చేయడం ద్వారా లెక్కల లోపాలు నివారించగలమని డైరెక్టర్ ఫైనాన్స్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా డా. సవీష్ వర్మ ఏ పీ ట్రాన్స్‌కో కు సంబంధించి సెక్షన్ 192, 194ది, 194ı, 194రి, 194 వంటి ముఖ్యమైన టిడిఎస్ నిబంధనలు, 2025 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చిన తాజా మార్పులపై వివరించారు. టిడిఎస్ చెల్లింపు, రిటర్న్ ఫైలింగ్ మరియు సర్టిఫికెట్ల జారీ వాయిదా వేయడం వల్ల ఎదురయ్యే వడ్డీ, జరిమానా, శిక్షలపై ఉద్యోగులను అప్రమత్తం చేశారు. సాధారణంగా జరిగే తప్పిదాలు (సెక్షన్ కోడ్లు, చలాన్ వివరాల పొరపాట్లు) నివారించేందుకు చాలన్ చెక్‌లిస్ట్‌లు, సాఫ్ట్‌వేర్ టూల్స్ ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రేమ కుమార్ 2024-25కి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్న్ ఫైలింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఫైలింగ్ కేవలం చట్టబద్ధ విధినే కాకుండా, రిఫండ్‌లు పొందడం, ఆర్థిక పారదర్శకత కోసం అవసరమని చెప్పారు. ఆచా ఫారాల అనుసంధానం, పాత మరియు కొత్త పన్ను విధానాల మధ్య తేడాలు, సెక్షన్ 87 కింద రూ 75,000/ వరకు రిఫండ్, మరియు తప్పిద దావాలపై శాఖ చర్యలు వంటి అంశాలపై కూడా వివరంగా చర్చ జరిగింది. ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ సిసిఎ బీ. నాగరాజు, డిప్యూటీ సిసిఎ పీ.బీ.కె. శర్మ, విద్యుత్ సౌధలో పనిచేస్తున్న సిబ్బంది తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యుత్ ఉద్యోగులు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జగన్మాతకు వేడుకగా పారిశుద్ధ్య విభాగం ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జూలై 22, ప్రభాతవార్త** దుర్గమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరించి అక్కడినుండి ప్రత్యేకమార్గం ద్వారా శ్రీ అమ్మవారి దర్శనానికి సులభంగా వచ్చేలా నూతన ప్రణాళిక గురించి ఇఓ వికె శీనా నాయక్ మంగళవారం చర్చించారు. లిఫ్టుమార్గంలో భక్తుల రద్దీ తగ్గించడానికి ఈఓ ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. దుర్గమ్మవారికి ఆలయంలో అన్నదాన



ఆషాడం సారె ను తీసుకొచ్చిన పారిశుద్ధ్య విభాగంవారు



విభాగంలో సేవలందిస్తున్న ఉద్యో గులు మంగళవారం ఆషాడం సారెను అందించారు. ముందూ అర్జున వీధిలోని శ్రీ శృంగేరి జగద్గురు మఠం నందు శ్రీ అమ్మవారికి ఇఓ వికె శీనా నాయక్ కొబ్బరికాయకొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాడం సారెను తీసుకుని శ్రీ అమ్మవారి ఆలయానికి రాగా అక్కడ మేళతాళాలు, మంగళవాయిద్యాలతో మంత్రపఠనాల నడుమ స్వాగతం పలికి ఆషాడం సారెను శ్రీ అమ్మవారికి నివేదించారు. దుర్గమ్మవారికి ఆలయంలో పారిశుద్ధ్య విభాగంలో సేవలందిస్తున్న ఉద్యోగులు మంగళవారం ఆషాడం సారెను అందించారు. ముందూ జమ్మిదొడ్డిలో ప్రారంభ కార్యక్రమం నందు శ్రీ అమ్మవారికి ఇఓ వికె శీనా నాయక్ కొబ్బరికాయకొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాడం సారెను తీసుకుని శ్రీ అమ్మవారి ఆలయానికి రాగా అక్కడ మేళతాళాలు, మంగళవాయిద్యాలతో మంత్రపఠనాల నడుమ స్వాగతం పలికి ఆషాడం సారెను శ్రీ అమ్మవారికి నివేదించారు. జగన్మాత దుర్గమ్మ వారికి మంగళవారం భక్తబృందాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆషాడం సారెను సమర్ పించారు.

వన్‌టౌన్ పోలీస్, ట్రాఫిక్ విభాగం వారితో కలిసి ఈ మేరకు భక్తులు దుర్గమ్మ దర్శనానికి వచ్చే మార్గాన్ని పరిశీలించారు. ముందుగా కేశఖండన శాల వద్ద నుండి భక్తులు నేరుగా దుర్గాఘాట్ వద్దకు చేరుకుని అక్కడ స్నానాలాచరించి, అక్కడ వారి సెల్‌ఫోన్లు, బ్యాగులు పెట్టుకోడానికి కౌంటర్ల వద్ద పెట్టుకుని అక్కడినుండి నేరుగా దుర్గమ్మ దర్శనానికి నడక మార్గం ద్వారా కాని, లేదా రిటైనింగ్ వాల్ వద్ద నుండి ఏర్పాటు చేసిన బస్సు ద్వారా రావడానికి ఏర్పాట్లు చేయడానికి ఈవో పరిశీలన చేశారు. దీనిద్వారా కనకదుర్గానగర్,

మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు.
ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు.

# గత ప్రభుత్వం మద్యం అమ్మకాలలో డిజిటల్ పేమెంట్ ఎందుకు చేయలేదు : మంత్రి అనగాని సత్యప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి మంత్రి

**రేణిగుంట జూలై 22 ప్రభాతవార్త** గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లు ఎందుకు చేయలేదని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఘాటుగా స్పందించారు. రేణిగుంట పట్టణంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ గత వైసిపి ప్రభుత్వం మద్యం అమ్మకాలపై ఘాటుగా విమర్శించారు. చిన్న బత్తాయి జ్యూస్ అమ్ముకునే బండ్లలో డిజిటల్ పేమెంట్లు పెట్టినప్పుడు లక్షల కోట్లు రూపాయల వ్యాపారం జరిగే మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్ విధానాన్ని ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మద్యం షాపులకు వచ్చిన నగదు ఏమైంది అంటూ ప్రశ్నించారు. నాసిరకమైన మందు తయారు చేసి ఎంతోమందిని చావుకు కారకులయ్యారన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు ఎప్పటికీ పాల్పడదని అన్నారు. 30 సంవత్సరాలు వెనక్కు వెళ్లిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత సంవత్సర కాలంలో ఎన్నికల మేనిఫెస్టోలని అంశాలను అమలుపరుస్తూ వస్తున్నారు. సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు, పింఛన్ల పెంపుదల, విద్యార్థులకు చదువుల కోసం తల్లికి వందనం పథకాలను అమలుపరుస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

# విద్యుత్ కార్మికులకు అన్యాయం చేస్తారా!

## సిపిఐ రామకృష్ణ

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ రంగ సమస్యలపై యాజమాన్యం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీ ఎంఎల్ఏ కె రామకృష్ణ ఆరోపించారు.ఈ రంగాన్ని అదానీకి కట్టబెట్టి కార్మికుల పొట్టగొండతారా అని ప్రశ్నించారు. విద్యుత్ ఉద్యోగులు,కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంస్థ ఉద్యోగులు కార్మికులు ఆందోళన చేస్తున్నారు. వారి సీపీఐ సంఘీభావం ప్రకటించింది.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని చెప్పారు. ఏపీ ఎలక్ట్రికల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామలింగారెడ్డి మాట్లాడుతూ...జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు సర్వీస్ సిబంధనల్లో వివిక్ష తొలగించి, అందరికీ సమానమైన ఏపీఎస్ఈబీ నిబంధనలు అమలు చేయాలని ఏఎల్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నా శివయ్య,గ్రామ,వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మల్లిఖార్జునరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ తదితరులు మాట్లాడారు.

# పౌరసరఫరాలశాఖ గోదాములో మంత్రి మనోహర్ ఆకస్మిక తనిఖీ

**గన్నవరం(కృష్ణా), జులై 22, ప్రభాతవార్త :** పౌరసరఫరాలశాఖ గోదాములో పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గన్నవరం మార్కెట్ యార్డులోని పౌరసరఫరాలశాఖ స్టాక్‌పాయింట్‌లో మంగళవారం మధ్యాహ్నం మ ంత్రి మనోహర్ తనిఖీలు చేసారు. ఈసందర్బంగా గోదామును మొత్తం పరిశీలించారు. గోదాములో బియ్యం సంచులకు చిల్లులు పడి కారిపోయిన బియ్యాన్ని వేరే సంచుల్లోకి నింపిన సంగతిని గుర్తించిన ఆయన అధికారులను మందలించారు. గత మూడు నెలలుగా గోదాముకు వచ్చిన స్టాక్ డీలర్లకు పంపిణీ చేసిన స్టాకు వివరాలను తనకు పంపించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ బియ్యాన్ని బడి బియ్యాన్ని వేరే ్వరుగా నిల్వచేయాలని సూచించారు. గత కొంతకాలంగా రేషన్ సంచుల్లో బియ్యం తగ్గుతున్నాయన్న డీలర్ల ఫిర్యాదు మేరకు బియ్యం బస్తాలను తూకం వేసి బరువులు పరిశీలించారు. పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని అక్రమాలర్కుపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్బంగా మంత్రి హెచ్చరించారు.

# యేడాదిలో 9.50 లక్షల కోట్ల పెట్టుబడులు


## - రూ.1.50 కోట్లతో నిర్మించిన రహదారి ప్రారంభోత్సవం - సమస్యలపై పోరాడే నాయకులు ఉండటం మీ అదృష్టం - పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్



**కోవూరు (నెల్లూరు), జూలై 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం పదిలంగా ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు ఏడాది కాలంలో చేసిన మంచిని వివరించేందుకు ప్రజల మధ్యకు వచ్చినట్లు ఆయన వివరించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంకు వచ్చిన రాష్ట్ర మంత్రి టిజి భరత్ కి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా పోతిరెడ్డిపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం.. రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పోతిరెడ్డిపాలెం బ్రాంచ్ రోడ్డు, పోతిరెడ్డిపాలెం నుంచి గిరిజన తిప్ప వెళ్లే రోడ్లను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తో కలిసి మంత్రి భరత్ ప్రారంభించారు. అనంతరం పోతిరెడ్డి పాలెం గ్రామంలో 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత రోడ్లకు ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. పోతిరెడ్డిపాలెం గ్రామంలోని శ్రీవాణి కాలనీలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, మంత్రి భరత్‌కు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ.. ఆప్యాయంగా పలకరించారు. సుపరిపాలన కరపత్రాలు అందించి ఏడాదికాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న వారి కళ్లలో సంతోషం చూశారు. ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో సంతోషంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని నేతలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ సమస్యలే పరిష్కారంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పనిచేస్తున్నారని, ఆ విషయాన్ని తాము ప్రత్యక్షయంగా చూస్తున్నామన్నారు. ఎప్పుడు ఎక్కడ పలకరించినా.. ప్రజా సమస్యలనే ప్రస్తావిస్తుంటారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనితీరును ఆయన కొనియాడారు. గత పాలనలో అధ్వానంగా మారిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిన పెడుతున్నారన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పినా వారి తీరు మారడం లేదని, ఇటీవల ప్రశాంతమ్మను అసభ్య పదజాలంలో మాట్లాడిన తీరును ఆయన తప్పుబట్టారు. సీఎం చంద్రబాబు ఒక విజన్‌తో పాలన సాగిస్తున్నారని, ఆయన విజన్‌కు నేటి హైదరాబాద్ నిదర్శనమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సుస్థిర ప్రభుత్వాలు అత్యవసరమని ఆయన వ్యాఖ్యానించారు.

భవిష్యత్తులో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వమే రావాలన్నారు. రాష్ట్రంలో
ఈ ఏడాదిలో 9.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇది చంద్రబాబు నాయుడు బ్రాండ్ అని చెప్పారు. ఇది పనిచేసే ప్రభుత్వమని, ఎంజాయ్ చేసే ప్రభుత్వం కాదన్నారు.

# నలుగురిని చదివించేందుకు ముందుకు వచ్చిన విదేశీ విద్య పథకం లబ్ధిదారుడు సాత్విక్



స్కాలర్ షిప్ పేరుతో ఆర్థిక సాయం అందిస్తానంటూ సీఎం చంద్రబాబుకు ధృవీకరణ పత్రం అందిస్తున్న సాత్విక్

**విజయవాడ జులై 22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పేదల అభ్యున్నతికి ఉపయోగపడాలి. అప్పుడే ఆ పథకాలకు సార్థకత చేకూరుతుంది. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. ఇప్పుడు ఆ పథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నాడు ఆర్థిక సాయం పొందిన చేతులు.. ఇప్పుడు పేదలకు సాయం చేయడానికి ముందుకు వస్తున్నాయి. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును యువ వ్యాపారవేత్త సాత్విక్ మురారి కలిశారు. 2016 సంవత్సరంలో విదేశీ విద్యా పథకం కింద ఐర్లాండులో చదువుకోవడానికి నాటి టీడీపీ ప్రభుత్వం సహకరించిందని ముఖ్యమంత్రికి సాత్విక్ వివరించారు. ప్రభుత్వం అందించిన సాయంతో బిజినెస్ మేనేజ్మెంట్లో ఐర్లాండులో ఎంఎస్ విద్యను అభ్యసించానని చెప్పారు. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం చేసిన తాను.. ఇప్పుడు ఐర్లాండులో వ్యాపారాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. నాడు ప్రభుత్వం నుంచి సాయం పొందిన తాను.. ఇప్పుడు విదేశాల్లో చదవాలని ఆసక్తి చూపించే పేద విద్యార్థులకు సాయం చేయాలనే ఉద్దశంతో ఉన్నట్టు సాత్విక్ చెప్పారు.

# బంగారు కుటుంబాల గుర్తింపునకై ప్రత్యేక సర్వే

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పీ4 జీరో పావర్టీ కార్యక్రమంపై ప్రత్యేక సర్వే చేయిస్తోంది. 12 ప్రశ్నలతో సర్వే నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా యాప్ ద్వారా సర్వే చేస్తోంది. గ్రామ, వార్డ్ సచివాలయాల పరిధిలో ఈ సర్వే కొనసాగుతోంది. కుటుంబంలో ఎంతమంది ఉన్నారు.. ఇతర ప్రాంతాల్లో ఎవరున్నారు అనే అంశంపై సర్వే చేయిస్తోంది. ఆస్తులు ఎన్ని.. ప్రభుత్వం ఇస్తున్న పథకాల వివరాలపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. కార్, టూ వీలర్, భూమి ఉన్నాయా అని ప్రశ్నలు అడుగుతున్నారు. టీవీ ఫ్రిజ్..ఉన్నాయా...అని ప్రశ్నిస్తూ అధికారులు సర్వే చేస్తున్నారు. భవిష్యత్‌లో ఉద్యోగం కావాలా?.. బ్యాంక్ లోన్ కావాలా?..లేదా బిజినెస్ పెట్టుకుంటారా?. ఇలా పలు ప్రశ్నలని అడుగుతూ అధికారులు సర్వే చేస్తున్నారు. వ్యవసాయ రుణాలు, ఆదాయం వృద్ధి కోసం ఏమి కావాలనే అంశంపై ప్రశ్నలు అడుగుతున్నారు. వచ్చే నెల (ఆగస్టు) 5వ తేదీ వరకు ప్రభుత్వం సర్వే చేయనుంది. ఈ సర్వే అనంతరం ఆగస్టు 15వ తేదీన ఏపీ ప్రభుత్వం బంగారు కుటుంబాల ప్రకటన విడుదల చేయనుంది.

# ఎన్ఎంసి ప్రమాణాలు లేని బలీజ్, కొలంబస్, వాషింగ్టన్, చిర్చిక్ విదేశీ వైద్య విశ్వవిద్యాలయాలో చేరకండి

## - వైద్య విద్యకోసం విదేశాలకు వెళ్లే వారికి ఎన్ఎంసి హెచ్చరిక

**విజయవాడ,జులై 22,ప్రభాతవార్త ప్రతినిధి:**విదేశాల్లో వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు కొన్ని అంశాలు గుర్తించాలనిజాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) హెచ్చరించింది.అది గుర్తించకపోతే నష్టపోతారని స్పష్టం చేసింది. ఆయా దేశాల్లోని వైద్య కళాశాలలు ఎన్ఎంసీ ప్రమాణాలకనుగుణంగా ఉన్నాయో లేదో సరిచూసుకోకపోతే నష్టపోతారని తెలిపింది ఆ మేరకు ఎన్ఎంసీ విడుదల చేసిన 'అలర్ట్ నోటీస్'లో హెచ్చరించింది. ముఖ్యంగా బలీజ్ దేశం లోని సెంట్రల్ అమెరికన్ హెల్త్ అండ్ సైన్సెస్ యూనివర్సిటీ, పాటు...ఉజ్బెకిస్థాన్ లోని చిర్చిక్ బ్రాంచ్ ఆఫ్ చేరవద్దని సూచించింది.

# లోకాయుక్త జోక్యంతో.. పోలవరం నిర్వాసితులకు న్యాయం

**కర్నూలు, జూలై 22, ప్రభాతవార్త :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులలో కొందరికి అన్యాయం జరగడంపై లోకాయుక్త స్పందించి విచారణ చేపట్టింది. ఆ మేరకు బాధితుల ఫిర్యాదును సమర్థిస్తూ వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంది. పోలవరం ప్రాజెక్టు పునఃనిర్మాణం మరియు పునః నిర్మాణ ప్యాకేజీ కింది నిర్వాసితులకు సరైన పరిహారం అందజేయడం ద్వారా పౌరుల హక్కులను వరిరక్షించడంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త మరియు ఉపలోకాయుక్త సంస్థ మరోసారి కీలక పాత్ర వహించింది. పోలవరం ప్రాజెక్టు క్రింద ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ప్రయోజనాల నుండి తమను మినహాఇంచటంపై నల్లాల వెంకట రమణమ్మ మరియు నల్లాల శేషగిరి లోకాయుక్త లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదిదారుల నివాసాలు ప్రభావిత ముంపు ప్రాంతంలో ఉన్నప్పటికీ... వారిని లబ్దిదారుల జాబితాలో చేర్చకపోవటంపై లోకాయుక్త సంస్థ విచారణ చేపట్టింది. వారి ఫిర్యాదులో న్యాయం ఉందని తేల్చడంతో పాటు.. బాధితులకు లబ్ధి చేకూర్చాలని ఆదేశించింది. ఆ మేరకు ధవలేశ్వరం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్వాహకుడు జిల్లా జాయింట్ కలెక్టర్ లోకాయుక్త కు నివేదిక సమర్పించారు. అందులో ఫిర్యాదిదారులను సప్లమెంటరీ డ్రాఫ్ట్ ఆర్ అండ్ ఆర్ పథకంలో చేర్చరని, మరియు ఫిర్యాదిదారులకు ఇంటిస్థలం కేటాయింపుతో పాటు రూ.6,36,000 మరియు రూ.25,000 ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి క్రింద చెల్లించబడిందని నిర్ధారించారు.

# జులై నెల పెన్షన్ల పంపిణీ కోసం రూ.617.54 కోట్ల నిధులు కేటాయింపు

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకంలో భాగంగా జులై నెల పెన్షన్ల పంపిణీ కోసం రూ.617.54 కోట్లను బలహీన వర్గాల సంక్షేమశాఖకు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కె సునీత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు కార్పొరేషన్ల సిఇఒ, పర్సన్ ఇన్‌ఛార్జుల పీడీ ఖాతాలకు ఈ మొత్తాన్ని జమ చేశారు. ఎపి స్టేట్ ఇబిసి కార్పొరేషన్‌కు రూ.28.73 కోట్లు, ఎపి కాపు కార్పొరేషన్‌కు రూ.292.37 కోట్లు, ఎపి రెడ్డి కార్పొరేషన్‌కు రూ.120.84 కోట్లు, ఎపి కమ్మ కార్పొరేషన్‌కు రూ.104.73 కోట్లు, ఎపి క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.16.95 కోట్లు, ఎపి బ్రాహ్మణ్ కార్పొరేషన్‌కు రూ.18.48 కోట్లు, ఎపి వైశ్య కార్పొరేషన్‌కు రూ.35.41 కోట్లు మంజూరు చేశారు.

# అల్లూరులో బైకులు అడ్డు తగలడంతో వ్యక్తి మృతి

**అల్లూరు (నెల్లూరు), జూలై 22, ప్రభాతవార్త :** అల్లూరులోని గోడౌన్స్ లు వద్ద బైకులు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు వివరాలు మేరకు అల్లూరు మండల పరిధిలోని పురిణి పంచాయితీ మందిర ప్రాంతంలోని హరిజనవాడకు చెందిన పొంగులూరి శ్రీహరి 28 మృతి చెందాడు మృతుడు శ్రీహరి అల్లూరు వైపు బైక్ మీద వస్తుండగా గోడౌన్స్ లోపల నుండి రోడ్డుపైకి వచ్చిన బైకును రాసుకుంటూ ఎదురుగా వస్తున్న మరో బైక్ కు మృతుడు చొక్కా తగులుకొని రోడ్డు మీద పడటంతో తలకు బలమైన దెబ్బ తగిలి రక్తపు మడుగులో అక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

# రేపు ఎన్‌జి.రంగా వ్యవసాయవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

**గన్నవరం(కృష్ణా), జులై 22, ప్రభాతవార్త :** ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం స్నాతకోత్సవాన్ని ఈనెల 24వతేదీ నిర్వహించనున్నట్లు యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మిదేవి తెలిపారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణభారత్‌ట్రస్ట్ ఆవరణలో గురువారం జరుగుతుందన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ సిటీ, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
రాష్ట్రం లో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేసి ఆర్థిక తోడ్పటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 4 వ డివిజన్ లో ప్రజల వద్దకు వెళ్ళి కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి వివరించి సంక్షేమ పథకాలు అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలు చేస్తూ, ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వృద్ధులు, వితంతువులకు 4 వేలు, దివ్యాంగులకు 6 వేలు, పూర్తి వైకల్యం ఉన్నవారికి 15 వేలు, దీపం పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల ను అందించడం జరుగుతుందని, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేసి ఆర్థికంగా తోడ్పటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొండబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాలుగో డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకుడు మల్లిపూడి కుమార్ యూత్ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వడిసెల దాలమ్మ, మల్లిపూడి కుమార్, గంజాం నమశ్శివాయ, పోతుల శ్రీనివాసరావు, దిలీప్ కుమార్ సదనాని, మాధవరపు పట్టాభిరామయ్య, శ్రీనివాసరావు, ఆడదా సత్య శ్రీనివాస్, రంగారావు,ఆలమూరి మురలీకృష్ణ, కెంగం హరి రామ ప్రసాద్, రాజు పరిమళ, వడిసెల వెంకటరమణ, మాధవరపు లక్ష్మీనారాయణ, వనమిశెట్టి సుబ్బారావు, కంది శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# వాడపల్లిలో భక్తుల సౌకర్యార్థం ఎస్కలేటర్ ఏర్పాటు : డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రధర రావు



**ఆత్రేయపురం, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
ఏడు వారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి శనివారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి పనులు చేపడుతున్న విషయం విధితమే.ప్రతి శనివారం ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం బయటకు వెళ్ళే మార్గంలో వృద్దులు, దివ్యాంగులు, భక్తులు సౌకర్యార్థం ఎస్కలేటర్ యంత్రం ఏర్పాటును మంగళవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షించారు.

# ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన సాగుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం మండల పరిధి ఈతకోట సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంఎల్ఏ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోనే రాష్ట్రంలో అభివృద్ధి పరంగా ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. పింఛన్ల పెంపుతో మొదలుకొని మహిళలకు



ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే బండారు అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో సఫలీకృతం అయ్యామన్నారు. ఈ విధంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి పాటుపడుతున్నామని తెలిపారు. ప్రాథమిక పాఠశాల వెళ్లి విద్యార్థులను తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థుల మిత్ర కిట్లు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో కొప్పిశెట్టి ప్రసాద్, గుత్తుల పట్టాభి రామా రావు,పెచ్చేటి చిన్నారావు, ఎంపిటిసి బొరుసు సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి బుజ్జి, మిరియాల రాము, మాసాబత్తుల ఆనందరావు,బోడపాటి రాంబాబు,మానే ప్రసాద్, ఇంచార్జ్ ఈఓ పిఆర్డీ,కార్యదర్శి ఎం ఎస్ ఆర్ఎల్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ బి వివిఎస్ఎన్ మూర్తి, సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎం లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పరుగు పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన జస్వంత్ కు మంత్రి సుభాష్ అభినందనలు

**కోనసీమ బ్యూరో, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
నేపాల్ లోని రంగశాల స్టేడియంలో ఈనెల 11 నుంచి 15 వరకు జరిగిన ఇండో- నేపాల్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్- 2025లో 3 కి. మి విభాగం పరుగు పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన రామచంద్రపురం విద్యార్థి మేడిశెట్టి జస్వంత్ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు. తను సాధించిన గోల్డ్ మెడల్ తో జస్వంత్ ఆయన కోచ్ నాగార్జునతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ జస్వంత్ ను, కోచ్ నాగార్జునను దుస్సాలువతో సత్కరించి ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి రామచంద్రపురం కీర్తిని ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడించారని అభినందించారు. ఈ సందర్భంగా జస్వంత్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఉన్న తనకు మంత్రి సుభాష్ రూ.20 వేలు ఆర్థిక సహాయం, ఇతర పోషకాహార వస్తువులు అందించారని గుర్తు చేశాడు. ఇటీవల జరిగిన12 వ ఓపెన్ నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పరుగు పోటీల్లో 3000 మీటర్లు విభాగంలో గోల్డ్ మెడల్



సాధించానని మంత్రికి వివరించాడు. ఈ సందర్భంగా జస్వంత్ ను ప్రోత్సహిస్తూ మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంలు జస్వంత్ కు అభినందనలు తెలియజేసి, ప్రశంసలు కురిపించారు. అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి రామచంద్రపురంకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం పట్ల పలువురు క్రీడాకారుడు జస్వంత్ ను, కోచ్ కె.నాగార్జున ను, జస్వంత్ కుటుంబ సభ్యులను మంత్రి సుభాష్ తో పాటు, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కంచుమర్తి బాబురావు తదితరులు అభినందించారు.

## రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**మామిడికుదురు.జులై 22 , ( ప్రభాతవార్త ) :**
ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎన్వీవీ సత్య నారాయణ సూచించారు.పాశర్లపూడిలంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తెలంగారెడ్డి సూర్యప్రకాశ రావు అధ్యక్షతన మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్య క్రమంలో ఎ.ఓ. మాట్లాడుతూ కొబ్బరి తోటల్లో అంతరపంటల సేద్యం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తోం దన్నారు.ఈ కార్యక్రమంలో చెరుకూరి సత్తిబాబు, తెలగారెడ్డి బులి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వనువులమ్మ తల్లికి సారే..కొర్లపాటివారిపాలెంలో గ్రామ దేవతకు సారె సమర్పించిన మహిళలు

**అంబాజీపేట, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని కొర్లపాటివారిపాలెం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ వనువులమ్మ తల్లికి భక్తులు సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 200 రకాల మిఠాయిలు, పిండివంటలు, పసుపు-కుంకుమ, చీరలు, గాజులు, పండ్లు, పూలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బండి, రెండెడ్ల బండ్లపై తీసుకొచ్చిన సారెతో పాటు,సంప్రదాయ వస్త్రాలు ధరించిన గ్రామ ఆడపడుచులు,మహిళలు, యువతులు సారెను తీసుకొచ్చారు. ముందుగా కొర్లపాటివారిపాలెంలోని శ్రీ రామాలయం నుండి సన్నాయి మేళం, భజంత్రీల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెలుతూ స్థానిక సత్తెమ్మ తల్లిని దర్శించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా ప్రధాన రహదారిపై ఉన్న శ్రీ విజయ దుర్గ అమ్మవారిని



దర్శించుకుని శ్రీ వనువులమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపుగా వస్తున్న భక్తులతో కలిసి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కాసేపు భక్తులతో కలిసి నడిసారు. భక్తులు తీసుకొచ్చిన వివిధ రకాల మిఠాయిలను అమ్మవారికి సమర్పించిన అనంతరం భక్తులకు, గ్రామస్తులకు పంచిపెట్టారు. స్థానిక యువత ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు శీతల పానీయాలు, ప్రసాదములు,అల్పాహారం అందజేశారు.

# చోరీ సొత్తును రికవరీ చేసిన పోలీసులు



**రౌతులపూడి , జులై 22 , ( ప్రభాతవార్త ) :**
రౌతులపూడిలో ఈనెల 12,13 తేదీల్లో పేంటీ మరియ్యమ్మ ఇంట్లో 30 గ్రాముల బంగారంరూ 30000లుచోరీ జరిగిందని రౌతులపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై జి వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో, ఎస్ డి పి ఓ శ్రీహరి రాజు, సీఐ బి సూర్య అప్పారావు ఆధ్వర్యంలో ఎస్సై, సిబ్బందితో కలిసి నేర స్థలాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాలు, సాంకేతిక ఆధారాలతో రౌతులపూడి కి చెందిన ఇద్దరు చట్టంతో ఘర్షణ పడిన బాలురను మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారు మరిడమ్మ తల్లి గుడి వద్ద అదుపులోకి తీసుకు న్నామని ఎస్సై జి వెంకటేశ్వరావు తెలిపారు.వారి నుండి చోరీ గురికాబడిన సొత్తును సీజ్ చేసామన్నారు. చట్టంతో ఘర్షణ పడిన ఇద్దరు బాలురను జిల్లా పిఓ ముందు హాజరు పరచడం జరుగు తుందన్నారు. ఈ దర్యాప్తులో హెడ్ కానిస్టేబుల్ డి.వి.రమణ, కానిస్టేబుల్స్ నూకరాజు, బోస్, ఉదయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై తనిఖీ



**సీతానగరం, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
సీతానగరం మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను జాతీయ స్థాయి మానిటరింగ్ టీం సభ్యులు గత మూడు రోజులుగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా నల్గొండ, రఘుదేవపురం, సీతానగరం గ్రామ పంచాయతీల్లోని వివిధ పనులను పరిశీలించారు. నల్లచెరువు, గుర్రం చెరువు పనులు, అవెన్యూ ప్లాంటేషన్, డిస్ట్రిబ్యూటరీ ఛానల్ పనులు, హార్టికల్చర్ ప్లాంటేషన్, కాలవ పనులు, గోశాల నిర్మాణం, పుంత రోడ్డు నిర్మాణం వంటివి పరిశీలించారు.ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి, వారి జాబ్ కార్డులను తనిఖీ చేశారు. ఎన్ఎల్ఎంటి సభ్యులు నాగరాజు, ముఖేష్, ఏపీవో సత్యవతి, ఎన్ఆర్ఈజీఎస్, కొవ్వూరు క్లస్టర్ సీవో చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మరియు ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ



**మామిడికుదురు., జులై 22 , ( ప్రభాతవార్త )**
రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు కనపడడంలేదని ఎక్కడ చూసినా అక్రమ కేసులు,వేధింపులు మాత్రమే కనబడుతున్నాయని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్ఆర్ సిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు,మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆరోపించారు.బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాలు మంగళవారం మండలం లోని పాశర్లపూడిలంక,లూటుకుర్రు,ఆదుర్రు,మాకనపాలెం గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ముల రాము, పరిశీలకులు తోరం సూర్య భాస్కర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఆయా గ్రామాల్లో రచ్చబండ నిర్వహించి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో ఏవిధంగా విఫలం అయ్యిందో వివరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు, పార్టీ నాయకులు కుడుపూడి విద్యాసాగర్, మొల్లేటి త్రిమూర్తులు, నెల్లి దుర్గాప్రసాద్, పొలమూరి గోపాల్, అడబాల చక్రపాణి, అన్వర్ తాహెర్ హుస్సేన్,ఆగా బాఖర్ హుస్సేన్,జక్కంపూడి వాసు,మట్టపర్తి శివ,కోట బ్రహ్మానందం,కాంద్రేగుల బాబి,తులా గోపాలకృష్ణ, పిల్లి శ్రీనివాస్,బాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరి పంట ఎరువులు యాజమాన్యంపై అవగాహన..మురారిలో పొలం పిలుస్తోంది

**గండేపలి, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
గండేపల్లి మండలం మురారి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిఆర్సి ఏ డి ఏ బుల్లి బాబు మాట్లాడుతూ మురారి గ్రామంలో వరి పంటలో ఎరువులు యజమాన్యం గురించి వివరించి ఎంఓపి ని ఆకరి దమ్ము లో వేసుకుంటే ఒక 20 రోజులు వరుకు ఎటువంటి పురుగు మందులు వాడనవసరం లేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ శ్రీరామ్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో అర్హత జాబితాలో ఎవరైనా లేకపోతే వారి యొక్క డేటాను గ్రీవెన్స్ రూపంలో తీసుకుని



పరిష్కరిస్తామన్నారు. కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులను తక్షణమే చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో రైతులకు 100 శాతం రాయితీతో వచ్చిన కందులు,మినుము విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ పి చంద్రమౌళి,విఏఏ రేణుకా దేవి రైతులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న వైకాపా నేత మురళిరాజు



**పత్తిపాడు , జులై 22 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని ధర్మవరం గ్రామంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణం రాజు మంగళవారం పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మొరుకుర్తి శ్రీను,గోపి సోదరుల కుటుంబ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని పలువురు అభిమానులు,పార్టీ శ్రేణులు మురళీరాజు ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నానిపల్లి చంటి ,కోలా తాతబాబు, గోనగాని రామకృష్ణ,గుమ్మిడి రామకృష్ణ ,జువ్వల దొరబాబు,పోకనాటి వెంకటేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా దాశరధి శత జయంతి

**కాకినాడ రూరల్, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాద్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ దాశరధి కృష్ణమాచార్యుల శతజయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ 1925 జూలై 22న మహబూబ్ నగర్ లో జన్మించిన దాశరధి నిజాం ప్రభువులను ఎదురిస్తూ పలు రచనలు చేసి జైలు శిక్ష అనుభవించారన్నారు. సాహిత్యంలో అనేక ప్రక్రియలలో కృషి చేశారన్నారు. కథలు, నాటికలు, కవితలు, సినిమా పాటలను ఆయన రాసారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి కళా ప్రపూర్ణ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్



ను ఆయన అందుకున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆస్థాన కవిగా దాశరధి పనిచేశారని శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇరుసుమండ వాసి మృతి



**అంబాజీపేట, జులై 22 , ( ప్రభాతవార్త ) :**
ఆలమూరు మండలం మడికి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబాజీపేట మండలం ఇరుసుమండకు చెందిన వెంపల చంద్రశేఖర్ (50) మృతి చెందాడు. అంబాజీపేటలో ఓ ప్రైవేటు ట్రాన్స్పోర్టులో లారీ డ్రైవర్గా చంద్రశేఖర్ పని చేస్తున్నాడు. మృతునికి భార్య రామలక్ష్మి, కుమారులు పవన్,చందులు ఉన్నారు. విధులలో భాగంగా డ్రైవింగ్కు వెళ్లిన చంద్రశేఖర్ మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.అందరితో కలిసి ఉండే చంద్రశేఖర్ ఇకలేడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. చంద్రశేఖర్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.కాగా మృతుని స్వగ్రామం తాడేపల్లిగూడెం మండలంలోని మిలటరి మాధవరం.అయితే గత 30 ఏళ్ల క్రితమే వివాహం అనంతరం ఇరుసుమండ వచ్చి ఇక్కడే ఉంటున్నారని స్థానికులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో నాగలింగేశ్వరుడు, నందీశ్వరునికి అభిషేకం



**రౌతులపూడి, , జులై 22 , ( ప్రభాతవార్త ) :**
మండలంలోని శృంగవరం, మెరకచామవరం గ్రామాల నడుమ నందనవనములో స్వయంభుగా వెలసిన శ్రీ ఉమా వర్ధిని నాగ లింగేశ్వర స్వామి, నందీశ్వరునికి మాస శివరాత్రి సందర్భంగా ఏకకాలంలో భక్తిశ్రద్ధలతో అభిషేకములు చేశారు. ఆలయ పండితులు వేదమంత్రోచరణలతో గణపతి పూజతో ప్రారంభించి మహన్యాస పూర్వక అభిషేకము, రుద్రాభిషేకము, నందీశ్వర అభిషేకములు చేశారు. అనంతరం హారతి ఇచ్చి ప్రసాదం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మూగజీవుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత పశు వైద్యులదే : ఎమ్మెల్యే గిడ్డి

**అంబాజీపేట, జులై 22 , ( ప్రభాతవార్త ) :**

పశుగణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, మూగజీవుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత పశు వైద్యులదేనని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ అన్నారు. మండలంలోని ముక్కామలలో ఆర్ఐడిఎఫ్ నిధులు రూ. 32 లక్షలతో నూతనంగా నిర్మించిన పశు వైద్యశాలను ఎమ్మెల్యే సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమాభివృద్ధితో పాటు పశువుల సంఖ్య పెంపులో వాటి సంరక్షణకు ఎన్నో నిధులు కేటాయిస్తుందన్నారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో అవకాశం ఉందన్నారు. పశువులకు సోకే సీజన్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి పశు వైద్యశాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అంతకుముందు పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ పూర్ణకుంభంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు ఘన స్వాగతం పలికారు.



అనంతరం ఎమ్మెల్యేను పంచాయతీ పాలకవర్గం, వైద్యశాల సిబ్బంది గజమాలతో ఘనంగా సత్కరించారు. ముక్కామల గ్రామ సర్పంచి బండారు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయరెడ్డి, పశువైద్యురాలు వి.దీపిక ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,ఇన్చార్జ్ ఎంపీడీవో ఎ.ఎస్.ఎల్. నరసింహారావు, జెడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, ఏఎంసి చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్,వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, సర్పంచి జల్లి బాలరాజు, ఎంపిటిసి సభ్యురాలు వనచర్ల గంగాభవాని,ఏఎంసి డైరెక్టర్ గంధం వెంకటేశ్వరరావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,మద్దాల సుబ్బారావు,దాసరి వీర వెంకట సత్యనారాయణ, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి,బండారు మల్లిబాబు, రవణం రాము, కుడిపూడి రాంబాబు,సాకా బాబూజీ,కొప్పినీడి ఈశ్వరరావు, పెదపూడి శ్రీనివాసరావు, ఆకుల సూరిబాబు, కొప్పిశెట్టి పండు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి, జాతీయవాదం కలగలిసిన హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధిస్తుంది

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

దేశభక్తి, జాతీయవాదం కలగలిసిన హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. సోమవారం హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో అంగరంగ వైభవంగా జరుగుతున్న హరిహర వీరమల్లు చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలకు హాజరైన మంత్రి కందుల దుర్గేష్ అద్భుతమైన, ఉద్రూతలూగించే ప్రసంగంతో అభిమానులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హరిహర వీరమల్లు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం, సినీ నటుడు కొణిదెల పవన్ కళ్యాణ్ కు, చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్ కు హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజుకు, కర్ణాటక అటవీ శాఖ మంత్రికి, చిత్ర నిర్మాత ఏఎం రత్నంకు, చిత్ర యూనిట్ కు మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. హరిహర వీరమల్లు టైటిల్ చూసినా, చిత్ర కథాంశాన్ని విన్నా దేశంలోని యువత దేశభక్తి ప్రబోధితంగా జీవితాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న సందేశాన్ని తెలుపుతుందన్నారు. జాతీయ వాదంతో ఈ దేశం కోసం తాము నిలబడతామన్న భావంతో హరి హర వీరమల్లు చిత్రం ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు వస్తుందన్నారు. సినిమాలో నటించిన నటీనటులు, సాంకేతిక వర్గం, కీరవాణి స్వరపరిచిన అద్భుత సంగీతం ప్రేక్షకులను రంజింప చేస్తుందని నమ్ముతున్నాను అన్నారు. యావత్ జాతి ఉద్వేగంగా, ఉత్సాహంగా ముందుకు నడవాలంటే పవన్ కళ్యాణ్ వెనుక నడవాల్సిన అవసరం ఉందని ఘంటపథంగా తెలిపారు . ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అశేష అభిమాన జన సందోహంతో, అద్భుతమైన మాస్ ఫాలోయింగ్ తో అగ్రశ్రేణి కథానాయకుడిగా ఒక పక్కన, మరో పక్కన పేదవాడి కంట కన్నీరు తుడవడమే లక్ష్యంగా రాజకీయరంగంలోకి వచ్చి రాజకీయ రంగంలో సైతం పేదవాడికి అధికారం తీసుకురావడానికి నిరంతరం, నిర్విరామ కృషి చేస్తున్న నాయకులు పవన్ కళ్యాణ్ అని అన్నారు. అందరి అభిమాన నాయకుడిగా, ఉప ముఖ్యమంత్రిగా ఉంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల అభివృద్ధి విషయంలో నిరంతర నిర్విరామ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. సినిమా రంగానికి, రాజకీయ రంగానికి సంబంధించి ఏ మాటలు చెబుతారో ఆ మాటలు తూచా తప్పకుండా పాటించి ఆచరణలో



పెట్టే ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. సినిమా రంగంలో ఏ రకమైన పాత్రలు పోషిస్తారో ఆ పాత్రల తాలూకు ఆదర్శాన్ని ప్రజా నాయకుడిగా కార్య క్షేత్రంలో అమలు చేస్తున్నారన్నారు. నేడు ప్రతి ఒక్కరికి పవన్ కళ్యాణ్ వంటి నాయకులు మార్గదర్శకుడిగా నిలబడ్డారన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ చొరవతో జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి తాను మంత్రిని అయ్యానని తెలిపారు. ఒక పక్కన రాజకీయాల్లో ఉన్న పవన్ కళ్యాణ్ మరో పక్కన ఆయనకు సంబంధించిన సినిమాటోగ్రఫీకి తాను మంత్రిగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు, హీరో పవన్ కళ్యాణ్ ఏం చెప్తే అది వేదంగా పాటించే అభిమానులు దొరకడం ఆయన అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు, నిర్మాత ఏఎం రత్నం కు, చిత్ర యూనిట్ కు, పవన్ కళ్యాణ్ అభిమానులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు. హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధించి రికార్డులు కొల్లగొట్టాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు.

# పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు - కళ్లజోడులు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు : డి ఎమ్ హెచ్ వో కే వెంకటేశ్వరరావు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, జిల్లా కలెక్టర్ డా. పి. ప్రశాంతి ఆదేశాల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కంటి పరీక్ష కార్యక్రమం బొమ్మూరులో మంగళవారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా కె వెంకటేశ్వర రావు తెలియ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ -జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబర్ నెలల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మరియు ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 6 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు ఉన్న విద్యార్థు లకు ఉచిత కంటి పరీక్షలు , అవసరమైన వారికి కళ్లజోడుల పంపిణీ , శస్త్రచికిత్సలు (అవసరమైన వారికి) చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే విద్యా ర్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, పిల్లల దృష్టి సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందేలా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా. బి. శ్రీనివాస్, ఆర్.పి.ఎస్.కే ప్రోగ్రాం ఆఫీసర్ డా. హరిచంద్ర ప్రసాద్, జిల్లా ఎపిడి మాలజిస్ట్ డా. సుధీర్, బి. రాజు, పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, ఆప్టోమెట్రిస్ట్ నల్లూరి జాన్ మిల్టన్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మిథున్ రెడ్డిని కలిసిన వైసీపీ లీగల్ టీమ్

**రాజమండ్రి , జులై 22 , ( ప్రభాతవార్త )**

రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎం పీ మిథున్ రెడ్డితో వైసీపీ లీగల్ టీమ్ మంగళవారం భేటీ అయ్యింది. జైలు లోపల సౌకర్యాల గురించి మిథున్ ను లీగల్ కోఆర్డినేటర్ సాధిక్ హుస్సేన్ అడిగి తెలుసుకున్నారు. Y కేటగిరీ సెక్యూరిటీ ఉన్న ఎంపీకి కల్పించే సౌకర్యాలన్నీ మిథున్ కు అందించాలని కోర్టు ఆదేశించి 24 గంటలు గడుస్తున్నా ఇప్పటివరకు మిథున్ రెడ్డికి ఏలాంటి సౌకర్యాలు కల్పించలేదని సాధిక్ ఆరోపించారు.

# బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలుగా టి.ఉషారాణి నియామకం

**ప్రత్తిపాడు , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

మండలంలో ఒమ్మంగి గ్రామానికి చెందిన తేజోమూర్తుల ఉషారాణి పార్టీకి చేసిన సేవలను గుర్తించి బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆమెకు కాకినాడ జిల్లా ఉపాధ్యక్షురాలుగా నియమించినట్లు సింగిల్దేవి సత్తిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు పార్టీ కార్యాలయం లో ఉషారాణి ని పార్టీ శ్రేణులు ఘనంగా అభినందించారు. ఉషారాణి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలతోపాటు ,గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని,కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానని,జిల్లా కార్యవర్గంలో ఎస్సీ



మహిళ కి ప్రాధాన్యం ఇవ్వడం చాలా ఆనందం గా ఉందని తెలిపారు.జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ,రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పి వి యన్ మాధవ్ , నాయకులు సింగిలీదేవి సత్తిరాజు ,కంద వీరాస్వామి,కొల్లా శ్రీను ,బాలు దొర తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో , కంద వీరాస్వామి, ఇంటి బాబురావు, మదినే బాబ్జి,చింతకుల రామ కృష్ణ,నక్క శ్రీనివాస్, అడపా కృష్ణ,టి .సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి'వెంకన్న'ను దర్శించుకున్న జిఆర్ఎమ్బి మెంబర్ సెక్రెటరీ ఆర్.కె కనోడియా

**- స్వామివారి ఒక్కరోజు రూ 3,69, లక్షలు**

**- వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి విరాళాలు**



**ఆత్రేయపురం , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామివారిని జి ఆర్ ఎమ్ బి మెంబర్ సెక్రెటరీ ఆర్.కె కనోడియా, జి డి ఎస్ గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ కే శేషుబాబులు మంగళవారం దర్శించుకున్నారు.వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రధరరావు, వై శ్రీను, సిబ్బంది స్వాగతం పలికి శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట సి. ఈ .శేషుబాబు, ఎస్.ఈ. గోపీనాథ్, ఈఈ వేణుగోపాల్, జేఈఈ సాయి మాధవ్ ప్రసన్న ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు అలాగే లొల్ల లాకులను లాకుల పరిసరా లను ఆయన పరిశీలించారు. లొల్ల లాకుల పరిస్థితు లను సిబ్బందిని వివరాలు అడిగి తెలుసు కున్నారు.ఉదయం మేలుకొలుపు ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ అనంతరం స్వామివారి దర్శించుకొని అన్నప్రసాదాలను స్వీకరించారు. వివిధ సేవలద్వారా స్వామివారికి రూ, 3,69,146లు ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం అధికారులు తెలియజేసారు. అలాగే ఆలయ సన్నిధిలో నూతనం గా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి రావులపాలెం మండలం, కొమరాజులంకకి చెందిన కర్రీ వెంకటరెడ్డి , ఆదిలక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 25,116 వేలు. మరియు రాజోలు మండలం,పోదలాడకి చెందిన పల్లపోతు నాగేశ్వర రావు , కళావతి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ. 25,016 లు విరాళంగా అందిం చారు. వీరికి ఆలయ అర్చకు లు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిసి. కార్యనిర్వా హణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, వర్మ, కుమా ర్లు స్వామివారిచిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

# రెవెన్యూ సదస్సులలో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : ఎమ్మెల్యే బత్తుల

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

పి.జి.ఆర్.ఎస్, రెవిన్యూ సదస్సుల లో వచ్చిన రెవెన్యూ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని మంగళవారం తన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రాజనగరం శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు.ఈ సందర్భంగా రీ-సర్వే సమస్యలన ఆయన సమీక్షించారు. సీలింగ్ భూముల వ్యవహారం, 22 ఏ నిషిద్ధ భూముల



సమస్య, సర్వీస్ ఈనాం భూములు, లేఅవుట్ కన్వర్షన్ తదితర అంశాలను సమీక్షిస్తూ పెండింగ్ లేకుండా సత్వరం పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ లు, మండల సర్వేయర్ లు, సివిల్ సప్లైస్ డి.టి.లు పాల్గొన్నారు.



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

# ఆర్మీ ర్యాలీకి శ్రీ అగస్త్య రూ.లక్ష విరాళం

జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి కాకినాడ హాకీ టోర్నమెంట్కు తన వంతు రూ.లక్ష విరాళాన్ని శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున అందజేశారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ షణ్మోహన్కు సొసైటీ డైరెక్టర్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) ఈ విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా డిఎన్ఆర్ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం డైరెక్టర్ డిఎన్ఆర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ సొసైటీ తరపున సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. తమ కళాశాల ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఎంపిసిలో జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించడమే కాక, ఐఐటి, నీట్ విభాగాల్లో అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిష్టాత్మక యూనివర్శిటీల్లో సీట్లు సాధించినట్లు తెలిపారు.

# ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌కు సన్మానం

**సామర్లకోట , జులై 22 , ( ప్రభాతవార్త )**

వాహనాల గ్రీన్ టాక్స్ తగ్గించినందుకుగాను లారీ యూనియన్ నేతలు పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామ స్వాములను మంగళవారం సామర్లకోట లారీ యూనియన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం



చేశారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసి యేషన్ నాయకులు సిబ్బంది లారీ యజమానులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సీ) పి. ప్రశాంతి సూచించారు. మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి నగర పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై డివిజన్ల వారీగా వివరాలను సమీక్షించారు. వివిధ దశలలో ఉన్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ,నేల గట్టిదనాన్ని బట్టి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. స్లమ్ ప్రాంతాల్లో పూర్తిగా సీసీ రహదారులే ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించిన టీడీఆర్ బాండ్లను దుర్వినియోగించే పరిస్థితి తలెత్తకూడదనీ స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 17, 18, 19వ డివిజన్లలో మేజర్ డ్రెయిన్ నిర్మాణానికి క్షేత్ర స్థాయిలో పరిశీలించి , అందుకు అనుగుణంగా అంచనాలు సిద్ధం చేయాలన్నారు. పుష్కర పనులలో భాగంగా చేపట్టిన రహదారులు వెడల్పు చేసే పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. నగరంలో నూతనంగా అభివృద్ధి చేసిన పార్కులను స్థానిక సొసైటీలు, అపార్ట్మెంట్ అసోసియేషన్లకు అప్పగించడం ద్వారా వాటి నిర్వహణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సూపరింటెండింగ్ ఇంజినీర్ కోటేశ్వరరావు, ఈఈలు మాధవి, రీటా, మదర్సా అలీ తదితరులు పాల్గొన్నారు.

# పాడి పశువుల సంతతి మెరుగుదలకు చర్యలు చేపడుతున్నాం : కలెక్టర్ మహేష్ కుమార్

**కోనసీమ బ్యూరో , జులై 22 , ( ప్రభాతవార్త ) :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి, పాడి పశువుల సంతతి మెరుగు దలకు చర్యలు చేపడు తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడిం చారు. మంగళవారం స్థాని కలెక్టరేట్ నందు జిల్లా పశు సంవర్ధక శాఖ, పశు వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి పశువుల సంఖ్యను పెంచడానికి గల సాధ్య సాద్యాలపై పశువైద్యా ధికారులతో అనుభవ పూర్వకమైన సూచనలను కోరుతూ ఆచరణ గల అవకాశాలపై సంప్రదింపు లు జరిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పెంపకంపై ముందుగా దృష్టి సారిస్తూ స్థానికంగా ఉన్న పశువుల పోష కాహార స్థితులను మె రుగుపరుస్తూ పాల దిగుబ డిని పెంచాలని సూచించా రు. అందుకు అవసరమైన పశు దాన పైలట్ ప్రాజెక్టు లను రావులపాలెం, రామ చంద్రపురంలో ఏర్పాటుకు డ్వాక్రా సంఘాల సమన్వ యంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పశువుల దానా యూనిట్ ప్రస్తుతం నడుస్తున్న కృష్ణాజిల్లా వీర వల్లి గ్రామానికి పశు వైద్యా ధికారుల బృందం వెళ్లి సందర్శించి యూనిట్ స్థాపనకై డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించాలని ఆదేశించారు. బేసిక్ మిష నరీ ముడి సరుకు లభ్యత, ముడిసరుకు రవాణా రైతులకు తక్కువ ధరకే అందుబాటు, జిల్లాలో ఉన్న పశువుల సంఖ్య,విక్రయా లు డిమాండ్ సప్లై లపై అధ్యయనం చేస్తూ యూ ని ట్ నెలకొల్పడానికి ముడి సరుకు జొన్నలు వేరు శనగ నువ్వుల కేకులు సప్ల మెంట్స్ వరి ఉత్పత్తులు వంటి అంశాలతో కూడిన నివేదికను కూడా రూపొం దించాలన్నారు. పాడి రైతులతో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించి పశుదాన ఉత్పత్తుల



తయారీ ధరలు సరఫరా వంటి అంశాలను వివరించాలన్నారు. పశు వైద్యాధికారులు సలహాలు ఇస్తూ పుట్టిన లేగ దూడ వయస్సు 18 నెలలు వచ్చిన సందర్భంలోనే ఎదకు వచ్చి పాడి పరిశ్రమకు ఎంతో ఉపయుక్తంగా ఉండే సునందిని కార్యక్రమం విధానాన్ని మరల పునరుద్ధ రిస్తే బాగుంటుందని, పశువుల దాన, మల్టీ విటమిన్,అజోలా గడ్డి, కాల్షియం, మినరల్స్, తదితర పశువుల పోషక వస్తువులను రేషన్ షాపులు మాదిరిగా రాయితీపై రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తే పాడి పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని, మేలు జాతి పాడి పశువులు కొనుగోలుకు రాయితీలతో బ్యాంకు రుణాలను అందిస్తే పరిశ్రమ అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని వారు తెలిపా రు. నూతనంగా ప్రతిపా దించిన దాన యూనిట్ మూలంగా కూడా పాల దిగుబడిని పెంచేందుకు అవకాశాలు ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, సహాయ సంచాలకులు ఉమా మహేశ్వర్ రెడ్డి పశు వైద్యాధికారులు పాల్గొ న్నారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# అందానికి గులాబీ..



**రంగురంగుల గులాబీలను చూస్తే మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుంది. అయితే సౌందర్య పరిరక్షణలోనూ గులాబీల పాత్ర ఎంతో ఉందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందామా?**

**నల్లటి వలయాలు దూరం...** కళ్ల కింద వలయాల సమస్యకు చెక్ పెట్టడానికి గులాబీలను ఉపయోగించవచ్చు. కొద్దిగా రోజ్‌వాటర్‌ని తీసుకొని అందులో కాటన్‌ను ముంచి కళ్లకింద మృదువుగా మర్దన చేయాలి. ఇలా కనీసం రెండు రోజులకోసారి చేస్తే ఫలితం ఉంటుంది. గులాబీ రేకల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటను తగ్గిస్తాయి.

**క్లెన్సర్‌గానూ :..** గులాబీ మంచి క్లెన్సర్‌గా కూడా పని చేస్తుంది. రోజ్‌వాటర్ మన ముఖంపై ఉన్న జిడ్డుని, పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా మార్చుతుంది. అంతేకాదు.. గులాబీ రేకల్లోని సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయి. అందుకే స్నానం చేసే నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా కొన్ని గులాబీ రేకలను వేసుకుంటే చర్మం మెరుపును సంతరించుకుంటుంది.

**విటమిన్ 'సి' పుష్కలం...** గులాబీల్లో విటమిన్ 'సి' శాతం ఎక్కువ. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేసి అతినీల లోహిత కిరణాల నుంచి రక్షణ కల్పిస్తుంది. అందుకే ఎండలోకి వెళ్లేముందు రోజ్‌వాటర్ అప్లై చేసుకొని వెళ్లడం మంచి దంటున్నారు నిపుణులు. అంతేకాదు. గులాబీ ట్యాన్‌ని కూడా తొలగిస్తుంది. దీనికోసం కీరా దోస, గులాబీ, గ్లిజరిన్‌లు కలిపిన ప్యాక్‌ని వేసుకుంటే ఫలితం ఉంటుంది.

**జుట్టు ఆరోగ్యానికి ...** గులాబీల్లో ఉండే సహజ సిద్ధమైన కండిషనింగ్ గుణాలు జుట్టును పట్టుకుచ్చులా మెరిసేలా చేస్తాయి. దీనికోసం మీరు వాడే షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్క రోజ్ వాటర్ కలుపుకొంటే సరి లేదా గులాబీ రేకల పేస్ట్‌ను జుట్టుకు, కుదుళ్లకు పట్టించి కాసేపయ్యాక తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది.



**జనాభా వరమా? శాపమా? జన భారత్ ఇకపైన ఎలా అడుగులు వేయాలి. దీన్నో మహిళల పాత్ర ఏంటి.. లాంటి సందేహాలెన్నో! వీటిపైన 'పాప్యులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా ఏం చెబుతున్నారో తెలుసుకుందాం.**

# జనాభా వృద్ధి స్థిరంగా ఉండాలంటే..



భారత్‌లో ప్రస్తుతం సంతాన సాఫల్య రేటు (టిఎఫ్‌ఆర్) రెండుగా ఉంది. అంటే సగటున ప్రతి మహిళా ఇద్దరు బిడ్డలకు జన్మనిస్తోంది జనాభా వృద్ధి స్థిరంగా ఉండాలంటే అది 2.1గా ఉండాలి. కానీ ఇలా తగ్గడం ఒకసారి మొదలైతే, క్రమంగా అది తగ్గుతూ పోతుంది.
ఆ మార్పు ఇప్పుడు చూస్తున్నాం. అధిక జనాభాతో సవాళ్లూ ఉన్నాయి. తగు రీతిలో వనరులు అవకాశాల్ని అందించకపోతే సామాజిక, ఆర్థిక సమస్యలు పెరుగుతాయి. విద్య, ఉపాధి దక్కకుంటే యువత పక్కదారి పడుతుంది. అందుకే అధిక సంఖ్యలో స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు తీసుకురావాలి. నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. ఉపాధి అవకాశాలు పెరగాలి. ముఖ్యంగా మహిళలకు విద్య, పోషకాహారం, వైద్యం, ఆదాయ వనరుల్ని అందించాలి. జనాభా గురించి ఆందోళన చెందకుండా. ప్రతి భారతీయుడూ ఒక ఆస్తి అనుకొని ప్రణాళికలు రచించాలి.

**ఆ స్వేచ్ఛ ఇవ్వండి...** కొన్నిచోట్ల పిల్లలు కనడంపైన ఆంక్షలు పెడితే, ఇంకొన్నిచోట్ల ప్రోత్సాహకాలు చేస్తున్నారు. వీటి ప్రభావం ప్రత్యక్షంగా పడేది మహిళలపైనే. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులని గతంలో కొన్ని రాష్ట్రాలు ప్రకటించాయి. వీటి కోసం కొందరు కాగితం మీద విడాకులు తీసుకున్నారు. దీంతో వివాహ బంధం అనిశ్చితిలోకి వెళ్తుంది. కొందరు పిల్లల్ని దత్తత ఇచ్చారు. అప్పుడూ బాధపడేది తల్లే కాబట్టి పిల్లల్ని ఎప్పుడు కనాలి, ఎంతమందిని కనాలనే నిర్ణయం మహిళలు తాముగా తీసుకునే స్వేచ్ఛ రావాలి. పిల్లల్ని కనాలని చెప్పడం. వద్దనడం.. మహిళల్ని అగౌరవ పరచడమే. పిల్లల్ని కనడమనేది స్విచ్ కాదు ఆన్ ఆఫ్ చేయడానికి కెరియర్, ఆర్థిక, సామాజిక కోణాల్లో ఆలోచించి పిల్లల విషయంలో మహిళలే నిర్ణయానికి వస్తారు.

**భారం మహిళలదేనా? ••**
1970 నాటికి దేశంలో 30 శాతం వాసెక్టమీ ఆపరేషన్లు జరిగేవి. ఇప్పుడవి 0.3 శాతానికి తగ్గాయి. వాసెక్టమీ పదినిమిషాల్లో ముగుస్తుంది. కావాలనుకుంటే వెనక్కి మరల్చవచ్చు. ట్యూబెక్టమీలో కోత, కుట్లు ఉంటాయి. దురదృష్టవశాత్తూ పుట్టిన వాళ్లు చనిపోతే ట్యూబెక్టమీలో వెనక్కి వెళ్లి పిల్లల్ని కనే పరిస్థితి ఉండదు. అప్పుడు మగవాళ్ళు వేరే పెళ్లి చేసుకునేందుకు ఆస్కారం ఉంది. మరోపక్క ఏటా భారత్‌లో 1.6కోట్ల అబార్షన్లు జరుగుతున్నాయి. లెక్కకి అందనివి ఇంకెన్నో. వీటిలో సగం జవాంచిత గర్భధారణలు కాగా, మగ పిల్లలు కావాలనుకోవడం మరో కారణం.



రెండో త్రైమాసికంలోకి వెళ్తే అబార్షన్లతో ప్రాణహాని ఉంటుంది. అంతేనా... గర్భనిరోధకాలు వాడటం మగవాళ్లకు సంబంధంలేనిదిగా కేవలం పనే అన్నట్టుగా ఉంది. వీటన్నింటివల్ల మహిళల ఆరోగ్యమూ దెబ్బతింటుంది. జేజరే టాటా చెప్పినట్టు "మగ వాళ్లు మారినప్పుడే దేశం మారుతుంది. వాళ్లలో ఎలాంటి మార్పు రావాలంటారా... పిల్లల పెంపకంలో బాధ్యతలు తీసుకోవాలి. ఇంటిపనుల్లో మహిళలకు భాగమవ్వాలి. కుటుంబ నిర్ణయాల్లో మాటకు విలువ ఇవ్వాలి. అప్పుడే జనాభా పెరిగినా, తగ్గినా సమస్యలు తగ్గుతాయి. జనాభా లెక్కల్లో మహిళలకు సంబంధించిన డేటా తక్కువగా వెలుగులోకి వస్తోంది. ౖ2027 జనాభా లెక్కలతోనైనా దీన్లో మార్పు రావాలి. జనాభా లెక్కింపు సమయంలో ఇంటి వివరాలు మగవాళ్లే చెబుతారు. అలా కాకుండా మహిళల్ని అడగాలి. మహిళలు, బాలికలకు సంబంధించి సరైన సమాచారం లేకుంటే పథకాల రూపకల్పనలో పొరపాట్లు జరుగుతాయి. అది ఎన్నటికీ పూడ్చలేని లోటుగా మిగిలిపోతుంది. 2050 నాటికి జనాభాలో 20 శాతం(34కోట్లు) వృద్ధులు ఉంటారని అంచనా. మహిళల ఆయుష్షు ఎక్కువ కాబట్టి వీరి కోణంలోనూ ప్రణాళికలు రచించాలి. కొత్త విషయాలను. నైపుణ్యాల్ని నేర్చుకునేలా అలవాటు చేయాలి. దాని వృద్ధాప్యంలోనూ పనిచేసే సామర్థం వస్తుంది. □

# ఆధారం ఇస్తేనే ఆరోగ్యంగా..



ఎండా, వానా, చలీ.. వంటివాటి నుంచి మనం రక్షణ ఏర్పాటు చేసుకున్నట్లే మొక్కల విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే అవి ఆరోగ్యంగా ఉంటాయి.

- వర్షం, బలమైన గాలుల వల్ల పొడవుగా ఉన్నవీ, కాయలూ, పండ్లతో ఉన్న మొక్కలు రకాలూ ఇట్టే విరిగిపోతుంటాయి. అలాకాకుండా ఉండాలంటే మొక్కలను గ్రిల్‌కో, పెద్ద చెట్టుకో తాడుతో కట్టేయాలి.
- వర్షాకాలంలో కుండీల్లో అదనపు నీరు నిలిచి మొక్కలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వీలైతే వాటిని రూఫ్ కిందకో, పెద్ద చెట్టు నీడకో తెచ్చి పెట్టడం మేలు. ఆ అవకాశం లేకపోతే మొదలు చుట్టూ ప్లాస్టిక్ షీట్ కప్పేయండి.
- తరచూ వర్షాల్లో తడవడంవల్ల ఆకులూ, పూలూ వాడిపోవడం, కుళ్లిపోవడం జరగొచ్చు. అలాంటివాటిని ఎప్పటికప్పుడు తీసేయాలి. లేదంటే ఈ సమస్య మిగిలిన భాగాలకూ వ్యాపించొచ్చు. ఇలాంటప్పుడు బేకింగ్ సోడా, కార్న్‌పౌడర్, దాల్చినచెక్క పొడి వంటివి చల్లుకుంటే సరి. తెగుళ్లను నియంత్రించొచ్చు. □

**చెలి చిట్కా** వాష్‌బేసిన్ రంధ్రాల్లో వాసనరాకుండా ఉండటానికి బేకింగ్‌సెఓడావేసి వేడినీరు పోయండి.


- పూరీపిండి 2 స్పూన్‌ల బొంబాయిరవ్వ మరో 2 స్పూన్లు మైదా కలిపితే పూరీలు చాలా రుచిగా ఉంటాయి. □

# స్నేహితురాలు ఉండాల్పిదే..

మనం పనిలో బిజీగా ఉన్నా, కుటుంబ బాధ్యతల్లో పడిపోయినా కొంతమంది అమ్మాయిలు మొదట త్యాగం చేసేది స్నేహితులనే కానీ, మనల్ని మలుచుకోవాలన్నా, భావోద్వేగాలను పంచుకోవాలన్న స్నేహానికి మించిన బంధం ఏముంటుంది చెప్పండి. నిజానికి అమ్మాయిల మధ్య ఉండే స్నేహం ఒకింత ప్రత్యేకమైంది. ఎందుకంటే, మనసువిప్పి మాట్లాడుకోవడానికి ప్రతి ఒక్కరికీ ఓ స్నేహితురాలు ఉండాల్సిందే. యూసిఎల్‌ఎ పరిశోధన ప్రకారం, మహిళలకు ఒత్తిడి కలిగినప్పుడు.. దాన్ని ఎదుర్కోవడంలో భాగంగా మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. వాటిలో ఆక్సిటోసిన్, ఈస్ట్రోజన్ కొన్ని. అవే మనం పిల్లలతో ఆడుకునేలా, ఇతర మహిళలతో స్నేహం చేయడానికి కారణమవుతాయట. దాంతో ఒత్తిడి దూరమై ప్రశాంతంగా ఉండగలుగుతాం. అయితే, ఈ కామింగ్ ఎఫెక్ట్ మగవారిలో ఉండదట. ఎందుకంటే వాళ్లు ఒత్తిడికి గురైనప్పుడు టెస్టోస్టిరాన్ హార్మోన్ ఎక్కువగా ఉత్పత్తయ్యి, ఆక్సిటోసిన్ ప్రభావాన్ని తగ్గిస్తుందట. కాబట్టి, ఒత్తిడి ఎదురైనప్పుడు అబ్బాయిలూ, అమ్మాయిలూ వేరుగా స్పందిస్తారట. అంతేకాదు, స్నేహితులతో ఎక్కువ సమయం గడిపే మహిళల్లో వయసు పైబడ్డాక వేధించే శారీరక బలహీనతలు వచ్చే అవకాశం తగ్గుతుందని హార్వర్డ్ మెడికల్ స్కూల్ పరిశోధనలో తేలింది. అంతేనా, మన భావాలు పంచుకునే స్నేహితులు లేకుంటే, ఒత్తిడి గూడుకట్టుకుపోయి బరువు పెరిగే అవకాశాలు ఉన్నాయట. ఇక, సుమారుతొమ్మిదేళ్లపాటు స్నేహితులతో నాణ్యమైన సమయం గడిపిన వారిలో మరణించే ప్రమాదం 60శాతానికి పైగా తగ్గిపోతుదనీ పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నిబట్టి దీర్ఘాయుష్షును అందించే జీవనమంత్రం స్నేహమే అని అర్థమవుతుంది. □



# ఓట్స్‌తో మెరిసే చర్మం



**మీది జిడ్డు చర్మమా? మొటిమలూ, మచ్చలూ ఇబ్బంది పెడుతున్నాయా?** అయితే, కీరదోస, ఓట్స్ ఫేస్‌మాస్క్‌ను ప్రయత్నించండి. ముందుగాతొక్క తీసిన కీరదోస ముక్కలను మిక్సీలో వేసి మెత్తని ముద్దగా చేసుకోండి. దానికి రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్‌ను కలిపి మరోసారి మిక్సీ పట్టండి. ఆ మిశ్రమానికి ఓ టీస్పూన్ తేనె వేసి కలిపి.. శుభ్రపరచుకున్న ముఖానికి రాయాలి. అరగంట అయ్యాక, గోరువెచ్చని నీటితో ముఖం కడిగేసుకుంటే సరి. కీరదోస చర్మాన్ని చల్లబరిచి వాపును తగ్గిస్తుంది. మచ్చలు మానేలానూ చేస్తుంది. ఓట్స్‌లో అధికంగా ఉండే జింక్.. ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, మొటిమలు పెరగకుండా చేస్తుంది. కాబట్టి, తరచూఈమాస్క్‌ను వేసుకుంటే మెరిసే చర్మం మీ సొంతమవుతుంది. □

# క్యాలీఫ్లవర్ పకోడీ

**కావలసిన పదార్థాలు :** చిన్నగా తుంచిన క్యాలీఫ్లవర్ పూలు–రెండు కప్పులు, శనగపిండి–కప్పు, ఉప్పు, పసుపు–పావు చెంచా చొప్పున, అల్లం వెల్లుల్లి ముద్ద–అరచెంచా, కొత్తిమీర తరుగు చారెడు, కచ్చాపచ్చాగా నూరిన పచ్చిమర్చి–చెంచా, నూనె–వేయించేందుకు సరిపడా.

**తయారీ :** ఒక పాత్రలో శనగపిండి, ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, నూరిన పచ్చిమర్చి, కొత్తిమీర తరుగు వేసి కొద్దికొద్దిగా నీళ్ల పోస్తూ కొంచెం గట్టిగా కలుపుకోవాలి. చిన్నగా తుంచిన కాలీఫ్లవర్ పూలను పిండిలో ముంచి తీసి కాగిన నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. కమ్మటి క్యాలీఫ్లవర్ పకోడీ చిన్నా పెద్దా అందరికీ నచ్చుతాయి. □



# పనులు పూర్తవడం లేదా?



మల్టీ టాస్కింగ్ చేయడంలో మహిళలు సమర్థులంటారు! కానీ ఆ అలవాటు అన్ని సమయాల్లోనూ మంచిది కాదు. ముఖ్యంగా పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు దీని జోలికి పోవద్దు అంటారు. కెరియర్ నిపుణులు. దేనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలో గుర్తించగలిగితే దానిమీదే శ్రద్ధపెట్టి త్వరగా పూర్తి చేయొచ్చు. ఇలా పనులన్నింటికీ ఓజాబితా రాసుకుంటే.. మనలో ఆందోళన తగ్గించడానికి ఈ స్పష్టత చాలు. పని పూర్తి చేయాలనే తొందరలో విరామం తీసుకోకుండా పనిచేస్తుంటారు కొందరు. దీనివల్ల అనుకున్న లక్ష్యం చేరకపోగా మరింత ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటప్పుడు పనిని కాసేపైనా వాయిదా వేయడం మంచిదే. ఆ సమయంలో ఓ మంచి కాఫీ తాగండి. నచ్చిన మరో అంశంపై దృష్టిపెట్టండి లేదా ఓ చిన్న కునుకు తీయండి. ఇవన్నీ మీ కంగారుని తగ్గిస్తాయి. తిరిగి ఉత్సాహంగా పనులు మొదలు పెట్టే శక్తినిస్తాయి. ఒక్కోసారి ఒత్తిడితో కూడుకున్న పనులు రెండుమూడురోజులు కూడా కొనసాగొచ్చు. అలాంటప్పుడు రోజుకి కనీసం గంటైనా ఏదైనా వ్యాయామం చేయండి. అది ఆందోళనని ఎదుర్కొనే శక్తినిస్తుంది. మెదడుని చురుగ్గా మార్చగలిగే బాదం, వాల్‌నట్స్ వంటివి తినండి. మనసుని ప్రశాంతంగా ఉంచే కొన్ని గుమ్మడి గింజల్ని నోట్లో వేసుకోండి. ఇవన్నీ ఒత్తిడిని తట్టుకుంటూ పనిచేయగలిగేఏకాగ్రతనీ పెంచుతాయి. □

మరో పక్క ఇంట్లో పనులూ ఓ పట్టాన తెమలవు. దీంతో తెలియని ఆందోళన.. దేనిపైనా దృష్టిపెట్టలేకుండా చేస్తుంది. అలాకాకూడదంటే..

ఉద్యోగాల్లో కొన్ని సందర్భాలు డెడ్‌లైన్‌తో ఉంటాయి.

# చెరపకురా చెడేవు



ఒక వేటగాడు తన విల్లంబులు, కుక్కలను వెంటబెట్టుకొని అడవికి బయలు దేరాడు. దారిలో అతడికి ఒక బౌద్ధభిక్షువు ఎదురయ్యాడు. "ఈ దరిద్రుడు తారస పడ్డాడు. ఇక నాకు ఈరోజు వేట దొరుకుతుందా" అని మూఢనమ్మకాలను నమ్మే ఆ వేటగాడు అనుకొన్నాడు. ఆరోజు అతడికి నిజంగానే నిరాశ ఎదురైంది. ఎలాంటి జంతువు, పక్షి అతడికి చిక్కలేదు. ఉసూరుమంటూ తిరుగు పయనమయ్యాడు. దారిలో మళ్లీ అతడికి ఆ భిక్షువు కనిపించాడు. కోపంతో ఊగిపోతూ వేటగాడు తన కుక్కలను ఆ భిక్షువు మీదకి ఉసిగొలిపాడు. అవి వెంటపడుతుంటే భిక్షువు భయపడి దగ్గరలో ఉన్న చెట్టు ఎక్కాడు. అక్కడికి చేరిన వేటగాడు అతణ్ణి రాళ్లతో కొట్టడం మొదలుపెట్టాడు. భిక్షువు మరింత పైకి ఎక్కే అతడు కప్పుకున్న వస్త్రం జారి ఆ వేటగాడిపై పడింది. ఆ వేటగాడినే భిక్షువని భ్రమపడిన కుక్కలు అతడి కండలు చీల్చి చంపేశాయి. వేటగాడి మరణానికి భిక్షువు చాలా బాధపడ్డాడు. ఆ తర్వాత బుద్ధుడికి తెలియజెప్పి కన్నీరుపెట్టుకున్నాడు. "ఇందులో నీ తప్పేమీ లేదు. పరులకు ఎలాంటి హానీ తలపెట్టని నీలాంటి వాడిపైకి కుక్కలను వదిలి ఆ వేటగాడు తన అంతం తానే కొనితెచ్చు కొన్నాడు" అని ఊరడించాడు. అనంతరం బుద్ధుడు ఇలా చెప్పాడు. "మనసులో ఎలాంటి కల్మషం లేకుండా పదిమంది మంచి కోరుతూ సన్మార్గంలో పయనించేవాడికి ఎవరైనా అపకారం తలపెడితే, అది తిరిగి వారికే తగులుతుంది. గాలికి ఎదురుగా నిలిచి మట్టిని విరజిమ్మితే ధూళి వారి కంట్లోనే పడుతుంది కదా!" మన పెద్దలు దీన్నే 'చెరపకురా చెడేవు' అని మరొక విధంగా చెబుతారు! □

ఆధ్యాత్మికం

# పోషకాల 'పుట్ట'



సాధారణంగా వర్షాకాలంలో మష్రూమ్స్ ఎక్కువగా దొరుకుతాయి. ఇవి రుచిలోనూ, పోషకాల్లోనూ నాన్‌వెజ్‌కిపోటీనివ్వ గలుగుతాయి. అందుకే, వీటికి సూపర్‌ఫుడ్ అనే పేరూ ఉంది. అయితే, ప్రపంచ వ్యాప్తంగా పుట్ట గొడుగుల్లో రెండు వేల రకాలు ఉంటే, మన దేశంలో 283 జాతులున్నాయి. వాటిల్లో వైట్ బటన్ మష్రూమ్, ఆయిస్టర్ మష్రూమ్, చైనీస్ మష్రూమ్, మిల్క్ మష్రూమ్ వంటివాటినే మనం ఎక్కువగా పెంచుతాం. తింటుంటాం. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటో కెమికల్స్..యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్‌గా పనిచేస్తాయి. ఇందులోని పోషకాలు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముకల్ని దృఢంగా మార్చే డి విటమిన్, ఆహారాన్ని శక్తిగా మార్చి శరీరానికి అందించే బి12 వంటి కీలకమైన పోషకాల్నీ అందిస్తాయి. కండరాల పనితీరుని, వ్యాధినిరోధకశక్తినీ పెంపొందించే ప్రొటీన్ కూడా పుట్ట గొడుగుల నుంచి తగినంతగా అందుతుంది. □

**ఒక్కో సారి** మనసు దిగులుగా ఉంటుంది. భావోద్వేగాలూ పెల్లుబుకుతూ ఉంటాయి. కానీ, ఇలా తరచూ జరుగుతూ ఉంటే మాత్రం మీ డైట్‌లో కొన్నిరోజులు మష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి కొన్ని రోజులు మష్రూమ్‌ని చేర్చుకుని చూడండి. ఇందులోని పొటాషియం ఆ భావనని పోగొట్టి మిమ్మల్ని చురుగ్గా మారుస్తుందని చెబుతోంది పెన్ యూనివర్సిటీ పరిశోధన. ఇది కాదు..గతంలో ఓ అధ్యయనం పుట్టగొడుగుల్లో లభించే ఎర్గోథియోనీన్ అనే యాంటీకానఇసడెంట్‌కి..రొమ్ము క్యాన్సర్ కణాలతో పోరాడి అకాల మృత్యు ముప్పుని తగ్గించే శక్తి ఉందనీ వెల్లడించింది. ఇంతేనా మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ వీటిని తినడం వల్ల అందుకోవచ్చు.

# ఈ కాలంలో ఆరోగ్యంగా..

**వాతావరణం మారినప్పుడు..అందులోనూ వర్షాకాలంలో వివిధ వ్యాధుల బారిన పడడం మామూలే. అయితే ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు మరింత అధికం. ఈ క్రమంలో–వానలు కురిసే వేళ దగ్గు, జలుబు, జ్వరాల వంటి సమస్యల బారిన పడకుండా ఈ పానీయం ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.**

**కావాల్సిపదార్థాలు :** మరిగించిన నీరు–2 కప్పులు, నిమ్మకాయలు–ఒకటిన్నర, తాజా అల్లం రసం–ఒకటిన్నర టేబుల్ స్పూన్, మామిడి అల్లం–టేబుల్ స్పూన్, తేనె–2 టేబుల్ స్పూన్లు, తేనె–2 టేబుల్ స్పూన్లు, ఉప్పు–చిటికెడు, దాల్చిన చెక్క –(రుచి కోసం).

**తయారీ :** ముందుగా ఒక గిన్నె/టీపాట్ లోకి తేనె, నిమ్మరసం, అల్లం రసం, మామిడి అల్లం, దాల్చిన చెక్క, ఉప్పు తీసుకుని బాగా కలపాలి. ఈ మిశ్రమానికి మరిగించిన నీటిని జత చేసి తేనెతో పాటు మిక్స్ చేసిన పదార్థాలన్నీ కరిగిపోయే వరకు బాగా కలపాలి. ఆ తర్వాత దీనిపై మూత పెట్టి 5–6 నిమిషాల పాటు పక్కన పెట్టాలి. ఆపై ఒక కప్పులోకి వడకట్టుకుని తాగాలి.



**వేటితో ఏ ప్రయోజనం:** ◆. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థ పనితీరును క్రమంగా మెరుగుపరుస్తాయి.
◆ అల్లంలో పుష్కలంగా ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరాన్ని డీటాక్సిఫై చేస్తాయి. దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి. జీవక్రియల రేటు కూడా మెరుగుపడుతుంది.
◆ నిమ్మలో సహజంగా ఉండే సి–విటమిన్, పొటాషియం రోగ నిరోధక శక్తి పెరగడానికి సహకరిస్తాయి. అలాగే శరీరంలోని విష పదార్థాల ప్రభావాన్ని తగ్గిస్తాయి.
◆ ఇక మామిడి అల్లం పోషకాల సమూహం. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కీళ్లనొప్పులు, చర్మంపై దురద, గాయాల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అదే విధంగా దగ్గు, అజీర్తి సమస్యలను తగ్గిస్తాయి. □



# తెర

## విజయ్ కింగ్డమ్ కోసం సందీప్ వంగ?

టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ ది విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం కింగ్డమ్ కోసం అందరికీ తెలిసిందే. ఈ చిత్రం ఇంకొన్ని రోజుల్లోనే విడుదల కాబోతుండగా సాలిడ్ ప్రమోషన్స్ కోసం సినిమా సిద్ధం అవుతుంది. కింగ్డమ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా ఈ ప్రమోషన్స్‌లో విజయ్ బ్లాక్ బస్టర్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగ భాగం కానున్నట్టుగా తెలుస్తుంది. విజయ్‌తో ఒక స్పెషల్ ఇంటర్వ్యూని వీరు ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

# ప్రీమియర్ షో అ'ధర' హో..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న హరి హర వీరమల్లు చిత్రం జూలై 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా రిలీజ్‌కు ఒకరోజు ముందుగానే ప్రీమియర్ షోలకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని కొన్ని థియేటర్లలో హరి హర వీరమల్లు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

బుక్‌మైషోలో మాత్రమే కాకుండా డిస్ట్రిక్ట్ యాప్, బ్రో యాప్ వంటివి వేదికలలో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. జూలై 23న రాత్రి 9 గంటలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలలో ప్రీమియర్ షోలు వేయనున్నారు. దీనికోసం బుకింగ్స్ ఇలా ఓపెన్ అయ్యాయో లేదో అలా సోల్డ్ అవుట్ చూపిస్తుండటం విశేషం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు హరి హర వీరమల్లు చిత్రానికి టికెట్ ధరలను పెంచుతూ ప్రత్యేక అనుమతులు మంజూరు చేశాయి.

ఏపీలో జూలై 23న పెయిడ్ ప్రీమియర్ షోల కోసం ఒక్కో టికెట్ ధరను రూ.600 వరకు నిర్ణయించారు. ఎంపిక చేసిన సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్‌లలో ప్రీమియర్ షోను ప్రదర్శించనున్నారు. రెక్లయినర్/సోఫా సదుపాయం కలిగిన టికెట్ ధర దాదాపు రూ.1000 దాటింది. అలాగే బాల్కనీ ధర రూ.830 దాటగా.. సెకండ్ క్లాస్ రూ.790 (బుకింగ్ ఛార్జీలు అదనం)గా ఉన్నాయి.

ఇక జులై 24 నుంచి మల్టీప్లెక్స్‌లలో పెంచిన ధరల ప్రకారం.. రాయల్ సీటింగ్‌లో రూ.495, ఎగ్జిక్యూటివ్ సీటింగ్‌లో రూ.377 ధర కనిపిస్తోంది. అదే సమయంలో సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో బాల్కనీ రూ.250 కాగా.. ఫస్ట్ క్లాస్ రూ.150గా నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా టికెట్ ధరల పెంపునకు ఆమోదం తెలిపింది. అయితే తెలంగాణలో పెయిడ్ ప్రీమియర్‌కు సంబంధించి ఇంకా బుకింగ్స్ ప్రారంభం కాలేదు. జూలై 24 నుంచి మల్టీప్లెక్స్‌లలో రాయల్ సీటింగ్ కోసం రూ.500గా నిర్ణయించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కోసం రూ.413 (బుకింగ్ ఛార్జీలు అదనం)గా ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ బుక్‌మై షోలో చూపిస్తోంది. అదే సమయంలో సింగిల్ స్క్రీన్‌లో బాల్కనీ రూ.300 కాగా, ఫ్రంట్ సర్కిల్‌లో రూ.200గా నిర్ణయించారు.

**20 నిమిషాల తర్వాతే హరిహర ఎంట్రీ?**

హరిహర వీరమల్లు సినిమాని నిర్మాత ఏ.ఎం.రత్నం, పవన్ కళ్యాణ్ కళ్యాణ్ కలిసి కొంతమంది స్నేహితులకు అలాగే రాజకీయవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు చూపించినట్టు సమాచారం.



సినిమా చూశాక వాళ్ళు తమ అభిప్రాయాన్ని షేర్ చేసుకున్నారు. హరిహర వీరమల్లు మొదటి 15 నిమిషాలకే అందరూ కథలో ఇన్వాల్వ్ అయిపోతాం అని, దాదాపు 20 నిమిషాల తర్వాత పవన్ కళ్యాణ్ ఎంట్రీ ఉంటుందని, ఆ తర్వాత ప్రేమ కథ, కామెడీ సన్నివేశాలు వస్తాయని చెబుతున్నారు. సనాతన ధర్మం గురించి వచ్చే డైలాగులు పవన్ వీరాభిమానులు మెచ్చే విధంగా ఉంటాయని చెబుతున్నారు.

**వీరమల్లు వచ్చేది నిశ్శబ్దంగా కాదు**

ప్రీ రిలీజ్ వేడుకలో రచయితగా క్రిష్‌కి పవన్ గౌరవం ఇస్తూ మాట్లాడిన నేపథ్యంలో ఇప్పటివరకు సైలెంట్‌గా ఉన్న క్రిష్ ఓపెన్ అయ్యాడు. 'ఈ ప్రాజెక్ట్ మరెవరి వల్ల సాధ్యపడదు. పవన్ కళ్యాణ్‌లోని ఫైర్‌ను ఏ కెమెరా క్యాప్చ్యుర్ చేయలేదు. ఏ.ఎం.రత్నం అకుంఠిత దీక్ష మాత్రమే ఈ సినిమా పూర్తవ్వడానికి కారణం. ఇప్పుడు వీరమల్లు ప్రపంచంలోకి అడుగు పెట్టబోతోంది. కానీ నిశ్శబ్దంగా కాదు ఈ సినిమాకి ఇద్దరు లెజెండ్స్ ఫ్యాషనేటెడ్ జర్నీతో వస్తోంది. ఈ చిత్రం చేయడం తన కెరీర్ లోనే ఒక ఉద్వేగభరితమైన యుద్ధాల్లో ఒకటి. సినిమా రిలీజ్ అయ్యి మంచి విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాన్ను అని పేర్కొన్నారు. అయితే.. క్రిష్ తన ట్వీట్‌లో ఎక్కడా ప్రస్తుత దర్శకుడు జ్యోతి కృష్ణ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం.



**కొట్టుకో.. కొట్టుకో.. తీన్ మార్**

పవన్ కళ్యాణ్ సినిమాకు కీరవాణి పని చేయడం ఇదే మొదటిసారి. అందులోనూ పవన్ అంటే ఆయనకు విపరీతమైన అభిమానం. ఆ అభిమానాన్ని పవన్ సినామా టైటిళ్లతో ఓ పాట రూపంలో తీర్చిదిద్ది హరిహర వీరమల్లు పీ రిలీజ్ వేదికపై చాటుకొన్నారు. గోకులంలో సీత వెదికింది.. అత్తారింటికి దారేదని.. అక్కడ అమ్మాయికి ఇక్కడ అబ్బాయి దొరికితే ఖుషి.. తమ్ముడూ.. హే తమ్ముడూ ఎక్కడున్నాడు ఆ కాటమరాయుడు? తమ్ముడూ.. హే తమ్ముడూ ఆ అజ్ఞాతవాసిని వెదికి పట్టుకో.. నేడుపులి పంజాకైనా దొరకని గబ్బర్ సింగ్ వాడూ సర్దార్ గబ్బర్ సింగ్ వాడూ..బెదిరిస్తే వస్తాడా.. నెవ్వర్.. హీ హీజ్ గుడుంబా.. శంకర్ పెరిగిపోతోందిక్కడ.. ఫీవర్.. కొట్టుకో.. కొట్టుకో.. తీన్ మార్. మా బంగారానికి నీపై తొలిప్రేమ పుట్టింది బ్రో.. ఈ వకీలు సాబే తన లైఫ్‌లోన జానీ అంటోంది బ్రో. ఈ బాలుని.. ఈ బద్రిని.. ఈ భీమ్లా నాయక్‌ని గోపాల గోపాల మాంగళ్య మంత్రాల అన్నవరంలో పెళ్లాడు.. మంత్రాల జల్సాల వేదికకి సుస్వాగతం.. ఆ సునామికి సుస్వాగతం. ఇది అరాచకం.. ఇది అరాచకం రాంబాబూ.. నువ్వు రెడీ అయిపో.. నీ కెమెరాతో.. నువ్వు రెడీ అయిపో ఆ గంగతో.. ఇకరెచ్చిపో..వస్తున్నాడొస్తున్నా దొస్తున్నా దహో.. వచ్చేశాడొచ్చేశాడోచ్చేశాహో.. ఎవ్వడూ.. హరి హర వీర మల్లు..!




**సీక్వెల్ ఆశలు సజీవం**

ఈ సినిమా సీక్వెల్‌ను ఉద్దేశించి పవన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. హరిహర వీరమల్లు మొదటి భాగం చాలా బాగా వచ్చిందని. సినిమాలో మంచి మెసేజ్ ఉంటుందని, చరిత్రని కళ్ళకు కట్టినట్టు చూపించడానికి నిర్మాత ఏ.ఎం.రత్నం ముందుకొచ్చారని. 2వ భాగాన్ని కూడా జనాల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం ఆయన చేస్తున్నారని పవన్ అన్నారు.

## బుల్లితెర రాకుమారి



యాంకర్ శ్రీముఖి ఆరెంజ్ లెహంగాలో రాకుమారిలా ముస్తాబైన లేటెస్ట్ ఫొటో షూట్ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించింది. బుల్లితెర బ్యూటీ యాంకర్ శ్రీముఖి ప్రస్తుతం చేతి నిండా షోలు, ఈవెంట్లతో కెరీర్‌ని సక్సెస్ ఫుల్‌గా లీడ్ చేస్తోంది. ఓ వైపు షోలు ఈవెంట్లతో బిజీగా ఉన్నప్పటికీ తన యూట్యూబ్ ఛానెల్, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఫుల్ యాక్టీవ్ కనిపిస్తుంది. వ్లాగ్స్, రీల్స్, లేటెస్ట్ ఫొటోషూట్లతో ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంటూ ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఆరెంజ్ లెహంగాలో రాకుమారిలా ముస్తాబైన శ్రీముఖి అందాలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ ఫొటోలపై అభిమానులతో సహా బుల్లితెర నటులు లైకుల వర్షం కురిపిస్తున్నారు. సూపర్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం శ్రీముఖి స్టార్ మా ఛానెల్‌లో ఆదివారం విత్ స్టార్ మా పరివారం, కిర్రాక్ బాయ్స్ కిలాడీ గర్ల్స్ షోలు హోస్ట్ చేస్తుంది. వీటితో ప్రీ రిలీజ్ ఈవెంట్స్, స్పెషల్ ఈవెంట్స్‌తో బిజీగా ఉంటోంది. షోలు, హోస్టింగ్ మాత్రమే కాదు నటిగా కూడా తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంది శ్రీముఖి. జులాయి, నేను శైలజ, భోళా శంకర్ వంటి సినిమాల్లో స్టార్ హీరోలతో నటించే అవకాశం దక్కించుకుంది. శ్రీముఖి పటాస్ కామెడీ షోతో ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత బిగ్ బాస్ సీజన్ 3 రన్నరప్ మరింత పాపులారిటీ తెచ్చుకుంది. శ్రీముఖి డ్రామా జూనియర్స్, సరిగమపా, అదుర్స్ వంటి పాపులర్ షోస్ హోస్ట్ చేసింది.



## వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్



పవన్ కళ్యాణ్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో శ్రీలీలతో పాటు రాశీ ఖన్నా కూడా మరో ఫీమేల్ లీడ్‌గా కనిపించబోతున్నారని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడీ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఉస్తాద్ భగత్ సింగ్‌లో రాశీ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో రాశీ శ్లోక అనే పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిపారు. పోస్టర్ లో రాశీ మెడలో కెమెరా వేసుకొని స్టైలిష్ గా కనిపించింది. చూస్తుంటే.. సినిమాలో రాశీ ఓ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ అన్నట్లుగా అనిపిస్తోంది.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే హైదరాబాద్ లో కొత్త షెడ్యూల్ ప్రారంభించారు.

మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ డీఎస్పీ సంగీతం అందిస్తున్నారు. పవన్ ఫ్యాన్స్‌ని అలరించే మాస్ అంశాలు, ఎలివేషన్స్, విజిల్ మార్క్ సన్నివేశాలు ఈ సినిమాలో పుష్కలంగా ఉంటాయని తెలుస్తోంది.

అంతేగాదు కథ, కథనం పాత్రలు అన్నీ కొత్తగా ఉంటాయని, పవన్ ని ఇప్పటివరకు చూడని ఒక డిఫరెంట్ యాంగిల్‌లో చూడబోతున్నారని హరీష్ శంకర్ తెలిపారు.



## 25 వసంతాల వేళ..

జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ఇద్దరూ సినీ పరిశ్రమలో అడుగుపెట్టి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. జులై 25న ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వార్ 2 ట్రైలర్ విడుదల చేయాలని నిర్ణయించినట్లు మేకర్స్ ప్రకటించారు. మరోవైపు ఈ చిత్ర తెలుగు ప్రీరిలీజ్ ఈవెంట్‌ను విజయవాడలో ఘనంగా నిర్వహిస్తారని.. దీని కోసం ఎన్టీఆర్ స్వయంగా బాధ్యతలు తీసుకున్నాడని.. ఇక ఈ ఈవెంట్ కోసం హృతిక్ రోషన్ కూడా వస్తాడని సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఆగస్టు రెండో వారంలో నిర్వహించేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారని సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా ఈ చిత్రాన్ని ఆగస్టు 14న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలుచేస్తున్నారు. 2019 లో బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన వార్ సీక్వెల్‌గా వార్ 2 రూపొందించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హృతిక్ కబీర్ పాత్రలో తిరిగి వస్తుండగా.. ఎన్టీఆర్ మరో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇందులో బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఫీమేల్ లీడ్‌గా నటించింది. జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న ఈ సినిమాను తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## పరాశక్తికి రానా కీలకం?

తమిళ స్టార్ హీరో శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న పరాశక్తి లేటెస్ట్ షెడ్యూల్‌ను తమిళనాడులోని కోయంబత్తూరు, పొల్లాచిలో నిర్వహిస్తున్నారు. హీరో శివ కార్తికేయన్, హీరోయిన్ శ్రీలీల..లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో హీరో రానా కూడా పాల్గొన్నట్టు తెలుస్తోంది. రానాకి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇందులో మీసాలు పెంచి కనిపిస్తున్నాడు రానా. దాదాపు శివ కార్తికేయన్ లుక్ కూడా ఇలానే ఉంది. దీంతో ఈ సినిమాలో టాలీవుడ్ హీరో రానా కూడా కీలక పాత్ర పోషించనున్నారన్న వార్తలు వస్తున్నాయి. దీనిపై టీం అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గురు ఆకాశం నీ హద్దురా వంటి సూపర్ హిట్ సినిమాలు అందించిన సుధా కొంగర ఈ చిత్రానికి దర్శకుడు. జయం రవి అలియాస్ రవి మోహన్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తుండగా శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. మరో తమిళ హీరో అథర్వ మురళి కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై తిరుచిరాపల్లి, ఆకాష్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా.. సెప్టెంబర్ 5కి రిలీజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.





## వింత జంతువుల నుంచి ప్రతిఘటన

చాలా గ్యాప్ తర్వాత హాలీవుడ్ నుంచి ఓ ప్రిడేటర్ చిత్రం ప్రిడేటర్ బ్యాడ్ ల్యాండ్స్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. గతంలో ప్రే, 10 కల్వర్ ఫీల్డ్ వంటి విజయవంతమైన చిత్రాలను రూపొందించిన డాన్ ట్రాచ్టెన్‌బర్గ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా 20 సెంచరీ స్టూడియోస్ నిర్మించింది. ఎల్లే ఫానింగ్, డిమిట్రియస్ షుస్టర్కో లోమాతంగి లీడ్ రోల్స్‌లో నటించారు. నవంబర్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ మూవీ ట్రైలర్ విడుదల చేశారు.

ఇక.. ఈ ట్రైలర్ విషయానికి వస్తే చూసే ప్రతిఒక్కరికి గూస్‌బంప్స్ వచ్చేలా ఉంది. ఇప్పటివరకు ఈ ప్రెడేటర్ సిరీస్ ఫ్రాంఛైజీలో ఆరు చిత్రాలు రాగా ఇది ఎడవ చిత్రం. అంతేగాక ఈ ఆరు చిత్రాలలో ప్రతీసారి మనుషులతోనే పోరాడిన ప్రెడేటర్..

ఈ సినిమాలో మాత్రం కథ భిన్నంగా ఉండనుంది. అనుకోకుండా ఓ గ్రహం పైకి వచ్చిన ప్రెడేటర్‌కు అక్కడి వింత, భయంకరమైన జంతువుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుంది.

అంతేగాక అక్కడే ఉండే రోబోట్స్, హై లెవల్ టెక్నాలజీని ఉపయోగించే మనుషులతోనూ పోరాడాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితుల్లో మొండెం వరకు మాత్రమే ఉండే ఓ యువతి ఆ ప్రెడేటర్‌కు సాయం చేస్తుంది. ఈ క్రమంలో వారు అక్కడి నుంచి సురక్షితంగా బయట పడ్డారా లేదా, అక్కడి జంతువుల, రోబోట్స్‌ను ఎలా ఎదుర్కొన్నారనే స్టోరీతో ప్రెడేటర్ బ్యాడ్ ల్యాండ్స్ సినిమా ఉండనుంది.

ఈ నేపథ్యంలో.. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌ను చూస్తే ఇప్పటివరకు వచ్చిన చాలా హాలీవుడ్ సినిమాలను మించిన విజువల్స్, గ్రాఫిక్స్‌ను తలదన్నేలా ఉన్నాయి. ముఖ్యంగా యానిమల్స్ అయితే నెవర్ భిఫోర్ అనేలా ఉన్నాయి. ఒక్కసారి ట్రైలర్

## గుర్రం పాపిరెడ్డికి స్పెషల్ అట్రాక్షన్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా గుర్రం పాపిరెడ్డి. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేను సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. త్వరలో గుర్రం పాపిరెడ్డి సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా నుంచి ప్రముఖ నటుడు యోగిబాబుకు జన్మదిన శుభాకాంక్షలతో స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో యోగిబాబు ఉడ్రాజు అనే పాత్రలో సందడి చేయబోతున్నారు. ఆయన పర్‌ఫార్మెన్స్ ఈ చిత్రానికి అదనపు ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. పర్ఫెక్ట్ డార్క్ కామెడీ మూవీగా గుర్రం పాపిరెడ్డి సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా డిజైన్ చేసిన క్యారెక్టర్స్‌ను హైదరాబాద్ సిటీ బ్యాక్ డ్రాప్‌లో కాంటెంపరరీగా, స్టైలిష్‌గా ప్రెజెంట్ చేస్తున్నారు దర్శకుడు మురళీ మనోహర్. నటీనటులు నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా, బ్రహ్మానందం, యోగి బాబు, తదితరులున్నారు.



## వాళ్లు నన్ను అలా పిలవమనేవాళ్లు

అందాల హాట్ యాంకర్ అనసూయ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జబర్దస్త్ ద్వారా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ సినిమాల్లో కూడా బిజీ అయ్యింది. ఇక అనసూయ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అంటే రంగస్థలమే. రామ్ చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రంగమత్త పాత్రలో అనసూయ నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఈ సినిమా హిట్ తరువాతనే టాలీవుడ్ అనసూయ బిజీగా మారింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో రంగమత్త పాత్ర తనకు ఎలా వచ్చిందో అనసూయ చెప్పుకొచ్చింది. ఈ పాత్ర కోసం చాలామందిని ఆడిషన్ చేశారని, ఆడిషన్ జరిగిన 3 నెలల తరువాత తనను ఫైనల్ చేసినట్లు తెలిపింది. రంగస్థలంలో నన్ను సెలక్ట్ చేసే సమయానికి సుకుమార్ సార్.. నేను నటించిన క్షణం సినిమా కూడా చూడలేదు. సుక్కు సార్ తో పాటు ఆ సినిమాకు ముగ్గురు రైటర్స్ పనిచేశారు. ఇప్పుడు పెద్ది సినిమాకు డైరెక్షన్ చేస్తున్న బుచ్చిబాబు .. అప్పుడు రంగస్థలంకు ఒక రైటర్‌గా పనిచేశాడు. వారితో పాటు కాశీ, శ్రీనివాస్ అని ఉండేవారు. వారు ముగ్గురు నాచేత మాయ్యా అని పిలిపించుకొనేవారు. బుచ్చి మాయ్యా.. కాశీ మాయ్యా.. శ్రీనివాస్ మాయ్యా.. వాళ్ల ముగ్గురు చాలామందిని ఆడిషన్ చేశారు. కనీసం ఒక 20 మందిని ఆడిషన్ చేశారు. చిన్నవాళ్లు.. పెద్దవారు చాలామంది ఉన్నారు. ఆ తరువాత నాకు ఆడిషన్ కు రమ్మని కాల్ వచ్చింది. నేను వెళ్లి వచ్చిన మూడు నెలల తరువాత ఓకే అని చెప్పారు. అప్పటికీ ఆశలు వదిలేసుకున్నా.. నన్నెందుకు తీసుకుంటారులే అనుకున్నా... తరువాత షెడ్యూల్ ఇది అని చెప్పారు.



## మెగాఫోన్ అందుకున్న జోషీ

లెజెండరీ డైరెక్టర్ జోషీ ఓ హై-ఒక్టేన్ యాక్షన్ ఎంటర్టైనర్‌కి మెగాఫోన్ పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఉన్ని ముకుందన్ ఫిలింస్ ఐన్స్టిన్ మీడియా బ్యానర్లపై ఈ సినిమా రాబోతోంది. జోషీ తన పుట్టినరోజు వేళ ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్లు తర తరాలకు స్ఫూర్తిగా నిలిచాయి. ఇప్పుడు ఆ అనుభవంతో, ఈ తరం స్టోరీ టెల్లింగ్ పవర్‌తో, ఒక భారీ యాక్షన్ మూవీ తీసేందుకు రెడీ అవుతున్నారు. నేషనల్ అవార్డు గెలుచుకున్న మెప్పడియాన్ తర్వాత వంద కోట్ల గ్రాస్ కలెక్షన్‌తో దూసుకెళ్లిన మార్కో వంటి సినిమాలతో గేలీనీ స్టాండర్డ్‌ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లింది. ఇప్పుడు జోషీ లాంటి మాస్టర్ డైరెక్టర్‌తో చేతులు కలపడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అభిలాష్ ఎన్. చంద్రన్ ఈ సినిమాకి కథ స్క్రీన్‌ప్లే అందిస్తున్నాడు. పొరించు మరిఅమ్ జోస్ కింగ్ ఆఫ్ కొథా వంటి సినిమాలకు రాసిన ఈయన ఎమోషన్ డెప్త్ ఉన్న క్యారెక్టర్‌లు రాయడంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ సినిమా కూడా యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలుతో ఉండబోతోంది. హీరోగా ఉన్ని ముకుందన్ తన కెరీర్‌లో ఎప్పుడూ చూడని లుక్‌లో, మాస్ యాక్షన్ అవతారంలో కనిపించబోతున్నాడు. ఈ సినిమా నిర్మాణంలో భాగమైన ఐన్స్టిన్ మీడియా ఇటీవలే ఆంటోనీ, పురుష ప్రేతం వంటి యూనిక్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. డిఫరెంట్ కాన్సెప్ట్స్, క్వాలిటీ కంటెంట్‌కి పేరు తెచ్చుకున్న ఈ బ్యానర్ కూడా ఈ సినిమాతో సత్తా చాటబోతోంది.



# బ్యాంకుల రుణమాఫీలో రూ.లక్ష కోట్ల అవినీతి

## మాజీ ఎంపి చింతా మోహన్..

**కడప కార్పొరేషన్ జూలై 22 ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాలలో రూ.14.50 లక్షల కోట్ల లు నాన్ పెర్ఫార్మింగ్ అసెట్ (ఎన్ పి ఏ) బ్యాంకుల ద్వారా రుణమాఫీ చేసిందని, అందులో పది శాతం కమిషన్ తీసుకుని లక్ష కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ ఆరోపించారు. సోమవారం కడప వైయస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో, ఎవరెవరికి ఎంత రుణమాఫీ చేశారో వివరాలతో కూడిన జాబితాను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. లక్ష కోట్ల రూపాయల అవినీతిపై సిబిఐ, ఈడి ద్వారా విచారణ జరిపించాలన్నారు. అమరావతిలో నీటిపై చంద్రబాబు నాయుడు రాజధాని నిర్మిస్తున్నారని ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. అమరావతిలో ఎక్కడ తనకు దేవతలు కనిపించడం లేదని, కర్ర తుమ్మ చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం లేదన్నారు. రాజధాని విషయంలో రాష్ట్రంలోని 20 జిల్లాల ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. రాజధాని విషయంలో పునరాలోచించుకోవాలన్నారు. రాయలసీమలో రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తే 25 లక్షల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేశాక గోదావరి నీళ్లు, బనకచర్ల గురించి ఆలోచిస్తే బాగుంటుందన్నారు.

# నేడు గాంధీభవన్‌లో ముఖాముఖికి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనడానికి బుధవారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,దివ్యాంగులు సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గాంధీ భవన్‌కు రానున్నారు.టిపిసిసి చీఫ్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు వారానికి రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉంటారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే విన్నపాలు మంత్రికి ఇవ్వడానికే ఈ కార్యక్రమం దోహదపడుతోంది. అడ్లూరి లక్ష్మన్ మంత్రిగా ఇటీవలే పదవి బాధ్యతలు తీసుకొని తొలిసారి విన్నపాలు స్వీకరణకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి వస్తున్నారు.



తాటి, ఈత వనంలో కార్మికులతో తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్ తదితరులు

# కల్తీ పేరిట కల్లు నిషేధానికి కుట్రలు

## గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయొద్దు

### కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్

**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** కల్తీ పేరిట ఔషధ గుణాలు కలిగిన కల్లును నిషేధించేందుకు కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లు గౌడ్ అన్నారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గి గీతన్నల వృత్తి గౌరవాన్ని దెబ్బతీయ్యవద్దన్నారు. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కామారెడ్డి హన్మాండ్లు గౌడ్‌తో పాటు యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగాల గోవర్ధన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పులి లక్ష్మీపతిగౌడ్,కార్యాలయం కార్యదర్శి టి.భిక్షపతి గౌడ్‌లు మాట్లాడారు. తొలుత హన్మాండ్లు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కల్తీ కల్లు నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. కల్తీకి పాల్పడిన దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. కొందరు చేసిన తప్పుకు నగరంలోని కల్లు దుకాణాలన్ని మూసివేసి ఔటర్‌రింగ్ రోడ్డుకు తరలిస్తారని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నగరంలో కల్లు సొసైటీలోని దుకాణాలను యధావిధిగా కొనసాగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

దుకాణాలను ఔటర్ కు తరలిస్తే వేలాది మంది కల్లుగీత కార్మికులు, సొసైటీల్లోని కల్లు డిపో వర్కర్లు, పారిశ్రామికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ప్రమాదవశాత్తు ఈత, తాటి చెట్ల పైనుండి పడి మరణించిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సహాయంలో చాలా జాప్యం జరుగుతున్నదన్నారు. దీనిని నివారించి తక్షణమే ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన నీరాకేఫ్ ప్రాంగణంలోకి తెలంగాణ ట్యాడి ట్యాపర్ కార్యాలయాన్ని తరలించాలని ఆయన ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కల్లు గీత కార్పొరే షన్‌కు వెంటనే పాలక కమిటీని నియమించాలన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఐక్యత చాటుతున్న బిసి నేతలు

# రాంచంద్రరావు వ్యాఖ్యలపై మండిపడ్డ బిసి నేతలు

## తమిళనాడులో సాధ్యమైనప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదు

### సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్లి ప్రధానిపై ఒత్తిడి చేయాలి

**హైదరాబాద్ (సైఫాబాద్), జులై 22 ప్రభాతవార్త:** బిసిల 42 శాతం రిజర్వేషన్‌ల అమలుపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు న్యాయప రమైన అంశాలపై అవగాహన లేదని, పూర్తి అజ్ఞానంతో వ్యాఖ్యలు చేశారని జాతాయ బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య ఆరోపించారు. తమిళనాడులో 4 సార్లు అఖిల పక్ష సమావేశం నిర్వహించి 3 సార్లు తీర్మానం చేసి రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదం చేసి బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చడం జరిగిందని ఆయన వివరించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ లను 9వ షెడ్యూల్డ్‌లో పెట్టె విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు తీవ్రంగా చేయాలని, ప్రభుత్వం చేసిన కులగణను బహిర్గతం చేయకపోవ డమంటే సమాజాన్ని తప్పుదారి పట్టించడమేనని ఆరోపించారు.బిసి ఇంటలెక్చవల్ ఫోరం ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ రాంచంద్రరావు ఢిల్లీలో బిసిల రిజర్వేషన్‌లపై చేసిన ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బిసి బిల్లుకు అమోదం తెలిపిన బిజెపి, కేంద్రంలో ఎందుకు వ్యతిరేకిస్తున్నదని ప్రశ్నిం చారు. ఇక నుంచి తమ పోరాటాలు ఢిల్లీ నుంచి కొనసాగిస్తామని, తమిళనాడు రిజర్వేషన్‌లు సాధ్యమైనప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కావని ప్రశ్నించారు. 4శాతం ఉన్న ఒసిలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను కేంద్రం కల్పించిందని ఆరోపించారు. సిఎం రేవంత్‌రెడ్డి అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళి ప్రధాని నరేంద్ర మోదీపై వత్తిడి చేసి బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్డ్‌లో చేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నేతలు బాలగోని బాలరాజుగౌడ్, అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, ఎస్.దుర్గయ్య గౌడ్, కె.వి.గౌడ్, చామకూర రాజుగౌడ్, అంబాల నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై డిజిపి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధుల్లో మహిళల భద్రతకు సంబంధించి డిజిపి జితేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. మహిళా భద్రతా విభాగం నేతృత్వంలో జరిగిన ఈ సమావేశం డిజిపి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి సిఐడి చీఫ్ చారు సిన్హాతో పాటు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి, రాచకొండ కొత్వాల్ సుధీర్ బాబు, మహిళా భద్రతా విభాగం డిఐజి రెమా రాజేశ్వరితో పాటు ట్రై కమిషన రేట్ల భద్రతా మండలి అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ ట్రై కమిషనరేట్లలో మహిళల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో సైబరాబాద్ కమిషనరేట్ ముందంజలో వుందని ఆయన తెలిపారు. మహిళల భద్రతకు సంబంధించి ట్రై కమిషనరేట్ల అధికారులు పరస్పర సహ కారంతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. మహిళల భద్రతకు సంబంధించి వున్న భరోసా కేంద్రాలు, షీ బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగంతో కలిసి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ విషయంలో ట్రై కమిషనరేట్ల సెక్యూరిటీ కౌన్సిల్స్ సభ్యుల సహకారం తీసుకోవాలని ఆయన కోరారు.

# సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై దృష్టి: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జూలై22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాల తగ్గింపుపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టిని సారించింది. ప్రభుత్వాస్పత్రుల్లో సహజ ప్రసవాల విస్తృత మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ చేయాలన్నారు. ఈ దిశగా సుశిక్షితులైన మిడ్‌వైఫ్స్ (ప్రసూతి సహాయకులు) ద్వారా సహజ ప్రసవాల్ని ప్రోత్సహించే పథకానికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ప్రసవ సమయంల్లో ప్రభుత్వాసుపత్రుల్లోని స్టాఫ్ నర్సులే ప్రసూతి సేవల్ని అందిస్తున్నారు. వీరికి వివిధ అంశాలపై తగిన పరిజ్ఞానం, శిక్షణ కొరవడడంతో సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈలోటును తీర్చేందుకు ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు 18 నెలల పాటు ప్రసవానికి ముందు, ప్రసవ సమయం, ప్రసవానంతర సేవలకు సంబంధించిన అంశాలపై సమగ్ర శిక్షణ అందించి మహిళలు సహజ ప్రసవాల పట్ల మొగ్గు చూపేలా ఈ ప్రత్యేక పథకాన్ని రూపొందించారు.తొలి విడతలో సంవత్సరానికి 600 నుంచి 6000 పైగా ప్రసవాలు జరుగుతున్న 86 ప్రభుత్వాసుపత్రుల్లో సుశిక్షితులైన 1264 మంది ప్రసూతి సహాయకుల్ని(మిడ్‌వైఫ్స్) నియమిస్తారు. వీరు వివిధ సమయాల్లో అందించాల్సిన సేవలు, విధులపై సమగ్ర జాబ్ చార్టును రూపొందించిన ప్రసూతి సేవల నాణ్యతను ఈ పథకం కింద పెంచుతారు. బెంచ్ మార్క్(బిఎ) సర్వేల్లో భాగంగా గర్భవతుల పూర్వ ఆరోగ్య వివరాలు, ప్రస్తుత స్థితి, ప్రసవ విషయ పరిజ్ఞానం, సరైన పోషణ, వ్యాయామ అవసరాలు, సహజ ప్రసవాల వల్ల కలిగే లాభాలను శిక్షణ పొందిన మిడ్‌వైఫ్స్ అందిస్తారు. లేబర్ రూముల్లో ప్రసవ నొప్పులకు సంబంధించిన విషయ పరిజ్ఞానం మరియు వాటిని భరించే విధానం, సహజ ప్రసవానికి అవసరమైన సలహాలు, ఏవైనా క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యే అవకాశాల గుర్తింపు మరియు చేపట్టాల్సిన చర్యలపై వీరు తగు సలహాలిస్తూ అప్రమత్తంగా ఉంటారు. ప్రసవానంతరం తల్లి మరియు బిడ్డ ఆరోగ్య పరిస్థితి అంచనా, తల్లిపాల విశిష్టతను వివరించడంతో పాటు తల్లీబిడ్డల మధ్య మానసిక అనుబంధాన్ని పెంచడం, ప్రసవానంతరం ఎదురయ్యే సమస్యలపై దృష్టి పెడతారు. ప్రస్తుత స్టాఫ్ నర్సుల విషయ పరిజ్ఞానం, శిక్షణా రాహిత్యాల వలన ప్రసవ సమయాల్లో డాక్టర్ల పాత్ర ఎక్కువగా ఉండడంతో...సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఒక అంచనా. కేంద్ర ప్రభుత్వ సాయంతో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్ హెచ్ ఎం) కింద అమలయ్యే ఈ పథకానికి సంబంధించిన అన్ని అంశాల్ని లోతుగా చర్చించి మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఈ పథకం విస్తృతిని పెంచాలని, గిరిజన మరియు గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవాలు నిర్వహించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి కేంద్రంలోనూ ఒక సుశిక్షిత ప్రసూతి సహాయకురాలు(మిడ్‌వైఫ్) ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ఈ పథకం కింద ఎంపిక చేసిన ప్రతి స్టాఫ్ నర్సుకు 18 నెలల పాటు సమగ్రమైన శిక్షణ అందించడానికి స్టైపెండ్‌తో కలిపి రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా.2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం ప్రసవాల్లో 56.12 శాతం సిజేరియన్ ప్రసవాలు జరిగినట్లు సమాచారం.

ఇందులో ప్రభుత్వాసుపత్రుల్లో జరిగిన ప్రసవాల్లో 41.40 శాతం సిజేరియన్లు కాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 67.71 శాతం మేరకు సిజేరియన్ ప్రసవాలు జరిగాయి.

# ప్రాంతాల మధ్య వైరుధ్యాల సృష్టికి పన్నాగం

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త:** ప్రాంతాల మధ్య వైరుధ్యాలను సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోలని బిఆర్ఎస్ నేతల పన్నాగం పన్ను తున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. గాంధీ భవన్‌లో మంగళవారం అందుబాటులో ప్రజా ప్రతినిధుల కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలను చేస్తున్న బిఆర్ఎస్‌పార్టీని రద్దు చేస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. బనకచర్ల అనే లేని ప్రతిపాదనను వివాదం చేస్తూ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారని అద్దంకి దయాకర్ ఆరోపించారు. ఫాం హౌస్‌కి పరిమితమైన కెసిఆర్‌కి ప్రతిపక్ష హోదా ఎందుకు అని నిలదీశారు. కెసిఆర్ కుటుంబంలోని నలుగురిలో రాబోయే రోజుల్లో ముగ్గురు కలిసి ఉండే అవకాశం ఉందా? ఇంతకు కవిత ఏపార్టీలో ఉన్నట్లు అని అనుమానం వ్యక్తంచేశారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతు మీరు ఎంపిలు, ఎమ్మెల్యేలుగా ఎలా ఉన్నారని అద్దంకి ప్రశ్నించారు. బిఆర్ఎస్ ఆంధ్ర మీడియా అంటూ దాడులు చేసే పరిస్థితికి దిగజారిందని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీలో రెండో నెంబర్ వ్యక్తి ఆ పార్టీలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఆ పార్టీలో అదే తంతు కొనసాగుతుందన్నారు. అరెస్టులు,కేసులంటే బిఆర్ఎస్ నేతలకు భయం పట్టుకుంది మీ హయాంలో స్పీకర్ పర్మిషన్ లేకుండా రేవంత్ రెడ్డి, కోదండరాం,కృష్ణయ్యను అరెస్టు చేశారని గుర్తుచేశారు.మేం ప్రశ్నిస్తే అరెస్టు చేశారు.మిమ్మల్ని ఎందుకు అరెస్టు చేయకూడదని అన్నారు. వంటేరు ప్రతాప్ రెడ్డిని బెదిరించి మీ పార్టీలో చేర్చుకున్నారు.ఆయనను పోలీసులు కొట్టిన తీరు చూసి బాధ కలిగిందని గతాన్ని గుర్తు చేసుకున్నారు. బిఆర్ఎస్ ఇచ్చింది రేషన్ కార్డులు కాదు రేషన్ సీట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. మేము వచ్చాక కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. గ్రూప్–1 మీద కేసులు వేయడానికి బిఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలను చూసి శకుని కూడా సిగ్గుపడే పరిస్థితి ఉందని అన్నారు. నిజమైన ఉద్యమకారులు ఎవరో కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలుసని బిఆర్ఎస్ చేసే విషప్రచార మాటలను నమ్మకండని అద్దంకి అన్నారు.అంతకు ముందు గాంధీభవన్‌లో ప్రతి రోజూ నిర్వహించే అందుబాటులో ప్రజా ప్రతినిధుల సమావేశంలో అద్దంకి పాల్గొని ఉద్యోగులు, స్థానికులు, ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. వాటి పరిశీలించి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన ఆర్జీలను ఎక్కువగా వచ్చాయని ఆయన తెలిపారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బిసి వ్యతిరేకి

## తెలంగాణ బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలి: రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి ఎంపిలు రాజీనామా చేయాలి,వారు రాజీనామా చేస్తే ఎందుకు అమలు చేయరో చూద్దాం అంటూ రాష్ట్రరవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ బిజెపి అధ్యక్షుడు మరోసారి బిసి రిజరేషన్ వ్యతిరేకతతో తన అసలు నిజ స్వరూపాన్ని బయటపెట్టాడని బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ 9 వ షెడ్యూల్ లో చేర్చడం అసాధ్యం అంటున్నారని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమే,గతంలో పక్క రాష్ట్రం తమిళనాడులో జరిగిందని ఆయన ఉదహరించారు. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు,ఎమ్మెల్యేలు రాజీనామా చేసి జాతీయపార్టీపై ఒత్తిడి పెంచండి ఎందుకు రిజర్వేషన్లు అమలు కావో చూస్తాం, దీనిని సాధించిపెట్టండని ఆయన కోరారు. సుప్రీంకోర్టులో ఇందిరా సహనీ కేసులో బిసి రిజర్వేషన్ పెంపు విషయంపై స్పష్టంగా చెప్పారు. రాష్ట్రాల దగ్గర ప్రామాణికమైన సమాచారం ఉంటే ఎంపెరికల్ డేటా ఉంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని చెప్పారని ఆయన వివరించారు.అందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి కేబినెట్ ఆమోదం శాసన సభ ఆమోదం, గవర్నర్ ఆమోదంతో ఢిల్లీలో ఉందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకో వాల్సిన అంశంతప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని పొన్నం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నడుపుతున్న బిజెపి 9వ షెడ్యూల్ లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు తప్పకుండా చేర్చాల్సిందే అని డిమాండ్ చేశారు. గతంలో జనహిత అభియాన్ కేసులో ఇడబ్ల్యుఎస్ సందర్భంగా స్పష్టంగా చెప్పిందిని ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ ఇచ్చినప్పుడు 50 శాతం రిజర్వేషన్ల శ్లాబ్ ఎత్తివేశారని గుర్తు చేశారు. ప్రామాణిక నివేదిక ప్రకారం సమా చారం సుప్రీంకోర్టులో ఉందని మభ్యపెడుతుంది మీరు అని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి బిసి అని మభ్యపెట్టేమీరు కనీసం ఎల్పి లీడర్, పార్టీ అధ్యక్షపదవి కూడా బిసిలకు ఇవ్వకుండా బిజెపి కుల వివక్ష పాటిస్తోందని ఆయన దుయ్యబట్టారు.

# బిజెపి బిసి నేతలు రిజర్వేషన్ కోసం నోరు విప్పాలి

## ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్



**హైదరాబాద్,జూలై 22,ప్రభాతవార్త:** తెలంగాణలో విద్య,ఉద్యోగం,రాజకీయ అవకాశాలు పెంపొందించడానికి బిసిలకు 42శాతం రిజర్వేషన్ పెంపు కోసం బిజెపి హైకమాండ్‌పై ఒత్తిడి తీసుకొచ్చి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చడానికి ఆ పార్టీ బిసి నేతలు నోరు విప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లాడతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైఖరిలో బిసి రిజర్వేషన్ వ్యతిరేకంగా కనిపిస్తున్నదని అన్నారు. రాంచంద్రరావు బిసి రిజర్వేషన్లను ఆహ్వానిస్తున్నామని రాష్ట్రంలో చెపుతూ ఢిల్లీ వెళ్లగానే మాట మారుస్తున్నాడని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ లపైన మా రేవంత్ రెడ్డి చిత్తశుద్దిని పశ్నించే నైతిక హక్కు బిజెపి కి లేదని ఆయన అన్నారు. బిసి రిజర్వేషన్ల పైన మా చిత్తశుద్ధిని మేం నిరూపించుకున్నామని, 42 శాతం రిజర్వేషన్ల కోసం పకడ్బందీగా కులగణన చేశామని మంత్రి వర్గంలో ఆమోదించామని అసెంబ్లీలో చట్టం చేశాం గవర్నర్ దగ్గర నివేదించామని ఆది శ్రీనివాస్ వివరించారు. 9వ షెడ్యూల్ లో చేర్చాల్సింది కేంద్ర ప్రభుత్వమే అన్నారు. 9వషెడ్యూల్ లో చేర్చాలని మేం జంతర్ మంతర్ దగ్గర ఇప్పటికే ధర్నా చేశామని కూడా గుర్తుచేశారు.పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాంమని ఇప్పుడు బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తే మేం సహించం అని ఆది హెచ్చరించారు. రామచంద్రరావు కూడా ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు నడ్డాను రిజర్వేషన్లపై నిలదీయాలని ఆదిశ్రీనివాస్ హితవు చెప్పారు.సొంత పార్టీని ఒప్పించుకోవడం చేతకాక మా పైన విమర్శలు చేస్తే సరిపోదని అన్నారు. తెలంగాణలోని వెనుకబడిన తరగతుల ప్రజలు బిజెపి దొంగ నాటకాన్ని గమనించాలని కోరారు. ఈటెల రాజేందర్,ధర్మపురి అర్వింద్ తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చడానికి నోరువిప్పాలని ఎందుకు బిజెపి బిసి నేతలు నోరు మెదపడంలేదని ఆయన ప్రశ్నించారు.

# దాశరథి కృష్ణమాచార్యకు సముచిత గౌరవం ఇవ్వని ప్రభుత్వం

## తెలంగాణ జాగృతి స్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




సభలో ప్రసంగిస్తున్న కల్వకుంట్ల కవిత, కె.శ్రీనివాస్, నాళేశ్వరం, అమ్మంగి తదితర అతిథులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 22 ప్రభాతవార్త :** నిజాం రాచరిక దుష్టపాలన నుండి తెలంగాణ విముక్తి కోసం కలమనే ఆయుధాన్ని పట్టి తెలంగాణ రాష్ట్ర సాకారానికి ప్రముఖభూమికను పోషించిన ఉద్యమ చరిత్ర కలిగిన మహోన్నతకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించడంలో నేటి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమై సముచిత గౌరవం ఇవ్వలేదని తెలంగాణ జాగృతి స్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విచారం వ్యక్తపరిచారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో తెలంగాణ జాగృతి నిర్వహణలో జరిగిన దాశరథి శతజయంతి ఉత్సవాలకు కె.కవిత ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రముఖకవి డా. నాళేశ్వరం శంకరం, సాహితీవేత్త డా. అమ్మంగి వేణుగోపాల్, సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, దాశరథి కుమారుడు లక్ష్మణ్ తదితరులతో కలిసి దాశరథి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించి ప్రసంగించారు.

మారుమూల గ్రామం చిన్నగూడూరు లోని పేద కుటుంబంలో జన్మించిన ఆయన గిరిజనులు, పేదప్రజల దీనస్థితిపై చైతన్యం కలిగించే ఎన్నో రచనలు చేశారని వివరించారు. సామాజిక వివక్షను తుడిచి పెట్టాలంటే కవిత్వమే ఆయుధమని ఉద్యమ కవితలు రాసారన్నారు. నిజామాబాద్‌లో దాశరథిని నిర్భందించిన జైలు వద్ద ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి పెద్దయెత్తున అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అగ్నిశిఖ పుస్తకాన్ని కవిత ఇతర అతిథులతో కలిసి ఆవిష్కరించారు.

అనంతరం కె.శ్రీనివాస్, నాళేశ్వరం శంకరం తదితరులు ప్రసంగించారు. సభా కార్యక్రమం అనంతరం అగ్నిశిఖ పేరిట జరిగిన కవిసమ్మేళనంలో పలువురు కవులు తమ తమ కవితా గానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు.

# ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ కింద ఎపి నుంచి తక్కువ మంది నమోదు

**విజయవాడ,జూలై 22,ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో 60 ఏళ్ళు నిండిన అసంఘటిత రంగ కార్మికులకు వారు కట్టే చందా ఆధారంగా నెలకు రూ.3 వేల పింఛను అందించే ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ పథకం కింద ఏపీ నుండి తక్కువ మంది నమోదైనట్లు మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. మచిలీపట్నం జనసేన వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. గత నాలుగేళ్లలో దేశ వ్యాప్తంగా ఈ పథకం కింద 5,94,074 మంది నమోదు కాగా ఆ ఆంధ్రప్రదేశ్‌లో ఆ సంఖ్య 20,275(3.41%) పరిమితమైనట్లు తెలిపారు. ఇందులో 88% మంది కేవలం 2022–23లో నమోదయ్యాయని,మిగిలిన సంవత్సరాల్లో రిజిస్ట్రేషన్లు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. పదేళ్లలో 78.9% పెరిగినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఇది 2014–15లో రూ.79,174 మేర ఉండగా,2024–25 నాటికి రూ.1,41,609కి చేరి 78.9% వృద్ధిని నమోదు చేసిందన్నారు.

# బిసి ద్రోహిగా మిగిలిపోనున్న బిజెపి

## 42శాతం ఆర్డినెన్స్ అడ్డుకోవడానికి బిజెపి బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ జూలై 22,ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వైఖరితో బిసి ద్రోహిగా మిగిలిపోతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎల్పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు అమలు కావొద్దదన్నదే రామచంద్రరావు వైఖరిగా ఉందని ఆవేదన చెందారు. బిసిలు కాంగ్రెస్ వైపు మొగ్గ చూపుతారనే రామచంద్రరావు మొసలికన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపిలు గెలిపించినా రాష్ట్రానికి నిధులు తీసుకురాలేకపోతున్నారని కనీసం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ ఆమెదించిన బిల్లు కేంద్రానికి పంపితే ఆర్థికేతర అంశమైనా దానిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందుపరిచేందుకు కేంద్రంతో పోరాటం చేయలేని చేతగాని దద్దమ్మలు బిజెపి ఎంపిలని ఆయన విమర్శించారు.బండి సంజయ్, ఈటెల రాజేందర్, ధర్మపురి అర్వింద్ లాంటి వాళ్ల కేంద్రాన్ని ఎందుకు ఒప్పించలేకపోతున్నారు? అని ఆయన ప్రశ్నించారు.స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం మా రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ తీసుకువస్తున్నారని ఆయన తెలిపారు.బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు రిజర్వేషన్ల పైనచేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి, బిఆర్ఎస్‌లోపాయికారీ ఒప్పందం తో ఆర్డినెన్స్‌ను అడ్డుకోవాలని ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు.

# సంతోష్‌నగర్ పోలీసు స్టేషన్‌లో యువకుడి అక్రమ నిర్బంధంపై హెచ్‌ఆర్‌సి సీరియస్

**హైదరాబాద్, జూలై 22, ప్రభాతవార్త:** సంతోష్ నగర్ పోలీసు స్టేషన్‌లో ప్రశాంత్ కుమార్ అనే యువకుడిని పోలీసులు అక్రమంగా నిర్బంధించడంతో పాటు చేయనితప్పును ఒప్పుకోమని బలవంతం చేయడంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం తీవ్రంగా స్పందించింది. దీని పై బాధితుడు కోర్టులో పోరాడుతుండగా దీనిని వెనక్కు తీసుకోవాలని సదరు యువకుడిని పోలీసులు మళ్లీ వేధిస్తుండడం సరైంది కాదని, ఈ విషయంలో వెంటనే పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిజిపి జితేందర్‌కు హెచ్‌ఆర్‌సి సిఫార్సు చేసింది. ఫిర్యాదుదారుల భద్రతను పోలీసులు కాలరాయడం సరికాదని హెచ్ఆ ర్‌సి పేర్కొంది. ఫిర్యాదిదారుడిని పోలీసులు పదేపదే బెదిరించడం సరైంది కాదని హెచ్‌ఆర్‌సి పేర్కొంది.

# గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఎప్పుడిస్తారు?

## సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రమాదాలకు గురై మరణించిన కల్లుగీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికులు వృత్తిలో భాగంగా అనేక విధాలా ప్రమాదాలకు గురౌతున్నారని.. వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకుంటున్నా హామీలే ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదన్నారు. ప్రమాదాలకు గురైన వారికి తక్షణమే రాష్ట్రప్రభుత్వం బాధితులకు ఎక్స్‌గ్రేషియా నిధులు విడుదల చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ కాలంలో దాదాపు 710 మంది వృత్తిదారులు ప్రమాదాలకు గురైతే వారిలో 130మంది మరణించగా 120 మంది శాశ్వత వికలాంగులయ్యారని సుమారు 460 మంది వికలాంగులయ్యారని గుర్తు చేశారు. ప్రమాదాలకు గురైన వారికి రూ.12.96 కోట్ల నిధులు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందన్నారు.

# వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ తొలి రౌండ్‌లో మహిళా ప్లేయర్స్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్-2025 ప్రారంభ రోజున భారతీయులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఆరుగురు భారత మహిళా క్రీడాకారిణులలో ఐదుగురు తమ తొలి రౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. ఈజిప్టులోని కైరోలో జరిగిన వ్యక్తిగత స్క్వాష్‌లో భారత స్క్వాష్ క్రీడాకారులు విజయాలతో ఆరంభించారు. అండర్ 19 ఆసియా బాలికల స్క్వాష్ ఛాంపియన్ అనాహత్ సింగ్ మొదటి రౌండ్‌లో బై పొందగా, అండర్ 17 ఆసియా జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అనికా దుబే పోలాండ్‌కు చెందిన తోలా ఒట్రాసెక్‌ను 3-1 (9-11, 11-7, 11-9, 11-3) తేడాతో ఓడించింది. రుద్ర సింగ్, నవ్య సుందరరాజన్, మరియు ఆరాధ్య పోర్వాల్ తమ ప్రత్యర్థులపై ఏకపక్ష విజయాలు సాధించారు. రుద్ర దక్షిణాఫ్రికాకు చెందిన చాంటే లెప్పన్‌ను 3-0 (11-6, 11-3, 11-3) తేడాతో ఓడించగా, నవ్య దక్షిణాఫ్రికాకు చెందిన డెనే వాన్ జైల్‌ను 3-0 (11-5, 11-8, 11-3) తేడాతో ఓడించింది. ఆరాధ్య పోర్వాల్ దక్షిణాఫ్రికాకు చెందిన మకైలా నాయుడును 3-0 (11-3, 11-3, 11-4) తేడాతో ఓడించింది. మరో వైపు ఉన్నతి త్రిపాఠి ఏకైక భారతీయురాలు, పోలాండ్‌కు చెందిన నటాలియా మియర్జెజ్యూస్కా చేతిలో 0-3 (11-13, 8-11, 9-11) తేడాతో ఓడిపోయింది. కాగా పురుషులలో అరిహంత్ కెఎస్, శివన్ అగర్వాల్ వారివారి మొదటిరౌండ్ మ్యాచ్‌లను గెలిచారు. అరిహంత్ జర్మనీకిచెందిన రూఫస్ గెబార్ట్‌ను 3-0 (11-2, 11-4, 11-5) తేడాతో ఓడించగా, శివన్ ఐర్లాండ్‌కు చెందిన ఫ్రాంక్ ఓ ఫ్లిన్‌ను 3-0 (11-3, 11-3, 11-8) తేడాతో ఓడించాడు. అయితే, కరణ్ యాదవ్ ఈజిప్ట్‌కు చెందిన ఇయాద్ దౌద్ చేతిలో 3-0 (3-11, 4-11, 5-11) తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.





# వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో.. నిరాశతో ముగిసిన భారత్ ప్రచారం

## పరుగులో గురిందర్‌వీర్, మణికంఠ ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్-2025లో స్ప్రింటర్లు మణికంఠ, గురిందర్వీర్ ఆకట్టుకోలేకపోయారు. పురుషుల 100 మీటర్ల పరుగులో మణికంఠ హోబ్లిధర్ మరియు గురిందర్‌వీర్ సింగ్ సెమీస్‌కు చేరుకోలేకపోయారు. వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో పురుషుల 100 మీటర్ల ఈవెంట్‌లో భారతదేశం యొక్క ప్రచారం నిరాశతో ముగిసింది, దేశంలోని ప్రముఖ స్ప్రింటర్లలో ఇద్దరు గురిందర్‌వీర్ సింగ్, మణికంఠ హోబ్లిదార్ ఇద్దరూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. హీట్ 7లో, గురిందర్‌వీర్ సింగ్ నిరాశపరిచే 11.00 సెకన్లు పూర్తి చేసి, నాల్గవ స్థానంలో నిలిచాడు మరియు ఆటోమేటిక్ అర్హత స్థానాలకు వెలుపల ఉన్నాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో 10.20 సెకన్లు పూర్తి చేసి వార్తల్లో నిలిచిన ఈ పంజాబ్ స్ప్రింటర్, ప్రారంభం నుంచే లయ తప్పి ఎప్పుడూ తన గరిష్ట వేగాన్ని అందుకోలేకపోయాడు. ఇటీవలి సంవత్సరాలలో భారతదేశపు అగ్రశ్రేణి స్ప్రింటర్లలో స్థిరంగా స్థానం సంపాదించిన 100 మీటర్ల స్పెషలిస్ట్ ఫామ్‌లో ఇది ఆశ్చర్యకరమైన క్షీణత. అతను రౌండ్ 1 లో పాల్గొన్న వారిలో మొత్తం 40వ స్థానంలో నిలిచాడు. ఇంతలో, 10.23 సెకన్ల మార్కుతో మాజీ జాతీయ రికార్డు హోల్డర్ అయిన మణికంఠ హోబ్లిదార్, హీట్ 8లో మరింత పోటీతత్వంతో కూడినా కాని నిరాశపరిచే పరుగును అందించాడు, 10.74 సెకన్ల సమయంతో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రతి హీట్‌లో మొదటి ఇద్దరు ఫినిషర్లు, మొత్తం మీద అత్యంత వేగంగా చేరే తదుపరి ఎనిమిది మందితో పాటు, సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. అయితే మణికంఠ సమయం వేగంగా కటాఫ్‌ను చేరుకోలేక పోవడంతో పోటీ నుండి నిష్క్రమించాడు. అతను ఫీల్డ్‌లో మొత్తం 26వ స్థానంలో నిలిచాడు.





# వాషింగ్టన్ డబుల్స్ ఓపెనర్‌లో.. వీనస్ విలియమ్స్ విజయం

**న్యూఢిల్లీ:** ఏడుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ వీనస్ విలియమ్స్ 16 నెలల్లో తన తొలి ప్రొఫెషనల్ టెన్నిస్ మ్యాచ్‌లో విజయం సాధించింది. హైలీ బాప్టిస్ట్‌తో కలిసి దీది ఓపెన్ మొదటి రౌండ్‌లో తోటి డబుల్స్ వైల్డ్ కార్డ్‌లు యూజీని బౌచర్డ్ మరియు క్లెర్వీ న్గౌనౌలను ఓడించింది. 3-1 తేడాతో వెనుకబడి, బ్రేక్ పాయింట్‌ను ఎదుర్కొన్న వీనస్ మరియు బాప్టిస్ట్ గత 12 ఆటలలో 11 ఆటలను గెలుచుకుని పుంజుకున్నారు. 2022లో మొదటి రౌండ్‌లో ఓటమి తర్వాత, వీనస్ దీది ఈవెంట్‌లో ఇది రెండవసారి. టోర్నమెంట్ కోసం వైల్డ్‌కార్డ్‌ను అంగీకరించిన 45 ఏళ్ల మాజీ ప్రపంచ నంబర్ వన్, మార్చి 2024లో మయామి ఓపెన్ తర్వాత పోటీ పడలేదు. చివరిగా ఆగస్టు 2023లో సిన్సినాటి ఓపెన్‌లో గెలిచింది. కాగా విలియమ్స్ సోదరీమణులు చాలా సంవత్సరాలుగా క్రీడలో ఆధిపత్యం చెలాయించడంతో, ర్యాంకింగ్ లేని వీనస్, మహిళల డబుల్స్‌లో సెరెనాతో కలిసి 14 ప్రధాన టైటిళ్లను గెలుచుకుంది. కాగా సింగిల్స్ పోటీలోని మొదటి రౌండ్‌లో ఆమె మరో అమెరికన్ పేటన్ స్టెర్న్స్‌తో తలపడనుంది. ఇక వాషింగ్టన్‌లో జరుగుతున్న పురుషుల సింగిల్స్‌లో బ్రిటన్‌కు చెందిన డాన్ ఎవాన్స్ మరియు కామెరాన్ నోరీ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. 2023లో వాషింగ్టన్ టైటిల్ గెలుచుకున్న ఎవాన్స్, జిజౌ బెర్గ్స్‌పై 36, 64, 63 తేడాతో కఠినమైన విజయాన్ని సాధించాడు. 35 ఏళ్ల వైల్డ్ కార్డ్ తదుపరి 13వ సీడ్ అమెరికన్ అలెక్స్ మైఖేల్‌సెన్‌తో తలపడనుంది. అలాగే నోరీ బ్రిటిష్ క్వాలిఫైయర్ బిల్లీ హారిస్‌ను 63 76 (74) తేడాతో ఓడించాడు మరియు రెండవ రౌండ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ సెమీ ఫైనలిస్ట్ మరియు ఇటలీకి చెందిన రెండవ సీడ్ లోరెంజో ముసెట్టిని ఎదుర్కొంటాడు.

# నేడు బిగ్ ఫైట్

## భారత్‌కు డూ ఆర్ డై మ్యాచ్.. సిరీస్ కైవసం కోసం ఇంగ్లండ్



**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ముగిసే సమయానికి భారత్ ప్రస్తుతం 1-2 తేడాతో వెనుకబడి ఉంది. ఈ నెల 23 నుంచి మాంచెస్టర్ వేదికగా ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో నాలుగో టెస్టు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై మ్యాచ్ కానుంది. ఇందులో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని భారత్ భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఓడినా లేదా డ్రా చేసుకున్నా, సిరీస్‌ను గెలిచే అవకాశం భారత్‌కు ఉండదు. ఈ నాలుగో కీలక టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఒక్క మార్పుతో బరిలోకి దిగుతోంది. టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టు తమ ప్లేయింగ్ 11ను ప్రకటించింది. గాయంతో సిరీస్ నుంచి తప్పుకున్న ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ లియమ్ డాసన్‌కు అవకాశం లభించింది. ఇంగ్లాండ్‌కు ఇది కీలకమైన టెస్టు కావడంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు అవకాశం ఇచ్చారు. దీంతో దాదాపు 8 ఏళ్ల తర్వాత డాసన్ టెస్టు జట్టులోకి వచ్చాడు. షోయబ్ బషీర్ గాయంతో దూరం కావడంతో డాసన్‌కు ఇంగ్లాండ్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. లార్డ్స్ టెస్టు మూడో రోజు షోయబ్ బషీర్‌కు గాయం అయింది. రవీంద్ర జడేజా కొట్టిన హిట్టింగ్ డ్రైవ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించిన సమయంలో అతని ఎడమ చేయి చిటికన వేలికి గాయం అయింది. భారత జట్టు విషయానికి వస్తే పేస్ బౌలింగ్ విభాగంలో గాయాల వల్ల సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆకాష్ దీప్ ఇంకా గాయాల నుంచి కోలుకోలేదు. అర్ష్‌దీప్ సింగ్ చేతి గాయంతో టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతను చివరి మ్యాచ్ కు కూడా అందుబాటులో ఉండే అవకాశం లేదని సమాచారం. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కంబోజ్ మాత్రమే ప్రస్తుతం భారత పేస్ బౌలింగ్ విభాగంలో ఫిట్ గా ఉన్నారు. 24 ఏళ్ల అన్షుల్ కంబోజ్‌ను రిజర్వ్‌గా జట్టులోకి తీసుకున్నారు. అతని లైన్‌లెంగ్త్ బౌలింగ్, క్రమశిక్షణ గౌతమ్ గంభీర్, అజిత్ అగార్కర్ సహా కోచింగ్ సిబ్బందిని మెప్పించడంతో జట్టులోకి వచ్చాడు. ఇక భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ కు గత మ్యాచ్ లో చేతికి గాయం అయింది. భారత ఇన్నింగ్స్ సమయంలో పంత్ బ్యాటింగ్ చేయడానికి వచ్చారు. ప్రస్తుతం గాయం తగ్గడంతో తిరిగి కీపింగ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో స్వల్పంగా అసౌకర్యంగా ఉన్నా, అతను కీపింగ్ చేస్తూ కనిపించాడు. ఇది భారత జట్టుకు పెద్ద బలంగా మారనుంది. అయితే ఆకాష్ దీప్ గాయం మరోసారి తీవ్రతరం కావడంతో అతను ఆడటం కష్టమేనని సమాచారం.

# చైనా ఓపెన్‌లో వటనాబేను ఓడించిన ప్రణయ్



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2025, ఓపెనర్‌లో వటనాబేను హెచ్ఎస్ ప్రణయ్ ఓడించాడు. ప్రపంచ 18వ ర్యాంక్‌లో ఉన్న ఆటగాడిని ఓడించడానికి 5 మ్యాచ్ పాయింట్లను ప్రణయ్ ఆదా చేశాడు. మంగళవారం జరిగిన చైనా ఓపెన్ తొలి రౌండ్‌లో భారత అనుభవజ్ఞుడు ప్రణయ్ అద్భుతమైన పునరాగమనం చేశాడు. ప్రపంచ 35వ ర్యాంకర్ ప్రణయ్, ఆ సంవత్సరం జరిగిన చివరి సూపర్ 1000 టోర్నమెంట్‌లో 57 నిమిషాల థ్రిల్లర్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ కోకి వటనాబేను 8-21, 21-16, 23-21 తేడాతో ఓడించాడు. ఈ సారి ప్రణయ్ తన ప్రచారాన్ని అస్థిరంగా ప్రారంభించాడు, దీంతో మొదటి గేమ్‌ను 8-21 తేడాతో కోల్పోయాడు. అయితే, అతను తిరిగి పుంజుకుని రెండవ గేమ్‌ను 21-16 తేడాతో కైవసం చేసుకున్నాడు. చివరి సెట్ అత్యంత నాటకీయంగా మారింది. ఒక దశలో 2-11 తేడాతో వెనుకబడిన ప్రణయ్, 5 మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని గేమ్‌ను కైవసం చేసుకుని 23-21 ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించాడు. కాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్ దగ్గర పడుతున్న తరుణంలో, ప్రణయ్ తన కాంస్య పతక విజేత ప్రదర్శన కోసం ఎదురు చూస్తున్నాడు. డెన్మార్క్‌లో జరిగిన మునుపటి ఎడిషన్‌లో ప్రపంచ నంబర్ 1 విక్టర్ అక్సెల్సెన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. ఇక భారత్ మరో ప్లేయర్ లక్ష్యయ్ సేన్ మరోసారి మొదటి రౌండ్ నుండి నిష్క్రమించాడు, ఐదవ సీడ్ లీ షిఫెంగ్ చేతిలో 21-14, 22-24, 11-21 తేడాతో గంటలో ఓడిపోయాడు.


# అనిల్ అంబానీని 'ఫ్రాడ్'గా వర్గీకరణ

**న్యూఢిల్లీ, జూలై 22:** భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్ కామ్), దాని ప్రమోటర్ డైరెక్టర్ అనిల్ డి. అంబానీలను అధికారికంగా 'ఫ్రాడ్'గా వర్గీకరించినట్టు పార్లమెంట్ తెలిపింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కు ఫిర్యాదు చేసే ప్రక్రియలో బ్యాంక్ ఉన్నట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు రాత పూర్వక సమాధానంలో తెలిపారు. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నిర్దేశించిన మోసం రిస్క్ మేనేజ్‌మెంట్ మాస్టర్ డైరెక్షన్స్, ఎస్‌బీఐ బోర్డు ఆమోదించిన పాలసీకి అనుగుణంగా జూన్ 13 న ఈ వర్గీకరణ జరిగినట్టు మంత్రి చౌదరి వివరించారు. ఈ వర్గీకరణను బ్యాంక్ జూన్ 24న ఆర్బీఐకి నివేదించింది. ఎస్‌బీఐకి ఆర్‌కామ్ పెద్ద మొత్తంలో బకాయి పడింది. ఇందులో రూ.2,227.64 కోట్ల ఫండ్ బేస్ట్ ప్రిన్సిపల్ బకాయి (ఆగస్టు 26, 2016 నుంచి వడ్డీ, ఇతర ఖర్చులు సహా), రూ.786.52 కోట్ల నాన్ ఫండ్ బేస్ట్ బ్యాంక్ గ్యారెంటీ ఉన్నట్టు మంత్రి తెలిపారు. ఆర్‌కామ్ మొత్తం రుణం మార్చి 2025 నాటికి రూ. 40,400 కోట్లుగా ఉన్నట్టు నివేదించింది. చట్టపరమైన చిక్కులు ఆర్‌కామ్ ప్రస్తుతం 2016 నాటి ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) కింద కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియలో ఉంది. కమిటీ ఆఫ్ క్రెడిటర్స్ రిజల్యూషన్ ప్లాన్‌ను ఆమోదించి, మార్చి 6, 2020న ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద దాఖలు చేసినప్పటికీ, దాని ఆమోదం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ పరిణామాలకు తోడు ఎస్‌బీఐ అనిల్ డి. అంబానీపై వ్యక్తిగత ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియను కూడా ప్రారంభించింది. ఇది ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ ముంబై వద్ద విచారణలో ఉంది. గతంలో కూడా ఈ మోసం వర్గీకరణకు సంబంధించిన వివాదం తలెత్తింది. నవంబర్ 10, 2020న ఎస్‌బీఐ ఈ ఖాతాను, అనిల్ డి. అంబానీని మోసంగా వర్గీకరించి, జనవరి 5, 2021న సీబీఐకి ఫిర్యాదు చేసింది. అయితే, జనవరి 6, 2021న ఢిల్లీ హైకోర్టు స్టేటస్ కో ఇచ్చింది. అనంతరం, సుప్రీం కోర్టు మార్చి 27, 2023న ఇచ్చిన తీర్పు (స్టేట్ బ్యాంక్ఆఫ్ ఇండియా.. ఇతరులువర్సెస్ రాజేష్ అగర్వాల్.. ఇతరులు కేసు) ప్రకారం, రుణగ్రహీతలకు మోసం వర్గీకరణకు ముందు తమ సమర్థనను వినిపించుకునే అవకాశం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో, సెప్టెంబర్ 2, 2023న బ్యాంక్ గత మోసం వర్గీకరణను రద్దు చేసింది. అయితే, జులై 15, 2024న ఆర్బీఐ జారీ చేసిన కొత్త సర్క్యులర్ ప్రకారం తిరిగి ప్రక్రియ నిర్వహించి, ఖాతాను మళ్లీ మోసంగా వర్గీకరించింది.




# ఆల్‌టైమ్ గరిష్టానికి ఎటెర్నల్ షేర్లు

**ముంబై, జూలై 22:** జొమాటో, బ్లింకిట్ పేరిట వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎటెర్నల్ షేర్లు కొత్త మైలు రాయిని అందుకున్నాయి. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో మంగళవారం కంపెనీ షేర్లు రూ.311 వద్ద ఆల్‌టైమ్ గరిష్టాన్ని తాకాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు దాటింది. నిఫ్టీ 50లో ప్రముఖ కంపెనీలైన విప్రో, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లే ఇండియా వంటి కంపెనీలను అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఇలో ఎటెర్నల్ షేర్లు 10 శాతం లాభంతో రూ.299.75 వద్ద ముగిశాయి. త్రైమాసిక ఫలితాల్లో ఎటెర్నల్ లాభాల్లో 90 శాతం క్షీణత నమోదైంది. కేవలం రూ.25 కోట్ల నికర లాభాన్ని మాత్రమే నమోదు చేసింది. అదే సమయంలో ఆదాయంలో మాత్రం 70 శాతం వృద్ధి నమోదు చేసింది. గతేడాది రూ.4,206 కోట్లుగా ఉన్న ఆదాయం రూ.7,167 కోట్లకు పెరిగింది. దీనికితోడు క్విక్ కామర్స్ విభాగమైన బ్లింకిట్ రాణించడంతో ఎటెర్నల్‌కు కలిసొచ్చింది. జొమాటో నెట్ ఆర్డర్ వాల్యూను (వివీజు) తొలిసారి బ్లింకిట్ దాటేసింది. గతేడాదితో పోలిస్తే గ్రాస్‌ఆర్డర్ వాల్యూలో 140 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ఇన్వెస్టర్లను మెప్పించింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు బ్రోకరేజీ సంస్థలు కూడా ఎటెర్నల్‌కు బై రేటింగ్ ఇచ్చాయి. నొమురా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.280 నుంచి రూ.300కు పెంచగా, నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన టార్గెట్ ప్రైస్‌ను రూ.290 నుంచి రూ.320కి సవరించింది. జెఫ్రీస్ అయితే ఏకంగా ఎటెర్నల్ టార్గెట్ ప్రైస్‌ను రూ.250 నుంచి రూ.400కు పెంచడం గమనార్హం. ఈ కారణంగా ఎటెర్నెల్ షేర్లు దూసుకెళ్లాయి. గత 12 నెలల్లో ఎటెర్నెల్ షేర్లు 33 శాతం రాణించగా, 2025 లో 7 శాతం మేర పెరిగాయి. మరోవైపు ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ విభాగంలో ఉన్న స్విగ్గీ షేర్లు కూడా రాణించాయి. ఎటెర్నెల్ ఎఫెక్ట్‌తో 5 శాతానికి పైగా లాభంతో రూ.418 వద్ద ముగిశాయి.



# పేటీఎం నికర లాభం రూ.122.5 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలను మంగళవారం పేటీఎం పేరెంట్ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ విడుదల చేసింది. 2025-06 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నికర లాభం రూ.122.5 కోట్లుగా ప్రకటించింది. ఈ యేదాది ఈ సంస్థ భారీగా లాభాల్లోకి దూసుకెళ్లింది. గత త్రైమాసికంలో నివేదించబడిన రూ.540కోట్ల నికర నష్టంతో పోలిస్తే ఈ యేడాది భారీగా పెరిగింది. కార్య కలాపాల ద్వారా కంపెనీ ఆదాయం రూ.1,918 కోట్లుగా ఉంది.





# ఎంఅండ్ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లాభం 3.2% వృద్ధి

**ముంబై, జూలై 22:** మహీంద్రా అండ్‌మహీంద్రా (ఎంఅండ్ఎం) ఫైనాన్షియల్ సర్వీసెస్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. స్టాండ్ ఎలోన్ నికర లాభం రూ.3.2శాతం పెరిగి రూ.530 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.513 కోట్లుగా ఉంది. ముంబై ప్రధాన కార్యాలయం కలిగిన గ్రామీణ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి) మొత్తం ఆదాయం 18శాతం పెరిగి రూ.4,438 కోట్లకు చేరుకుంది. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో రూ.3,760 కోట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 1000 కంటే ఎక్కువ కార్యాలయాలతో భారతదేశంలోని అగ్ర ట్రాక్టర్ ఫైనాన్సర్లలో ఇది ఒకటి.

# ఆరంభంలో లాభాలు..చివరికి ఫ్లాట్‌గా సూచీలు

**ముంబై, జూలై 22:** తొలి త్రైమాసిక ఫలితాల జోష్‌తో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు, చివరికి ఫ్లాట్‌గా ముగిశాయి. ఎటెర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. అయితే, అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడం, ట్రంప్ నిర్దేశించిన గడువు ఆగస్టు 1 దగ్గర పడుతుం డడంతో మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82,527.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,200.34) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,110.63 82,538.17 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.80 పాయింట్ల నష్టంతో 25,060 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.36గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటెర్నల్, టైటాన్, బీఈఎల్, మారుతీ సుజుకీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, ఎస్‌బీఐ, రిలయన్స్, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.49 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,396 డాలర్ల వద్ద కొనసాగింది.




# వాణిజ్యం

# గూగుల్ 11వేల యూట్యూబ్ ఛానళ్లపై వేటు

**ముంబై, జూలై 22:** వివిధ దేశాలకు సంబంధించి అసత్య ప్రచారాలను వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపిస్తూ గూగుల్ దాదాపు 11వేల యూట్యూబ్ ఛానళ్లను తొలగించింది. వీటిలో చైనా, రష్యాకు చెందిన ఛానళ్ల టాప్ లిస్టులో ఉన్నట్లు వెల్లడించింది. తొలగించిన వాటిలో కేవలం చైనాకు సంబంధించినవే 7,700 యూట్యూబ్ ఛానళ్లు ఉన్నట్లు తెలిపింది. అవి భారత్‌లో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా పార్టీకి సంబంధించి ప్రచారాలు చేస్తున్నాయని.. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రశంసిస్తూ పలు కంటెంట్‌లను పోస్టు చేస్తున్నాయని ఆరోపించింది. రష్యాకు చెందిన 2,000లకు పైగా యూట్యూబ్ ఛానళ్లు, ఇతర వెబ్‌సైట్లను తొలగించినట్లు గూగుల్ వెల్లడించింది. ఈ ఖాతాల్లో ఉక్రెయిన్, నాటోలను విమర్శిస్తూ.. రష్యాకు మద్దతిచ్చేలా సందేశాలను వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొంది. రష్యాలోని పలు సంస్థలకు కూడా ఈ ఛానళ్లతో సంబంధాలు ఉన్నట్లు తెలిపింది. ఇటీవల గూగుల్ 20 యూట్యూబ్ ఛానెల్‌లు, నాలుగు ఖాతాలు, రష్యా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మీడియా సంస్థకు సంబంధించిన ఓ బ్లాగును తొలగించినట్లు వివరించింది. చైనా, రష్యాలతో పాటు ఇరాన్, తుర్కియే, ఇజ్రాయెల్, రొమేనియా, అజర్‌బైజాన్, ఘనాకు చెందిన యూట్యూబ్ ఛానళ్లను కూడా తొలగించినట్లు గూగుల్ తెలిపింది. ఆయా దేశాలకు చెందిన యూట్యూబ్ ఛానళ్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే.. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా అసత్య వార్తలు ప్రసారం చేస్తున్నందువల్ల వాటిని నిలువరించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. 2025 మొదటి త్రైమాసికంలో గూగుల్ 23,000లకు పైగా ఖాతాలను తొలగించింది. మెటా సైతం ఇటీవల దాదాపు 10 మిలియన్ల నకిలీ ప్రొఫైల్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించింది.




# కాల్గేట్-పామోలివ్ లాభం రూ.363.98 కోట్లు

**ముంబై, జూలై 22:** ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కాల్గేట్-పామోలివ్ లిమిటెడ్ నికర లాభం రూ.363.98 కోట్లకుచేరుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా కంపెనీ ఆదాయం కూడా 4.4శాతం తగ్గి రూ.1,420.64 కోట్లకు చేరుకుంది. వేగంగా కదిలే వినియోగ వస్తువుల మేజర్ యొక్క కార్యాచరణ లాభం రిపోర్టింగ్ త్రైమాసికంలో రూ.431.95 కోట్లు, ఇది గత సంవత్సరం రూ.489.25 కోట్ల కంటే తక్కువ. 'పట్టణ డిమాండ్ తగ్గడం, పెరిగిన పోటీ తీవ్రత కారణంగా కఠినమైన ఆపరేటింగ్ పరిస్థితుల నుంచి నిరంతర ఎదురుదెబ్బలను మా తొలి త్రైమాసిక ఫలితాలను ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత త్రైమాసిక పనితీరు మునుపటి సంవత్సరం కంటే అధిక బేస్ సైకిల్ ద్వారా కూడా ప్రభావితమవుతుంది' అని మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రభా నరసింహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సవాళ్లను అధిగమించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ భాగంలో క్రమంగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.